Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి:57 • సంచిక:281 • శనివారం 26 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool|Anantapur|Nellore

మహా పూర్ణాహుతి!



ఎర్రవల్లిలో సహస్ర చండీయాగం చివరి రోజు.. హోమగుండంలో ద్రవ్యాలు సమర్పిస్తున్న కేసీఆర్

2 లో



భారతరత్న ప్రణబ్

ప్రణబ్ సంపూర్ణ అర్హుడు : సీఎం కేసీఆర్

- నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హాజారికాలకూ భారతరత్న


4 తెలుగు పద్మాలు



సిరివెన్నెల సీతారామ శాస్త్రి



నానాజీ దేశ్‌ముఖ్



సునీల్ ఛత్రి



భూపేన్ హాజారికా



ద్రోణవల్లి హారిక



ప్రభుదేవా



యడ్లపల్లి వెంకటేశ్వరరావు



మోహన్‌లాల్

న్యూఢిల్లీ: ఈ ఏడాది పద్మ పురస్కారాలను ప్రకటించారు. ముగ్గురికి భారత రత్న అవార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి, మరణానంతరం జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నానాజీ దేశ్ ముఖ్‌కి, ప్రముఖ విద్యాంసుడు, కవి, రచయిత భూపెన్ హజారికాకి ఈసారి భారత రత్న అవార్డులు ప్రకటించారు. 2019 సంవత్సరానికి నలుగురుకి పద్మ విభూషణ్, 14 మందికి పద్మ భూషణ్ అవార్డులు ప్రకటించారు. పద్మభూషణ్ అందుకున్నవారిలో ఇద్దరు విదేశీయులు ఉండడం విశేషం. ప్రముఖ జర్నలిస్టు, కాలమిస్టు కులదీప్ నయ్యార్‌కి మరణానంతర పద్మ భూషణ్ అవార్డును ప్రకటించారు. ఇక పద్మశ్రీ అవార్డులను 94 మందికి ప్రకటించారు. కర్నాటక నుంచి కళలు, నృత్య విభాగంలో ప్రభు దేవాకి, సంపూర్ణ నటుడు మోహన్‌లాల్‌కి పద్మశ్రీ అవార్డు ప్రకటించారు. తాజా పద్మ పురస్కారాల్లో 21 మంది మహిళలు, ఎన్ఆర్ఐ, విదేశీ కేటగిరిలో 11 మందికి, ముగ్గురుకి మరణాంతర, ఒక ట్రాన్స్ జెండర్ అవార్డులు దక్కాయి. తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి పద్మశ్రీలు దక్కాయి. వీరిలో గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, చదరంగ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ ఛత్రి సునీల్, వ్యయసాయ రంగంలో విశిష్ట సేవలందించిన యడ్లపల్లి వెంకటేశ్వర రావు ఉన్నారు.

పూర్తి కథనం 3లో...



మధుసూదన్‌రెడ్డి

14 మందికి పోలీస్ పతకాలు

11 లో

- ఏసీబీ అదనపు ఎస్పీ మధుసూదన్‌రెడ్డికి రాష్ట్రపతి పతకం

పాలమూరు ప్రాజెక్టు ఇక పరుగులే!

ఆఖరి అనుమతి వచ్చేసింది

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖ

పర్యావరణ అనుమతులన్నీ క్లియర్

- ఇక పనులు వేగవంతం
- టన్నెల్ తవ్వకానికి తొలగిన అడ్డంకి
- భేష్ భేష్.. అధికారులకు సీఎం కేసీఆర్ అభినందనలు
- కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణశాఖ నుంచి రావలసిన అన్ని అనుమతులు వచ్చేశాయి. ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత ముఖ్యమైన ఘట్టం పర్యావరణ అనుమతులే అయినందున ఇరిగేషన్, అటవీశాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్వయం పర్యవేక్షణతో సమయానుకూలంగా స్పందన లభించింది. ఇప్పటికే పురోగతి దిశలో ఉన్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తుది అనుమతి కూడా రావడంతో ఇక పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇందుకు సంబంధించి సహస్ర మహాచండీయాగంలో ఉన్న కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వ విజ్ఞప్తిపై స్పందించి అనుమతులు మంజూరు చేసిన కేంద్ర పర్యావర ణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపా రు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు, వెయ్యికిపైగా గ్రామాలకు



తాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ తుది అటవీ అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పర్యావరణ అటవీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి కేంద్ర అటవీశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రవణ్ కుమార్ వర్మ శుక్రవారం లేఖ రాశారు. ప్రాజెక్టు నిర్మాణానికి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అటవీ

10వ పేజీలో...

విభజిస్తాం.. రండి!

- రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారంపై కేంద్ర హోంశాఖ నుంచి రెండు తెలుగురాష్ట్రాలకు లేఖలు
- ఎనిమిది అంశాలతో ఎజెండా
- ఫిబ్రవరి 1న రావాలని సీఎస్‌లకు సూచన

వివరాలు 10లో...

ఓటెత్తిన మహిళా లోకం

మలివిడతలోనూ కారు జోరు




అబ్దుల్లాపూర్ మెట్ పంచాయతీ ఎన్నికల్లో ఓటేశాక ఓ వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం.

88.26% పోలింగ్

- పంచాయతీ ఎన్నికల్లో రెండో స్థానంలో కాంగ్రెస్
- 109 పంచాయతీలు ఏకగ్రీవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ మద్దతుదారుల ప్రభంజనం కొనసాగింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో తెరాస మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటిన సంగతి తెలిసిందే. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరిగిన 3,342 గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా గులాబీ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. ఏకగ్రీవాలతో కలిపి 2,500లకుపైగా గ్రామ పంచాయతీలను తెరాస మద్దతుదారులు తమ ఖాతాలో వేసుకున్నారు. ప్రతి జిల్లాలోనూ తెరాస హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో ఉనికి చాటుకుంది. ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 800లకుపైగా గ్రామ పంచాయతీల్లో గెలుపొందారు. తెలుగుదేశం, భారతీయ జనతాపార్టీ, వామపక్షాలు ఈ ఎన్నికల్లో రెండంకలకే పరిమితమయ్యాయి. రెండు విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెరాస మద్దతుదారులు పల్లెల్లో


8వ పేజీలో...



అరుదైన ఘట్టాన్ని ఓటుతో ఆహ్వానిద్దాం

- 2019 లోక్‌సభ ఎన్నికలతో చెరగని ముద్ర
- రాష్ట్రపతి కోవింద్ గణతంత్ర దినోత్సవ సందేశం

3 లో



ఆమే ఒక సైన్యం

11 లో

పురుష దళానికి తొలి కమాండర్ హైదరాబాద్ అమ్మాయి

- నేడు రాజ్‌పథ్‌లో జవాన్ల కవాతుకు భావన కస్తూరి సారథ్యం



కోట్ల మందికి విజ్‌డమ్ కుచ్చుటోపి!

- ఒక్క భారత్‌లోనే 70వేల మంది బాధితులు
- జాబ్ పోర్టల్ వేదికగా మోసం
- ఫీజుల రూపంలో రూ.70 కోట్లు స్వాహా
- విదేశాల్లో ఉద్యోగాల ఎరతో వల
- విజ్‌డమ్ సీఈఓ అజయ్ కొల్లాతో సహా 14 మంది అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ, విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ మోసం చేసిన ఓ ముఠా గుట్టు రట్టయింది. విజ్‌డమ్ జాబ్స్ ఇండియా.కామ్., విజ్‌డమ్ జాబ్స్ గల్ఫ్.కామ్ పేరిట రెండు జాబ్ పోర్టల్ వెబ్‌సైట్స్‌తో ఎరవేసి నిరుద్యోగ యువత నుంచి కోట్లలో రిజిస్ట్రేషన్ ఫీజు దండుకుని ఘరానా మోసానికి పాల్పడిన ముఠాలోని 14మందిని సైబరాబాద్ పోలీసులు

2వ పేజీలో...

ఎర్రవల్లిలో ముగిసిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం

శాస్త్రోక్తంగా రాజశ్యామల మాతకు సౌభాగ్య ద్రవ్య సమర్పణ



దివ్య నీరాజనం.. మహా పూర్ణాహుతి

బగలాముఖి, నవగ్రహ, ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణవేద మండపాల్లో పూర్ణాహుతి

● యాగశాలల్లో పారాయణాలు, జపాలకు తద్దశాంశ హోమ తర్పణాలు ● సుహాసిని పూజ, మహదాశీర్వచనం, ఋత్విక్ సన్మానంతో పరిసమాప్తి ● ఐదు రోజులు వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం శుక్రవారంతో ముగిసింది. మధ్యాహ్నం 300 మంది ఋత్విక్కులు, వేద పండితుల సమక్షంలో పూర్ణాహుతితో ఈ యాగాన్ని కేసీఆర్ దంపతులు పరిసమాప్తం చేశారు. ఐదు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా, భక్తి శ్రద్ధలతో వేదమంత్రోచ్చారణలతో ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం మారుమ్రోగింది. మహా చండీయాగం చివరి రోజున 8 మండపాల్లో పూర్ణాహుతి జరిగింది. విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. రాజశ్యామల మండపం, బగలాముఖి మండపం, నవగ్రహ, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద మండపాల్లో ముందుగా పూర్ణాహుతి కార్యక్రమాలను పూర్తిచేశారు. ఈ 8 మండపాల్లో పూర్ణాహుతి ముగిసిన తర్వాత ప్రధాన యాగశాల చండీమాత మహా మండపంలో పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతిరోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం కేసీఆర్ దంపతులు మొదట రాజశ్యామలా దేవీ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆ తర్వాత బగలాముఖి మండపంలో జయపీతాంబరధారణి, దివ్య వేదోక్త మహానీరాజనం కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. నవగ్రహ మండపం, మహారుద్ర చతుర్వేద మండ పాల్లో వేర్వేరుగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సహస్ర శీర్ష, పురుష సంవేదపుష్పమాం, పుష్పమాలికాం సమర్పయామి... సౌభాగ్య ద్రవ్య సమర్పయామి అంటూ 9 యాగశాలల్లో పూర్ణాహుతిని పరిసమాప్తం చేశారు.



ఐదవరోజు యాగం... అద్భుతం

గత ఐదు రోజులుగా శాస్త్రోక్తంగా నిర్వహించిన యాగాలు, పారాయణాలు, జపాలకు చివరి రోజైన శుక్రవారం తద్దశాంషహోమ తర్పణాలను నిర్వహించారు. ప్రధాన కలశం అధిష్టాన దేవతా మండపం వద్ద శారదా కల్పవృక్షం అనుసరించి అమ్మవారికి షోడశోపచార పూజ నిర్వహించారు. అనంతరం చతుష్షి యోగినీ బలి, మంగళ నీరాజన సేవ నిర్వహించారు. అనంతరం అగ్ని మథనం ద్వారా అగ్రిప్రతిష్ఠ చేసి పది గుండాల వద్ద అదే అగ్నితో హోమం ఆరంభించారు. పది యజ్ఞ గుండాలలో ఒక్కో యజ్ఞకుండం వద్ద ఆచార్య బ్రహ్మతో కలిపి 11మంది వేద పండితులు పాయసం, తెల్లనువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని ఆహుతులిస్తూ హోమాన్ని నిర్వహించారు. అనంతరం అష్టదిక్పాలక బలి, ప్రాయశ్చిత్త హోమాల ను నిర్వహించా రు. 700 సప్తశతీ చండీ శ్లోకాల స్వాహాకారాలకు పాయసం, తెల్ల నువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని యజ్ఞ భగవానుడికి హవిస్సుగా సమర్పించారు. మహా పూర్ణాహుతిలో భాగంగా చండీయాగ మండపంలోని అన్ని యజ్ఞ గుండాల అగ్నిని ప్రధాన యజ్ఞ గుండంలోకి తీసుకువచ్చి మహా పూర్ణాహుతిని ప్రారంభించారు. పసుపు, కుంకుమ, ఖర్జూర, వక్కలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, జీడిపప్పు, పటికబెల్లం, బాదం, పచ్చకర్పూరం, గంధకచూరం, పూలు, పండ్లు, తమలపాకులు, పట్టుచీర, మారేడుకాయలు తదితర మంగళ ద్రవ్యాలను యజ్ఞ ఆచార్యుడు పూర్ణాహుతిలో భాగంగా యజ్ఞ భగవానుడికి సమర్పించారు. అనంతరం వసోర్ధార... అంటే నెయ్యిని ధారగా పోసి పూర్ణాహుతి అనంతరం యజ్ఞ భగవానుడికి సమర్పించే ప్రక్రియను ప్రారంభించారు. అలాగే మహారుద్ర, రాజశ్యామల, బగలాముఖి, చతుర్వేద, నవగ్రహ యాగం మండపాల్లో కూడా షోడశోపచార పూజలు చేశారు. హోమాల అనంతరం అన్ని మండపాల్లోనూ పూర్ణాహుతి, సుహాసిని పూజ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



పాయస ద్రవ్య విశేషాలు

యాగంలో చివరి రోజైన శుక్రవారంనాడు చండీమాత యాగశాలలో అగ్నిస్థాపన చేసి హోమాన్ని పరిసమాప్తం చేశారు. చండీ సప్తశతి 700 శ్లోకాల్లోని ప్రతి శ్లోకానికి జుహుయత్ పాయసం, తిలసర్పిషా, నువ్వులు, నెయ్యితో పాటు పాయసాన్ని కలిపి ఆహుతి ఇచ్చారు. సుమారు వెయ్యి కిలోల పాయసాన్ని అందుకోసం వినియోగించారు.

కలే చండీ విశిష్యతే

కలియుగంలో త్వరగా ఫలితానిచ్చేది చండీ దేవత. ఆమెను ఉపాసించి ఎంతో మంది సత్ఫలితాలను పొందారు. శాస్త్రాల సూచన మేరకు అమ్మవారు సప్తశతిలో ఒక మాటను సూచించారు. 'ఎక్కడైతే సప్తశతి పఠించబడుతుందో అక్కడ నేను ఉంటాను... కేవలం ఉండడమే కాదు సదామత ద్వీమోక్షామి ఎప్పుడూ ఆ ప్రాంతాన్ని విడిచి ఉండను' అన్న శాస్త్రోక్తులను వేద పండితులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. మణి ద్వీపము, సుభిక్షము, సస్యశ్యామలము... వీటన్నింటినీ చండీ ఉపాసన ప్రశస్త్యమై ఉంటాయని చెప్పారు. కేసీఆర్ దంపతులు చండీ సంబంధిత అన్ని రకాల ఉపాసనలు పూర్తిచేశారు. దేశ క్షేమం, లోక సంరక్షణమే ప్రధాన ధ్యేయంగా రాజశ్యామల యాగాన్ని సంకల్పించారు. బగలాముఖి, నవగ్రహ, చతుర్వేద, మహారుద్ర, సహస్ర చండీ మహా యాగాన్ని పూర్తిచేసి శృంగేరి జగద్గురులు శ్రీ భారతీతీర్థ స్వామి, విధుశేఖర భారతీ మహాస్వాముల వారి ఆశీస్సులను అందుకున్నారు. గణపతి సహస్ర మోదక హోమము, రాజశ్యామల మహా మంత్రానుష్ఠానము, లక్షబగలాముఖి మహామంత్రానుష్ఠానము, వెయ్యి చండీ పారాయణములు, మహారుద్ర మంత్రముల అనుష్ఠానములను పూర్తిచేసి దశాంశ హోమపక్షమును ఆశ్రయించారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మహాద్భుతంగా అన్ని యాగశాలల్లో పూర్ణాహుతులను పరిసమాప్తం చేసి సహస్ర చండీ మహాయాగ పూర్ణాహుతిని అత్యంత వైభవంగా కేసీఆర్ దంపతులు పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి ప్రత్యక్షంగా పాల్గొని అనుగ్రహించారు. శృంగేరీ, జీయర్, ఉడిపి పీఠాల నుంచి యాగం ముగింపు రోజున ప్రసాదాలు వచ్చాయి. సీఎం కేసీఆర్ ఋత్విక్కులందరినీ ఘనంగా సన్మానించారు.

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ షష్ఠి, రా.10.24 వరకు అనంతరం సప్తమి; నక్షత్రం: హస్త రా.9.02 వరకు, అనంతరం చిత్త; అమృతకాలం: మ.3.30 నుండి 5.00 వరకు; వర్జ్యం:శే ఉ.7.43 వరకు, రా.తె 4.44 నుండి 6.16 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుండి 7.36వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు

షాక్‌కర్స్...!



డబ్బుకొద్దీ 'సర్వే'యర్లు
పవర్‌తోనే ఫాలోయర్లు!
స్కీములకే ఓటర్లు
స్కాములతో చీటర్లు!

సంపదిస్తేనే పదిలం
సంక్షేమంతోనే పీఠం!
తగ్గుతోంది కులకలహం
ఉపాధికే యువజనం!

-దిన్నా

కోట్ల మందికి విజ్‌డమ్ కుచ్చుటోపీ!



పోలీసుల అదుపులో నిందితులు

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేశారు. దాదాపు 3 కోట్ల మంది వీరి వలలో పడ్డారని, దాదాపు రూ.70 కోట్లు వీరు రిజిస్ట్రేషన్ ఫీజుగా వసూలు చేశారని దర్యాప్తులో తేలింది. బహుళజాతి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన ఈ ముఠా అదే తరహాలో ఇంటర్వ్యూ తతంగాన్ని నిర్వహించేది. నిరుద్యోగికి పూర్తి విశ్వాసం కలిగించేలా చేసి... అప్లికేషన్‌కు, ఇంటర్వ్యూకు, ప్రాసెసింగ్ పేరుతో విడతవారీగా యూఎస్ డాలర్లలో భారీ మొత్తం వసూలు చేసి... ఆ తరువాత సంప్రదింపులకు తెరవేసేది. ఇలా భారత్‌తో సహా పాతిక దేశాల్లో నిరుద్యోగులను ముంచేసింది. హైదరాబాద్‌లో ఓ నిరుద్యోగి ఈ మోసాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావడంతో అసలు గుట్టు రట్టయిందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ శుక్రవారం మీడియాకు వివరించారు.

హైదరాబాద్ బాధితుడి ఫిర్యాదుతో కదిలిన డొంక

ఈ ముఠా వలలో పడి మోసపోయిన హైదరాబాద్ చింతల్‌కు చెందిన గన్నవరపు ఏడు కొండలు ఈ నెల 21న సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఎలా మోసపోయిందీ పోలీసులు వివరించారు. వారి కథనం ప్రకారం విజ్‌డమ్ జాబ్స్‌గల్ఫ్.కామ్‌లో తన రెజ్యూమ్ అప్‌లోడ్ చేసుకున్నాడు. తర్వాత విజ్‌డమ్ జాబ్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ నుంచి ఫిర్యాదుదారుకు ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన యువతి తన పేరును మౌనికారెడ్డి అని పేర్కొంటూ వివరాలు చెప్పింది. రెజ్యూమ్ రైటింగ్, రెజ్యూమ్ ఫార్వర్డింగ్, రెజ్యూమ్ హైలేటెన్ తదితర వెబ్‌సైట్‌లో అందజేసిన సర్వీసులను మెన్షన్ చేసింది. తమది నమ్మదగ్గ సర్వీస్ అని నమ్మబలికింది. తదనంతరం రెజ్యూమ్ ఫార్వర్డ్ చేసేందుకు 150 యూఎస్ డాలర్లు చెల్లించాలని ఒత్తిడి తెచ్చింది. తప్పనిసరిగా మిడిల్‌ఈస్ట్‌లో మంచి ఆర్గనైజేషన్‌లో జాబ్ వస్తుందని, ఆయా ఆర్గనైజేషన్స్‌తో తమ కంపెనీ టైఅప్ పెట్టుకుందని వివరించింది. దీంతో ఫిర్యాదుదారు ఆ మాటలు విశ్వసించి 150 యూఎస్ డాలర్లు చెల్లించేశాడు.

ముఠాలో ఎవరేం చేశారంటే...

మాదాపూర్ హైటెక్ సిటీలో విజ్‌డమ్ ఐటీ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట 2009లో తానే డైరెక్టర్/సీఈవోగా కంపెనీని అజయ్ కొల్లా ప్రారంభించాడు. 2011 ఫిబ్రవరిలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో కంపెనీ పేరును నమోదు చేశాడు. కంపెనీలో పనిచేస్తున్న టీమ్ లీడర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు సయ్యద్ మజ్హర్ శిక్షణ ఇచ్చేవాడు. 2017లో జాయిన్ అయిన రోహిత్ కన్స్యూమర్ సేల్స్ డివిజన్, గల్ఫ్ హెడ్ ఆఫ్ ది ఆపరేషన్‌గా వ్యవహరించాడు. అంతకు మునుపు మాన్‌స్టర్ అనే సంస్థలో 11 ఏళ్లు చేశాడు. కన్స్యూమర్ సేల్స్ డివిజన్, గల్ఫ్ టీమ్ లీడర్స్‌గా, మిడిల్‌ఈస్ట్‌లో మల్టీనేషనల్ కంపెనీస్ హెచ్‌ఆర్ పర్సనల్‌గా బస్వరాజ్, గోపీనాథ్, రాజేష్, శుభం కుమార్ సింగ్, సామ్రాట్ పండుగుల రోల్ ప్లే చేశారు. కన్స్యూమర్స్ సేల్స్ డివిజన్, గల్ఫ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా నిఖితా జైన్, మాధురి వీపూరిలు కంపెనీ అందించే ఆఫర్‌లు వివరించి నిరుద్యోగ యువతను ట్రాప్ చేసేవారు. కార్తీక్, శ్యామ్‌కాంత్‌లు కన్స్యూమర్ సేల్స్ డివిజన్, ఇండియా సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించి.. కంపెనీ అందించే ఆఫర్‌లు వివరించి నిరుద్యోగ యువతను బుట్టలో పడేసేవారు. కంపెనీ కన్స్యూమర్స్ సర్వీసెస్ ఇన్ ఇండియా హెడ్ ఆఫ్ ఆపరేషన్‌గా రవికిరణ్ వ్యవహరించారు. కన్స్యూమర్స్ సర్వీసెస్ ఇన్ ఇండియా టీం లీడర్‌గా శ్రీకాంత్ జీ కథ నడిపాడు.

అసలు ఇంటర్వ్యూ మాదిరిగానే డ్రామా

ఉద్యోగం ఇస్తామంటూ ఫీజు వసూలు చేసిన విజ్‌డమ్ సంస్థ... ఇంటర్వ్యూ డ్రామాను కూడా రక్తికట్టించింది. హైదరాబాద్‌కు చెందిన ఏడుకొండ లూ అలానే మాయ లోపడ్డాడు. అప్లికేషన్ ఫార్వర్డ్ చేసిన తర్వాత విజ్‌డమ్ కంపెనీ నుంచి అతడికి ఫోన్ వచ్చింది. ఇంటర్వ్యూకు వెళ్లిన తర్వాత రావన్ జనరల్ పెట్రోలియం హెచ్‌ఆర్ మేనేజర్‌తో ఇంటర్వ్యూ ఎరేంజ్ చేసింది. అక్కడి నుంచి ఇంటర్ కాల్‌లో ఏంజిలా బోస్ రావన్ జనరల్ పెట్రోలియం రిప్రజెంటేటివ్ ఫోన్ వచ్చింది. దాదాపుగా 40 నిమిషాల పాటు ఈ తతంగం కొనసాగింది. సీనియర్ ఇంజనీర్‌గా సెలెక్టయ్యారని పేర్కొన్నారు. రావన్ జనరల్ పెట్రోలి యంకు చెందిన జెస్సీ నుంచి ఫోన్ వచ్చింది. జాబ్ నిమిత్తం సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల కింద 525 యూఎస్ డాలర్స్ సెక్యూరిటీ డిపాజిట్‌గా విజ్డం కంపెనీకి చెల్లించారని కోరడంతో ఏడు కొండలు ఆమేరకు చెల్లింపులు చేశాడు. అనంతరం విజ్‌డమ్ నుంచి ఎలాంటి కాల్ రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో విజ్డం ఏ విధంగా ఎలాంటి ఆయా కంపెనీలతో ఎలాంటి ఎంవోయూలు కుదుర్చుకోకుండా నిరుద్యోగులను మభ్యపెడుతుందోనన్న అంశంపై దృష్టిసారించి నిజనిర్ధారణకు వచ్చాక ఈ కంపెనీకి చెందిన 14 మంది నిందితులను అరెస్టు చేశామని సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు.

రూ. 23 లక్షలు సీజ్

ఇండియా, మిడిల్ ఈస్ట్‌సౌతాఫ్రికా, ఈజిప్ట్, ఖతర్, నెదర్లాండ్స్, జోర్డాన్, లెబనాన్, యూకే, శ్రీలంక, ఆస్ట్రేలియా, మలేసియాలలో మొత్తంగా లక్ష మంది నుంచి రూ.70 కోట్లను ఉద్యోగాల పేరిట విజ్డం కంపెనీ దండుకుంది. ఇండియాలో 69,962 మంది నుంచి రూ.28 కోట్లు, విదేశాల్లో 35,000 మంది నుంచి 40 కోట్లు దండుకుంది. దేశ, విదేశాల్లో ఆయా కంపెనీలతో ఎలాంటి ఎంవోయూలు కుదుర్చుకోకుండా స్వంతంగానే ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ జాబ్ వచ్చేసిందని నమ్మబలికిస్తూ నిరు ద్యోగ యువత నుంచి కోట్లలో సొమ్ములు దండుకుంది విజ్‌డమ్ అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. ఆల్ ఓవర్ ఇండియాలో మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో బాధితులు వేల సంఖ్యలో ఉన్నారని పోలీసులు తెలిపారు. నిందితుల బ్యాంకు అకౌంట్స్ నుంచి 23 లక్షలు సీజ్ చేశామని కమిషనర్ సజ్జనార్ తెలిపారు. కాగా రెండు వెబ్ సైట్లలో 2.85 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.4 కోట్లు ఉన్నట్లు తెలుస్తోందని కమిషనర్ సజ్జనార్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 25 ప్రాంతాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు విజ్‌డమ్ పాల్పడిందని కమిషనర్ సజ్జనార్ పేర్కొన్నారు.

ఉపాసనతో ఉత్తేజం

ఆమె ట్వీట్‌కు కేటీఆర్ స్పందన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీ నటుడు రాంచరణ్ సతీమణి ఉపాసన ట్వీట్‌కు టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఇటీవల దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశానికి ఉపాసన హాజరయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకున్న కంపెనీలకు సమాచారం అందించి తనవంతు సాయం చేసేందుకు ఫోరంలోని తెలంగాణ డెస్క్‌కు సమన్వయకర్తగా ఉపాసన వ్యవహరించారు. ఈ విషయాన్ని ఉపాసన ట్విట్టర్‌లో వెల్లడించారు. ''నా కొత్త ఉద్యోగం ఎలా ఉంది కేటీఆర్ సర్'' అంటూ ఆయనకు ట్వీట్ చేశారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ ట్విట్టర్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఉపాసన చేస్తున్న పనితో తమ బృంద సభ్యుల్లో ఉత్తేజం రెట్టింపవుతుందని పేర్కొన్నారు.

చిన్ని గుండెకు కవితతోడు!

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన సోదరి, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇద్దరూ సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు. ఏవైనా సమస్యలను ప్రజలు సామాజిక మాధ్యమాలలో ప్రస్తావిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు. తాజాగా భద్ర నాని అనే యువకుడు ట్విట్టర్‌తో స్పందిస్తూ మేడం మిమ్మల్ని అభ్యర్థి స్తున్నా... నా సోదరుడికి 45 రోజుల వయసున్న కుమారుడున్నాడు. అతడి గుండెలో మూడు రంధ్రాలున్నాయి. చిన్నారికి వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెబుతున్నారు కానీ నా సోదరుడి వద్ద డబ్బులన్నీ అయిపోయాయి, మేం ఆశలన్నీ వదులుకున్నాం, దయచేసి సాయం చేయండని విజ్ఞప్తి చేశారు. చిన్నారి న్యూమోనియాతో బాధపడుతున్నాడని కూడా తెలిపారు. ఈ ట్వీట్‌కు కేటీఆర్, కొణిదెల ఉపాసన, హీరోయిన్ సమంతను ట్యాగ్ చేశారు. దీంతో కల్వకుంట్ల కవిత వెంటనే స్పందించారు. చిన్నారికి సంబంధించిన వివరాలను తనకు పంపించాలని కోరారు. తన కార్యాలయం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ కూడా ఇచ్చారు.

రక్తహీనతపై వైద్య పరీక్షలు

● కవిత ఆదేశాలతో అక్కా ప్రాజెక్టు కార్యక్రమాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిజామాబాద్ జిల్లాలో మహిళలు, 11-15 ఏళ్ళలోపు పిల్లలకు రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కె.కవిత ఆదేశాల మేరకు అక్కా ప్రాజెక్టు పేరుతో జాగృతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో 8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు సుమారు 20-25వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. 75 శాతం పిల్లలు రక్తహీనతతో బాధ పడుతున్నారని వైద్యులు నిర్ధారించడంతో కవిత ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో పాటు జాతీయ స్థాయి బృందంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాధిని నివారించడానికి ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లలు ఎందుకు రక్తహీనత వ్యాధికి గురవుతున్నారు, వాటి నివారణ చర్యలు ఎలా అనే అంశంపై క్షుణ్ణంగా ఢిల్లీ బృందం సభ్యులు తెలుసు కున్నారు.



జిల్లా విద్యాధికారి, డీఎంహెచ్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవిని సంప్రదించి మానిక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడేళ్ళ పాటు ఏటా పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తారు. ఎంతోమంది పిల్లలు ముఖ్యంగా మహిళలు రక్తహీనత బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వారికి జాగృతి పక్షాన అండగా నిలిచేందుకు కవిత ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

నీరవ్ మోడీ బంగ్లా కూల్చివేత

ముంబై: పీఎన్బీ కుంభకోణంలో కీలక నిందితుడు నీరవ్ మోడీ బంగళా కూల్చివేత పనులు శుక్రవారం మొదలయ్యాయి. రాయ్‌గఢ్ జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు బంగ్లా కూల్చివేత పనులు ప్రారంభించారు. ఈ బంగాళా చట్టవిరుద్ధంగా నిర్మించడంతో కూల్చివేతకు కోర్టు అనుమతి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఈడీ జప్తు చేసిన నీరవ్ మోడీ ఆస్తుల్లో ఈ బంగ్లా కూడా ఉంది. బంగ్లా కూల్చివేతకు ఈడీ అభ్యంతరం వ్యక్తం చేయటంతో రాయగఢ్ అధికారులు ముంబై హైకోర్టును ఆశ్రయించి కూల్చివేతకు అనుమతి పొందారు. హైకోర్టు ఉత్తర్వులు పొందిన అనంతరం పోలీసులు, అధికారులు అలీబాగ్‌లోని కిహిమ్ బీచ్ ఏరియాలో ఉన్న బంగ్లాకు చేరుకుని కూల్చివేతకు చర్యలు తీసుకున్నారు. నీరవ్‌మోడీ ఈ బంగ్లాను హైప్రొఫైల్ ఉన్నవారికి ఆతిథ్యం ఇచ్చేందుకు ఉపయోగించేవారు. ఈ విల్లా మొదట 376 చదరపు మీటర్లలో నిర్మించారు. అనంతరం తీరప్రాంత రెగ్యులేటరీజోన్ (సీఆర్‌జడ్) నియమాలు, స్థానిక ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ దీన్ని 1081 చదరపు అడుగులకు విస్తరించారు.



ఎన్నారైలకు కేరళ సర్కార్ పింఛను

తిరువనంతపురం: కేరళ ప్రభుత్వం త్వరలో ఇతర దేశాల్లో నివసిస్తున్న కేరళవాసులకు ప్రవాస డివిడెండ్ పెన్షన్ పథకం ప్రారంభించనుంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ పి.సదాశివం అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ప్రకటించారు. ఎన్నారైలకు ఒకేసారి రూ.5లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని గవర్నర్ వివరించారు. ప్రవాస మళయాలీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒకేసారి చెల్లించే ఐదులక్షల రూపాయల నగదును కేఐఎఫ్‌బీ (కేరళ మౌలిక సదుపాయాల ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్)లో డిపాజిట్ చేస్తామని గవర్నర్ సదాశివం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 2.1మిలియన్లమంది కేరళ వలసదారులు ఉన్నారు. వీరిద్వారా లభించే వార్షిక చెల్లింపులు 85,092 కోట్ల రూపాయలుగా ఓ అధ్యయనం ద్వారా గుర్తించామని, వీటిలో మధ్య ప్రాచ్యదేశాల నుంచే 90శాతం ఉందన్నారు. కేరళ ప్రభుత్వం సమాచారం అందించడానికి, ఫిర్యాదులు నమోదుకు, ఎన్నారైలు ఎదుర్కొన్న సమస్యలపై తీసుకున్న చర్యలు గురించి వివరాలు తెలిపేందుకు అంతర్జాతీయ టోల్ ఫ్రీ లైన్‌తో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని గవర్నర్ సదాశివం సూచించారు.

భార్యను వేశ్యగా పిలవటం రెచ్చగొట్టడమే

న్యూఢిల్లీ: భార్యను ఆమె భర్త వేశ్యగా పిలవటం తీవ్రంగా రెచ్చగొట్టడమే అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ ఎంఎం శాంతగౌడర్, జస్టిస్ మాహేశ్వరితో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక భర్త తన భార్యను వేశ్యగా పిలవటం ఆమెను తీవ్రంగా రెచ్చగొట్టడమే అన్నారు. ఈ కారణంగా తన భర్తను హత్యచేసిన మహిళను హత్యానేరంపై కాకుండా ఆకస్మిక ఉద్రేకంతో దాడి చేసి ప్రాణాలు పోవటానికి కారణం అవటం (కల్పబుల్ హోమిసైడ్)గా పరిగణించి శిక్షను విధించాల్సి ఉంటుందని సుప్రీం ద్విసభ్య బెంచ్ పేర్కొంది. ఈ ఆరోపణలపై దోషిగా తేలిన మహిళకు, సహ నిందితుడికి పదిసంవత్సరాలు జైలు శిక్ష విధించవచ్చని తెలిపింది. హతుడు నిందితురాలును వేశ్యగా పిలిచి రెచ్చగొట్టడంతోనే హత్యజరిగిందని, మన సమాజంలో ఏ మహిళ తన భర్తనుంచి అటువంటి పిలుపును ఇష్టపడదని ధర్మాసనంపేర్కొంది. ముఖ్యంగా తన కుమార్తెలు ఎదుట అటువంటి పిలుపును వినేందుకు ఏ మహిళ ఇష్టపడదని ఫలితంగా హత్య జరిగిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తన భర్తను హత్యచేసి అనంతరం మృతదేహాన్ని తగలబెట్టిన నేరంపై పోలీసులు కేసు నమోదుచేయగా ఆమెకు ట్రయల్ కోర్టు, హైకోర్టు హత్యానేరంగా పరిగణిస్తూ శిక్ష విధించింది. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు ఆమెను హత్యానేరంగా కాకుండా ఆకస్మికంగా ఉద్రేకపూరిత దాడిలో చేసిననేరంగా పరిగణించాలని పేర్కొంది.

26నే నిజమైన స్వాతంత్ర్య పండుగ

• సర్వసత్తాక సార్వభౌమత్వం నిర్దేశించుకుంది జనవరి 26నే



(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

విదేశీ పాలన పూర్తిగా అంతరించి బ్రిటీషియుల నుంచి అధికారాన్ని భారతీయులకు బదలాయింపు జరిగిన రోజే భారత గణతంత్ర దినోత్సవం. వాస్తవానికి ఈ రోజునే భారత్‌క ు సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ మాటకొస్తే జనవరి 26నే స్వాతంత్ర దినోత్సవం జరుపుకోవాలని, అంతకు 20 ఏళ్ళ ముందే స్వతంత్రోద్యమ నిర్వాహకులు నిర్ణయించారు 1930 జనవరి 26నే సంపూర్ణ స్వరాజ్య నినాదాన్ని ప్రకటించారు. లాహోర్ (అప్పట్లో భారత్‌లో భాగం)లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వతంత్ర ఆకాంక్ష వ్యక్తమైంది. ప్రతి ఏటా 26న స్వతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. దేశవ్యాప్తంగా ప్రతిచోట ఆ రోజున సంపూర్ణ స్వరాజ్య ఆకాంక్షను వ్యక్తం చేస్తూ స్వతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1935లోనే భారత ప్రభుత్వ చట్టం ఏర్పాటైంది. దాని స్థానంలో భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకొచ్చింది. స్వాతంత్ర్యానంతరం 1947 ఆగస్టులోనే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన ఏడుగురు ముఖ్యులతో రాజ్యాంగ పరిషత్‌ను నియమించారు. ఈ పరిషత్‌లో మొత్తం 299మంది సభ్యులున్నారు. పరిషత్ 11సెషన్స్‌లో సమావేశమైంది. 165రోజుల పాటు చర్చలు జరిపింది. రెండేళ్ళ 11మాసాల 17రోజుల పాటు దీనిపై విస్తృతంగా చర్చించి ఒక సంపూర్ణ రాజ్యాంగ ప్రతిని రూపొందించింది. 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం జరిపింది. 1947 జులై 22న జాతీయ పతాకాన్ని, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వం ఆమోదించింది. అయితే రాజ్యాంగాన్ని 1950 జనవరి 26 నుంచి అమల్లోకి తెచ్చింది. 1947 ఆగస్టు 15నే దేశానికి స్వాతంత్రమొచ్చినా 1950జనవరి 25వరకు అంతకుముందు 1935లో బ్రిటీష్ పాలకులు చేసిన భారత ప్రభుత్వ చట్టాన్నే అనుసరించి పాలన సాగింది. వాస్తవానికి ఆగస్టు 15 అన్న తేదీ భారతీయులు నిర్దేశించుకున్నది కాదు. ఆ రోజున భారత్‌కు స్వాతంత్రమివ్వాలని బ్రిటీష్ పాలకులు భావించారు. అది మనకు మనంగా ఏర్పాటు చేసుకున్న ఉత్సవం కాదు. కానీ జనవరి 26 అన్నది 1930 నుంచి భారత ప్రజల స్వతంత్ర పాలనాకాంక్షకు అనుగుణంగా అమలౌతున్న రోజు. అదే నిజమైన భారత స్వాతంత్ర దినోత్సవం. భారతీయులు స్వయంగా నిర్ణయించుకున్న రోజది. ఆ రోజు నుంచే ఈ దేశం సర్వసత్తాక సార్వభౌమత్వాన్ని నిర్దేశించుకుంది. సొంత రాజ్యాంగానికి అనుగుణంగా పాలన మొదలెట్టింది. ప్రజాస్వామ్య స్వామ్యవాద, లౌకిక గణతంత్ర రాజ్యాంగా ఆవిర్భవించింది. ఆరోజు సరిగ్గా ఉదయం 10.18గంటల నుంచి మన సొంత రాజ్యాంగం అమల్లోకొచ్చింది. ఈ రాజ్యాంగ ఆమోదానికి ముందు 7,635 సవరణ ప్రతిపాదనలొస్తే రాజ్యాంగ పరిషత్ వాటిలో 2,473 సవరణల్ని ఆమోదించింది. మనం ఎంతో పవిత్ర గ్రంథంగా రాజ్యాంగాన్ని భావిస్తాం. అయితే రాజ్యాంగ అసలు ప్రతులు మాత్రం అందుబాటులో లేవు. హిందీ ఒకటి, ఇంగ్లీష్‌లో ఒకటి రెండు ప్రతులు మాత్రమే ఇప్పటికీ ఉన్నాయి. వీటిని హీలియం నింపిన డబ్బాల్లో అత్యంత భద్రంగా దాచుంచారు. వీటి ప్రతులు మాత్రమే ఇప్పుడు లోక్‌సభ, రాజ్యసభ లైబ్రరీల్లో అందుబాటులో ఉన్నాయి.

రిపబ్లిక్ డేకి ఏపీ భవన్ ముస్తాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ముస్తాబైంది. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో వైభవంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించిన ఏపీ భవన్ అధికారులు, గణతంత్ర దినోత్సవ వేడుకలు కూడా ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏపీ భవన్ ప్రాంగణం, భవన సముదాయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ జాతీయ పతక ఆవిష్కరణ చేసి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందజేసిన భవన్ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను బహుకరిస్తారు. అనంతరం మధ్యాహ్నాం గం. 3.00 నుంచి డా. బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో వివిధ కళారూపాలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



ప్రణబ్ భారత రత్నమే!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రతిష్టాత్మకమైన భారతరత్న పురస్కారం లభించడంపట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హర్షం వ్యక్తంచేశారు. ఈ పురస్కారానికి ప్రణబ్ సంపూర్ణ అర్హుడని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టపరచడానికి, రాజ్యాంగాన్ని సమర్ధవంతంగా అమలు చేయడానికి రాష్ట్రపతిగా ఆయన ఎంతో చొరవ చూపారని కొనియాడారు. సుదీర్ఘమైన రాజకీయ జీవితంలో అనేక పదవులు అధిష్టించి దేశానికి ఎంతో సేవ చేశారని కేసీఆర్ ఈ సందర్భంగా అన్నారు.

భారతరత్న ప్రణబ్



• సిరివెన్నెలకి పద్మపురస్కారం.. • క్రీడల్లో హారిక, ఛెత్రికి పద్మశ్రీ • క్రికెటర్ గౌతమ్ గంభీర్‌కి అవార్డు • ప్రభుదేవా,శివమణి, ఖదీర్‌ఖాన్‌లకు పద్మాలు • ప్రముఖ జర్నలిస్టు కులదీప్ నయ్యర్‌కి పద్మభూషణ్ • ఈసారి ట్రాన్స్‌జెండర్‌కి ఓ పద్మం • విరిసిన 21 మంది మహిళా పద్మాలు

అందరికీ దాదా...



ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవమున్న వ్యక్తి ప్రణబ్ ముఖర్జీ. దేశరాజకీయాలలో విలువలను పాటించారనే గౌరవ మున్న వ్యక్తి. 47 ఏళ్ల పిన్న వయసులో ఆర్ధిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి ప్రణబ్ ముఖర్జీ. 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విదేశీ వ్యవహారాల శాఖ, రక్షణ, ఆర్థిక శాఖ మంత్రిగా కీలకమైన బాధ్యతలు చేపట్టారు. పలు చట్టాలు చేయడంలో సహాయసహకారాలు అందించారు. 2012 నుంచి 2017 వరకు రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. విధుల్లో తనదైన ముద్రవేశారు. నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించిన తొలి మాజీ రాష్ట్రపతిగా ఆయన నిలిచారు. పలు చట్టాలను రూపొందించడంలో కీలకభూమిక పోషించారు. ఆయనకు 2008లో పద్మవిభూషన్ అవార్డు దక్కింది. డిసెంబర్ 11, 1935న ఆయన జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ కలకత్తాలో ఎంఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీలో ఆయన విద్యనభ్యసించారు.

జనసంఘ్‌కి అత్యున్నత పౌర పురస్కారం



నానాజీ దేశ్‌ముఖ్ 1928 లో జన్మించారు. చని పోయే వరకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ ఎస్)లో పని చేశారు. 94 ఏళ్ల వయసులో 2010లో మధ్య ప్రదేశ్ లోని సత్నాలో ఆయన కన్ను మూశారు. భారతీయ జనతా పార్టీగా రూపాంతర చెందిన భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. 1974లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జైప్రకాశ్ నారాయణ్ నడిపిన ఉద్యమానికి మార్గనిర్దేశనం చేసిన వారిలో నానాజీ దేశ్‌ముఖ్ కూడా ఉన్నారు. 1977లో జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకభూమిక పోషించారు.

గంభీరమైన పద్మం!



ఇటు క్రికెట్ రంగానికి ఒక పద్మశ్రీ వరించింది. స్టార్ క్రికెటర్‌గా గౌతమ్ గంభీర్ పద్మ పురస్కారానికి ఎంపికయ్యారు. ఎడమచేయి వాటమున్న ఓపెనర్‌గా క్రికెట్‌పై తనదైన ముద్ర వేసిన గౌతమ్ గంభీర్‌కీ పద్మశ్రీ అవార్డు దక్కింది. 2003లో బంగ్లాదేశ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మ్యాచులో అడుగు పెట్టిన గౌతమ్ గంభీర్, తరువాతి ఏడాది ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచులో రాణించారు. గౌతమ్ గంభీర్ కెప్టెన్‌గా వ్యహరించిన ఆరు వన్డే మ్యాచుల్లోనూ భారత్ గెలవడం విశేషం. 2011 వరల్డ్ కప్‌లో గంభీర్ 122 బంతులకు 97 పరుగులు తీసి రికార్డు సృష్టించారు. వరసగా అయిదు టెస్ట్ మ్యాచుల్లో సెంచరీలు బాదిన నలుగురు అంతర్జాతీయ క్రికెటర్లలో గంభీర్ ఒకరు కావడం విశేషం. 2008లో గంభీర్‌కి అర్జున అవార్డు ప్రదానం చేశారు. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్‌ల్లో 2009లో నెంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా గౌతమ్ నిలిచారు.

2019 సంవత్సరానికి నలుగురుకి పద్మ విభూషణ్, 14 మందికి పద్మ భూషణ్ అవార్డులు ప్రక టించారు. పద్మభూషణ్ అందు కున్నవారిలో ఇద్దరు విదేశీయులు ఉండడం విశేషం. ప్రముఖ జర్న లిస్టు, కాలమిస్టు కులదీప్ నయ్యార్‌కి మరణానంతర పద్మ భూషణ్ అవార్డును ప్రకటించారు. ఇక పద్మశ్రీ అవార్డు లను 94 మందికి ప్రకటించారు. కర్నాటక నుంచి కళలు, నృత్య విభాగంలో ప్రముఖ దర్శక, హీరో, కొరియోగ్రాఫర్ ప్రభుదేవాకి పద్మశ్రీ అవార్డు ప్రకటించారు. కొరియోగ్రాఫర్‌గా కెరీర్ ప్రారంభించి.. ప్రేమికుడు సిని మాతో నగ్మా హీరోయిన్‌గా హీరోగా ఎదిగారు. సినీ గీతాలకు విలక్షణ మైన నృత్య రీతులను అందించడంలో ప్రభు దేవాది అందవేసిన చేయి. మూసపోసిన నటుల నృత్యాల స్థానంలో ఆధునిక పోకడలను పరిచయం చేయడంతో ప్రభుదేవా నృత్యాలకు యువత విపరీతంగా ఆకర్షితుల య్యారు. ఇక ఇటీవలే కెనడాలో అనారోగ్య కారణలతో మృతి చెందిన బాలీ వుడ్ బెస్ట్ విలన్, కేరక్టర్ ఆర్టిస్టు ఖదీర్‌ఖాన్‌కి మరణా నంతర పద్మశ్రీ ఆవార్డు ప్రకటించారు. హిందీ సినిమాపై కేరక్టర్ ఆర్టిస్టుగా బలమైన ముద్ర వేసిన ఆనాటి తరం నటుడు ఖదీర్‌ఖాన్ సేవలను గుర్తు పెట్టుకొని పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయడంపై హిందీ చిత్రసీమ సంతోషం వ్యక్తం చేస్తోంది. మహారాష్ట్ర నుంచి సినీ గేయకారుడు శంకర్ మహదేవన్‌కీ పద్మశ్రీ దక్కింది. బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలోని అన్ని చిత్ర పరిశ్రమల్లో తన విలక్షణమైన గాత్రాన్ని అందించిన శంకర్ మహదేవన్‌ను పద్మ పురస్కారం దక్కడంపై ఆయన అభి మానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డ్ర మ్ము వాయిద్యంలో సరి కొత్త ట్రెండ్ సృష్టించిన ఆనందన్ శివమణికి పద్మశ్రీ ప్రకటించారు. గంటల తరబడి డ్రమ్ము వాయిద్యంతో అనేక భావాలను, ఉద్వేగాలను సృష్టించి, ప్రేక్షకులను ఉర్రూతలూ గించడంలో నిష్ణాణి తుడైన శివమణి కార్యక్రమాలకు అంత ర్జతీయ స్థాయిలో డిమాండ్ ఉండడం విశేషం. ప్రతియేటా రిపబ్లిక్ డే ముందు ప్రకటించే పద్మ పురస్కారాలను రాష్ట్ర పతి భవన్‌లో ఆర్భాటంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించే కార్యక్రమం లో ప్రదానం చేస్తారు.

భూపేన్ హజారికాకు భారతరత్న



ప్రముఖ విధ్వంసకుడు, కవి, రచయిత, నేపథ్య గాయకుడు, చిత్రదర్శకనిర్మాత అయిన భూపెన్ హజారికా అస్సాంకు చెందిన వ్యక్తి. 1987లో సంగీత్ నాటక్ అకాడమి అవార్డు, 1977లో పద్మశ్రీ, 2001లో పద్మ భూ షణ్, 2012లో పద్మవిభూషణ్ (మర ణాంతరం), 1992లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులు ఆయనను వరించాయి. కొలం బియా యూని వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రాజకీయాలలో ఆయన రాణించలేకపోయారు. బీజేపీ తరపున లోక్‌సభ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1967-72 మధ్యకాలంలో స్వతంత్రంగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలు పొం దారు. రుదాలి, దర్మియాన్, గజా గమిని, డమన్ బాలీవుడ్ చిత్రాలతోపాటు అనేక అస్సామీ సిని మాలకు సం గీతం అందించారు. 2011లో ఆయన కన్నుమూశారు.

4 తెలుగు పద్మాలు

వెన్నెల్లో పద్మం!



గాంధీ అంటే వీధి పేరు కాదు.. అంటూ విలక్షణమైన సినీ గేయాలను అందించిన సిరివెన్నెల సీతారామశాస్త్రికి పద్మ పురస్కారం వరించింది. సిరివెన్నెల సినిమాతో గేయ రచయితగా తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయం అయిన సీతారామశాస్త్రి.. సినీ గీతాలకు శాస్త్రీయతను, నిబద్ధతను అందించారు. సిరివెన్నెల గీతమంటే సినిమాలో ఎలాంటి సన్నివేశమైనా పండుతుందనే పేరు సంపాదించారు. సాంఘిక దురాచారాలపై, దేశభక్తిపై ఎన్నో ఆవేశభరితమైన గేయాలను రచించారు. యువతకు ప్రేరణ ఇచ్చే గీతాలకు కేరాఫ్ ఎడ్రస్‌గా సిరివెన్నెల నిలుస్తారు. 2019 పద్మశ్రీ అవార్డు అందుకోనున్న సిరివెన్నెల సీతారామశాస్త్రి విశాఖజిల్లా అనకాపల్లిలో జన్మించారు. కాకినాడలోని పీఆర్ కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. పదకొండు నంది అవా ర్డులను గెలుచుకున్న సీతారామశాస్త్రీ గీతాలకు 4సార్లు ఫిలిమ్ ఫేర్ అవార్డులు కూడా దక్కాయి. తెలుగు చిత్రసీమలో అత్యధిక పారితోషికం అందుకొనే గేయ రచయితగానూ సీతారామశాస్త్రి రికార్డు సృష్టించారు. సీతారామశాస్త్రి గీతాలు ఎందరో ప్రముఖులకు సైతం ప్రేరణగా నిలవడం విశేషం. శాస్త్రిగారి పాటు ఉంటే చాలు.. సినిమా విజయం సాధిస్తుందని ఎందరో నిర్మాతలు బలంగా విశ్వసిస్తారు.

గ్రాండ్ మాస్టర్‌కి పద్మ పురస్కారం!



ఇక ఈ ఏడు పద్మశ్రీ అవార్డు అందుకున్న వారిలో ద్రోణవల్లి హారిక కూడా ఒకరు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ విద్యార్థిని అయిన హారికకు చిన్ననాటి నుంచే విశ్వనాథ్ ఆనంద్, వ్లాదిమిర్ క్రామ్నిక్ వంటి చదరంగ విజేతలు హీరోలుగా ఉండేవారు. 1991లో జన్మించిన ఈ 28 సంవత్సరాల మహిళ చదరంగ గ్రాండ్ మాస్టర్ ఫైడ్ రేటింగ్స్‌లో 2019 నాటికి 2371 పాయింట్లతో కొనసాగుతున్నారు. 2016 నవంబర్‌లో 2543 పాయింట్లతో ఉచ్ఛస్థాయిలో ఉన్నారు. 2012, 2015, 2017 సంవత్సరాల్లో మహిళా ప్రపంచ చదరంగ ఛాంపియన్‌షిప్‌లో హారిక కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. 2007-08 సంవత్సరానికిగాను హారికని అర్జున అవార్డు వరించింది. 2016లో చైనాలోని చెంగ్డులో జరిగిన ఫైడ్ మహిళా గ్రాండ్ ప్రిక్స్‌ని గెలిచి మహిళా చదరంగ క్రీడాకారిణుల ర్యాంకింగ్‌లో అప్పటి వరకు ఉన్న తన 11వ ర్యాంకు నుంచి అయిదో స్థానానికి ఎగబాకారు. వ్యవసాయ రంగంలో విశేష ప్రతిభ కనబర్చిన యడ్లపల్లి వెంకటేశ్వరరావుకి పద్మశ్రీ అవార్డు ప్రకటించారు.

తెలంగాణా తేజానికి పద్మ వికాసం!



సికింద్రాబాద్‌లో 3, ఆగస్టు, 1984లో జన్మించి ఫుట్‌బాల్ క్రీడలో అంతర్జాతీయ ప్రమాణాలు సాధించిన సునీల్ ఛెత్రికి ఈ ఏడాది పద్మశ్రీ అవార్డు వరించింది. భారత ఫుట్‌బాల్ టీమ్‌కి కెప్టెన్‌గా అసమానమైన సేవలందించిన ఛెత్రి అంతర్జాతీయ మ్యాచుల్లో అత్యధిక గోల్స్ చేసిన రెండవ క్రీడాకారుడిగా రికార్డు సృష్టించారు. ఛెత్రిని ఫుట్‌బాల్ క్రీడాకారులు ఫెంటాస్టిక్ కెప్టెన్‌గా ముద్దుగా పిలుచు కుంటారు.



అరుదైన ఘట్టాన్ని ఓటుతో ఆహ్వానిద్దాం

• 2019 లోక్‌సభ ఎన్నికలతో చెరగని ముద్ర • అక్టోబర్‌లో జాతిపిత 150వ జయంతి ఉత్సవాలు • రాష్ట్రపతి కోవింద్ గణతంత్ర దినోత్సవ సందేశం

న్యూఢిల్లీ: ఓటును అత్యంత పవిత్రమైన బాధ్యతగా భావించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు కేవలం రాజకీయ కసరత్తు కోసం కావని ... అవి ప్రజల సమిష్టి విజయానికి చిహ్నామని రాష్ట్రపతి అభివర్ణించారు. 2019 లోక్‌సభ ఎన్నికలు ఈ శతాబ్దంలో చెరగని ముద్ర వేసుకునేవిగా ఉండాలని అభిలసించారు. మన ప్రజాస్వామ్య ఆలోచనలు, ఆదర్శవాదం 17 లోక్‌సభ ఎన్నికలతోనే ఆచరణలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

అక్టోబర్ 2 ఎంతో ప్రత్యేకం

సమాజం, పౌరులందరి స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వం పట్ల కట్టుబాటును పునరుద్ఘాటించే సందర్భం ఇది అని రాష్ట్రపతి అన్నారు.. అక్టోబర్ 2వ తేదీన మనందరికి అణచివేత నుంచి విముక్తి కల్పించిన జాతిపిత మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్స వాన్ని నిర్వహించుకోబోతున్నామన్నారు.. మన గణతంత్రం నైతిక దిక్సూచిగా గాంధీజీ చిరస్థాయిగా నిలుస్తారని రాష్ట్రపతి గుర్తు చేశారు. మన ప్రజాస్వామ్యంలో, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలే భారత ప్రజల ఆధిపత్యాన్నిపరిరక్షించే విలువలన్న కోవింద్. ఈ ఏడాది భారత పౌరులు- మనలో ప్రతీ ఒక్కరూ..మరో బాధ్యత కూడా నిర్వర్తించాల్సి ఉందని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసి, 17వ లోక్ సభ ను ఎన్నుకునే బాధ్యత మనందరిపై ఉందని... ప్రతీ ఐదు సంవత్సరాల్లాగే మరోసారి మనందరం మన తీర్పును ప్రకటించి తలరాతలు రాయబోతున్నామన్నారు. ఈ ఏడాది ఎన్నికలు 21వ శతాబ్ది లో జన్మించిన వారికి మొదటి ఎన్నికలు అని తెలిపారు. వారు కొత్త లోక్ సభ ను ఎన్నుకోవడంలో తమ వంతు పాత్రను పోషించనున్నారన్నారు.

లింగ సమానత్వంతోనే సామాజిక పరివర్తన

సామాజిక పరివర్తనలో అతి పెద్ద అంశం లింగపరమైన సమానత్వమని రాష్ట్రపతి పేర్కొన్నారు. అందరికీ సమానావకాశాల కల్పన, సమానత్వం షరతుల ద్వారా ప్రతి ఒక్క బాలిక, ప్రతి ఒక్క మహిళకు సమానత్వం లభిస్తుందన్నారు. మన దేశం లో యువ మహిళలు ప్రతీ ఒక్క రంగం లోనూ-విద్యా రంగం మొదలుకొని సృజనాత్మక కళలు, క్రీడా రంగం నుంచి సాయుధ దళాల దాకా ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు.

10 శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణ పేదలకు వరం

''ఇండియా ఆఫ్ మై డ్రీమ్స్'' (నా కలల్లో భారతదేశం) అనే గ్రంథంలో మహాత్మా గాంధీ నిరుపేదలు కూడా ''సమర్థవంతంగా వాక్కు'' వినిపించగల, ''అగ్రశ్రేణి సమాజం, తక్కువ శ్రేణి సమాజం'' అనే తేడాలు లేని, ''ప్రతీ ఒక్క వర్గం చక్కని సామరస్యంతో జీవనం'' సాగించగల, ''పురుషులతో పాటుగా మహిళలు కూడా సమాన హక్కులు ఆస్వాదించగల'' భారతదేశం ఆవిష్కారం కావాలన్న ఆకాంక్షను ప్రకటించారని రాష్ట్రపతి గుర్తు చేశారు. పేద కుటుం బాల్లోని ప్రతిభావంతులైన పిల్లలకు ప్రత్యేక సదుపాయాల కల్పనకు వీలు కల్పిస్తూ ఇటీవల చేసిన రాజ్యాంగ సవరణ ద్వారా గాంధీజీ స్వప్నాలకు దీటైన భారత నిర్మాణం లో మరో ముందగుడు పడిందన్నారు.

సేవా భావాన్ని పెంపొందించుకోండి..

ప్రజా సంక్షేమానికి అంకితమైన వారు, పిలుపు కన్నా అతీతంగా వ్యవహరించే వారిని సమాజం గౌరవిస్తుందని రాష్ట్రపతి కొనియాడారు. సేవా భావానికి, ప్రజాసేవ పట్ల అంకిత భావానికి, న్యాయం యొక్క పరిధిని విస్తరించేందుకు తగినంత గౌరవాన్ని అందించి తీరాలని ఆకాంక్షించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తొలగించడం మన బాధ్యత అని రాష్ట్రపతి గుర్తు చేశారు. అందరినీ కలుపుకోవడం ద్వారానే సమ్మిళిత లక్ష్యాలు సాధించగలుగుతామన్నారు. ''మనం, ప్రజలం...'' మనకు మనమే ఈ రాజ్యాంగాన్ని అందించుకున్నాం.''మనం, ప్రజలం...'' ఈ సిద్ధాంతాలకు కాపలాదారులం మరియు పరిరక్షకులమై న్నాం. ఈ మాటలతో నేను మరొక్కమారు మీకందరికీ ఆనందదాయకమైన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను తెలియ జేస్తున్నానని రాష్ట్రపతి అన్నారు.



కలిసి పోటీ చేద్దాం

•జనసేన, సీపీఐ, సీపీఎం తీర్మానం

విశాఖపట్నం, ప్రభ న్యూస్ : వచ్చే ఎన్నికల్లో జనసేన, సీపీఐ, సీపీఎంలు కలిసి పోటీచేయాలని నిర్ణయించాయి. విశాఖలో జనసేన, సీపీఐ, సీపీఎంల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. రాజకీయ తీర్మానంలో భాగంగా మూడు పార్టీలు కలిసి పోటీచేయాలన్న అంశానికి సీపీఐ పార్టీ వెంటనే ముందుకొచ్చింది. సీపీఎం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కలిసి పనిచేస్తామని తెలిపింది. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై వస్తున్న సందేహాలను నివృత్తిచేసేందుకు నిపుణుల కమిటీని ఎన్నికల సంఘాన్ని నియమించాలని డిమాండ్‌చేస్తూ తీర్మానం ఆమోదించారు. పది శాతం ఓట్లకు వీవీపాట్ పేపర్ ట్రైల్ వెరిఫికేషన్‌ని తప్పిసరి చేయాలని కూడా కోరారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో అభివృద్ధి ఉండాలని తీర్మానించారు. పర్యావరణానికి, సహజ వనరులకు జరుగుతున్న నష్టంపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. అనధికార మైనింగ్ వల్ల సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయనిపేర్కొంది. బాక్సైట్, లేటరైట్ మైనింగ్‌లను వ్యతిరేకిస్తూ తీర్మానించారు. జీఓ 97ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్‌చేశారు. భూసేకరణకు ముందే నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని తీర్మానం ఆమోదించారు. విచక్షణారహిత భూసేకరణ సామాజిక వర్గాల మధ్య గొడవలకు దారితీస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామికజోన్లు, సాగునీటి ప్రాజెక్టులకు భూ సమీకరణకు రైతుల ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, వారికి న్యాయమైన నష్ట పరిహారం ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని తీర్మానించారు. ఇప్పటికే అర్బన్ ప్రాంతాల్లో సేకరించిన భూముల్లో ఈడబ్ల్యుఎస్ గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని అమలుచేయడంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యవైఖరిని ఖండించింది. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీన్ని అన్ని పార్టీలు ముక్త కంఠంతో ఖండించాలని తీర్మానం ఆమోదించారు. పేద, ధనిక మధ్య వ్యత్యాసం పెరుగుతోందని అన్నారు. జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్యను ఖండించారు. ఈ సమావేశంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 26 జనవరి 2019


చరిత్రలో ఈరోజు

జనవరి 26 ప్రాముఖ్యతేంటి?



జనవరి 26 అంటే ప్రతి భారతీయుడికీ రిపబ్లిక్ డే గుర్తుకొస్తుంది. గణతంత్ర రాజ్యంగా భారతదేశం ఆవిర్భవించిన రోజుగా జనవరి 26ను ఘనంగా పాటిస్తారు. అయితే ఈ తేదీకి మరో ఘనమైన ప్రాముఖ్యత ఉంది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జనవరి, 26, 1950కి సరిగ్గా ముప్పై సంవత్సరాల క్రితం అంటే 1930, జనవరి 26న భారత జాతీయ కాంగ్రెస్ ఒక చారిత్రాత్మక తీర్మానాన్ని ఆమోదించింది. బ్రిటీష్ వారి నుంచి భారత దేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని నిర్ణయించింది. ఆ నాటి నుంచే సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం దేశవ్యాప్తంగా ఉధృతమైంది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో భారతీయుకుల బ్రిటీష్ పాలకులు చేసిన వాగ్దానాలన్నీ అబద్ధాలేనని నాటి జాతీయ నాయకులకు 1920 నాటికే సుబోధకమయ్యాయి. ఆ తరువాత జలియన్ వాలాబాగ్ ఉదంతం, పంజాబ్‌లో ఆందోళనలు, రౌలత్ చట్టాన్ని కొనసాగించడంతో బ్రిటీషర్లపై అసంతృప్తి దేశ ప్రజల్లో తారాస్థాయికి చేరింది. ఖిలాఫత్ ఉద్యమంతో ముస్లింలు బ్రిటీష్ ప్రభుత్వం నుంచి విడివడ్డారు. ఇవన్నీ కలిసి 1, ఆగస్టు, 1920న సహాయ నిరాకరణ ఉద్యమానికి దారి తీశాయి. ఆ తరువాత కోల్‌కత్తాలో 1928లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఏడాదిలోపు భారతదేశానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని, అలా లేని పక్షంలో సంపూర్ణ స్వరాజ్యానికి పిలుపు ఇస్తామని బ్రిటీష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా అటువైపు నుంచి స్పందన కరువవడంతో 1929, డిసెంబర్ 26న భారత దేశ స్వాతంత్ర్య ప్రకటనను కాంగ్రెస్ పార్టీ తీర్మానించింది. ఈ తీర్మానం నుంచి ప్రేరణతోనే జనవరి 26, 1930న కాంగ్రెస్ పార్టీ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. ఆ విధంగా జనవరి 26ను 1930లో దేశ స్వాంత్ర్య దినంగా పాటించడం మొదలు పెట్టింది. 1930, జనవరి 26 స్వాంత్ర్య ప్రకటనకి గుర్తుగా భారత రాజ్యాంగాన్ని ఆమోదించడానికి 1950లో జనవరి 26ను ఎంచుకోవడం జరి గింది. ఈ విధంగా జనవరి 26కి భారతదేశ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది.

అధికార భాషగా హిందీ..




భారత ప్రభుత్వ అధికార భాషగా హిందీ ఎప్పటి నుంచో ఉందని అనుకుంటాం. స్వాతంత్ర్యం వచ్చిన 18 సంవత్సరాలకు కానీ హిందీకి అధికార భాషా ప్రతిపత్తి లభించలేదు. 26, జనవరి, 1965లో హిందీని అధికార భాషగా ప్రకటించారు. హిం దీ అనే పదం పర్షియన్ పదం హింద్ నుం చి పుట్టింది. హింద్ అంటే ఇండస్ నదీ పరివాహక ప్రాంతమని అర్థం. హిందీని కేవలం భారతదేశంలోనే కాకుండా నేపాల్, గుయాన, ట్రినిడాడ్, తొబాగో, సురి నేమ్, ఫిజి, మారిషస్‌వంటి దేశాల్లోనూ మాట్లాడతారు. దేవనాగరి లిపి నుంచే హిందీ, నేపాల్ అక్షరాలు రూపొందాయి. హిందీలో అన్ని నామవాచకాలు లింగ భేదాన్ని పాటిస్తాయి. విశేషణాలు, క్రియలు కూడా లింగ ఆధారంగా మారతాయి. ఇంగ్లీష్‌లోని అనే పదాలను హిందీ భాషలోంచి తీసుకోవడం విశేషం. చట్నీ, లూట్, బంగ్లా, గురు, జంగిల్, కర్మ, ఓగా థగ్, అవతార్ వంటి ఇంగ్లీషులో చలా మణి అయ్యే పదాలన్ని హిందీ భాషకి చెందినవే. సంస్కృత భాష వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న హిందీ.. పదాలు, వ్యాకరణాల్లోనూ దేవ భాష సంప్రదాయాలే పాటిస్తుంది. ఇంగ్లీషు భాషలాగా ఇతర భాషల పదాలను తనలో ఇముడ్చుకొనే విశాల స్వభావం ఉండడం కారణంగా హిందీ భాష సుసంపన్నమవుతోంది. హిందీ భాషలో టర్కిష్, అరబిక్, పర్షియన్, ఇంగ్లీష్, ద్రవిడ భాషా పదాలు కనిపించడం విశేషం. సంస్కృతానికి అపభ్రంశగా కూడా హిందీని వ్యవహరిస్తారు. ఈ అపభ్రంశ రీతిలో కాళిదాస మహాకవి 400 ఏడీలో విక్రమోర్వాషియం రచించారు.

ఆస్ట్రేలియా ఆవిర్భావానికి నాంది..



ఇంగ్లాండ్‌లో ఖైదీలు ఎక్కువ అయిపోయి.. ఆ దేశ జైళ్లన్నీ కిటకిటలాడడంతో ఏం చేయాలో వారికి తోచలేదు. దీంతో దేశంలో జైళ్లు సరిపోక బయట ఉండిపోతున్న ఖైదీల కోసం ఒక ప్రాంతమే కావాల్సి వచ్చింది ఆనాడి బ్రిటీష్ పాలకులకు. అందుకనే ఖైదీలను ఉంచడానికే మొదట బ్రిటీషర్లు ఆస్ట్రేలి యాకి వచ్చారు. ఖైదీల ఓడలను తీసుకొని తొలిసారిగా 26, జనవరి, 1788న ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టారు. చరిత్రలో ఈ రోజున పదకొండు ఓడలు 778 మంది ఖైదీలతో ఆస్ట్రేలియాలో మొదలైన బ్రిటీషర్ల ప్రస్థానం ఆ తరువాత.. ఆ ఖండాన్ని ఆక్రమించుకోవడం వరకు సాగింది. మెరైన్ గార్డులు, అధికారులతో కలిపి మొత్తం 850 మంది ఇంగ్లాండ్ నుంచి ఆస్ట్రేలియా వరకు చేసిన ప్రయాణం చరిత్ర లో ప్రత్యేక ప్రాధాన్యత పొందింది. సిడ్నీలోని బాటనీ బేలో లంగరేసిన బ్రిటీష్ ఓడ లు.. ఆస్ట్రేలియాలో తొలి పీనల్ కాలనీ ఏర్పాటు చేశాయి. ఖైదీలను ఉంచడానికి వచ్చిన బ్రిటీష్ ఓడలు.. ఆ తరువాత ఆస్ట్రేలియాలో పాగా వేశాయి. నిజానికి చరిత్ర లో దీన్ని ఆస్ట్రేలియా ఆక్రమణగా చరిత్రకారులు భావిస్తారు. ఖైదీలను ఉంచడానికి అనే నెపంతో బ్రిటీషర్లు ఆస్ట్రేలియాపై చేసిన తొలి దండయాత్రగా అభివర్ణిస్తారు. కెప్టెన్ ఆర్థర్ ఫిలిప్, బ్రిటీష్ వలస పాలకులు న్యూ సౌత్ వేల్స్‌లోని సిడ్నీ తీరంలో బ్రిటీష్ యూనియన్ పతాకాన్ని ఎగురేయడంతో జనవరి 26ను ఆస్ట్రేలియా దినంగా ఇప్పటికీ సంబరంగా జరుపుకుంటారు.

టీవీ పుట్టిన రోజు!



నేడు ప్రపంచవ్యాప్తంగా టెలీవిజన్ లేని గృహం అంటు ఉండదు. జన సామాన్యంలో అంతగా మమేకం అయిన టెలీవిజన్‌ను స్కాట్‌లాండ్‌కి చెందిన జాన్ లోగీ బైర్డ్ రూపొందించారు. స్థానికంగా ఉండే ఎలక్ట్రికల్ పవర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేసే జాన్ సొంత పరిశ్రమ ఏర్పాటు చేసుకొని తొలి టెలీవిజన్‌ను రూపొందించారు. 26, జనవరి, 1926న బైర్డ్ తన ప్రయోగశాల నుంచి తొలి టీవీ కార్యక్రమాలను ప్రసారం చేశారు. దీని తరువాత లండన్, గ్లాస్గో మధ్య 1927లో, 1928లో లండన్, న్యూయార్క్ మధ్య టీవీ కార్యక్రమాలను ప్రసారం చేశారు. తొలినాళ్లలో నలుపు, తెలుపులో టీవీ కార్యక్రమాలు ఉండేవి. ఆ తరువాత వాటిని రంగుల్లోకి మార్చింది కూడా జాన్ లోగీ బైర్డే కావడం విశేషం. టెలీవిజన్ రూపకర్తగా బైర్డ్ బీబీసీకి తన సేవలందించారు. బీబీసీ తన తొలి టీవీ కార్యక్రమాల ప్రసారాలకు బైర్డ్ సేవలనే ఉపయోగించుకుంది. అయితే 1937లో బీబీసీ మార్కోని-ఈఎమ్ఐ ప్రసార విధానాల్లోకి మారిపోవడం వేరే విషయం. నేడు ప్రపంచాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్న మాధ్యమాల్లో అత్యంత కీలకమైందిగా టెలీవిజన్ మారిపోవడం మనం చూస్తున్నాం. జాన్ లోగీ బైర్డ్ తన 57వ ఏటీ గుండెపోటుతో జూన్, 14, 1946న మరణించారు.

ముగ్గురు దిగ్గజాలు.. మూడు భారతరత్నాలు!

అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న అవార్డుకి ఈ ఏడాది ముగ్గురు ప్రముఖులను మోడీ ప్రభుత్వం ఎంపిక చేసింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, సంఘ్ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి సామాజిక సేవకు అంకితమైన నానాజీ దేశ్ ముఖ్,అస్సామీ గాయకుడు, దర్శకుడు అయిన భూపేన్ హజారికాలను ఈ అత్యున్నత పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేయడం ముదావహం. రెండేళ్ళ క్రితం వరకూ ఐదేళ్ళ పాటు ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసిన ప్రణబ్ ముఖర్జీ ఈఏడాది తన వారసుని చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోబోతున్నారు. సుదీర్ఘమైన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులను అలంకరించిన ప్రణబ్ ముఖర్జీ కి వివాదాల పరిష్కర్తగా (ట్రబుల్ షూటర్)మంచి పేరుంది.ఆయన రాజకీయాల్లో కొనసాగినంత కాలం ప్రత్యర్థులను సూటిగా, పదునైన విమర్శలు కురిపించడంలో ఏనాడూ వెనకాడ లేదు. విధానపరమైన అంశాలపైనే ఆయన విమర్శలు చేయడం వల్ల వివాద రహితునిగా పేరు తెచ్చుకున్నారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం కాంగ్రెస్ పార్టీగా విధేయునిగా కొనసాగిన ప్రణబ్ రాష్ట్రపతి కాగానే రాజకీయాలకు అతీతంగా అందరి పట్ల సమభావాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందారు. రాష్ట్రపతిగా ఆయన చేసిన ప్రసంగాలు నేటికీ నిత్యనూతనం. గోరక్షకుల దాడుల నేపథ్యంలో దేశంలో పెరిగి పోతున్న అసహన ధోరణులపై మూడేళ్ళక్రితం ఆయన గణతంత్ర దినోత్సవం నాడు చేసిన ప్రసంగం ప్రధాని మోడీతో సహా అందరినీ ఆకట్టుకుంది. అదే సమస్యను ప్రస్తుత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ గణతంత్ర దినోత్సవ సందేశంలో మరో రూపంలో ప్రస్తావించడం గమనార్హం.దేశంలో అసహన ధోరణులు ఇప్పటికీ కొనసాగుతుండటం కూడా గమనార్హమే. అప్పట్లో ప్రణబ్ చేసిన ప్రసంగాన్ని ఉటంకిస్తూ గోరక్షకులను ప్రధాని మోడీ తీవ్రంగా హెచ్చరించారు.అయినా ఇంత వరకూ వారి వైఖరిలో మార్పు రాలేదు. ప్రణబ్ ముఖర్జీ పదవీ విరమణ సందర్భంగా ఆయనపై మోడీ ప్రశంసలు కురిపించారు. ప్రణబ్. రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీకి చెందిన వారైనా, రాష్ట్రపతిగా నిష్పక్ష పాతంగా వ్యవహరించారని మోడీ చేసిన వ్యాఖ్యపై కాంగ్రెస్ నాయకులు కొందరు సోనియా గాంధీకి చాడీలు చెప్పారు. అయితే, ప్రణబ్ ప్రతిస్పందించలేదు. అలాగే, నాగపూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) సమావేశానికి హాజరై ప్రణబ్ సంచలనాన్ని సృష్టించారు. సంఘ్ సమావేశానికి హాజరైనప్పుడు కూడా దేశంలో అసహన ధోరణులకు వ్యతిరేకంగానే ప్రసంగించి పెద్దాయనగా తన ధర్మాన్ని నెరవేర్చారు. ఇందిరా గాంధీ అనుచరునిగా కాంగ్రెస్‌లో ప్రవేశించిన ప్రణబ్ ఆమె కుమారుడు రాజీవ్ గాంధీకి దూరం కావల్సి వచ్చినా బాధ పడలేదు.ఆయన సూటిగా, నిష్కర్షగా ఇచ్చే సలహాలను ఇందిరాగాంధీ ఎంతోమెచ్చుకునే వారు. సోనియాగాంధీ పార్టీ అధ్యక్షురాలైన తర్వాత ఆయనకు తిరిగి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సముచితమైన స్థానాన్ని కల్పించి ఆయన సలహాలు తీసుకునే వారు. రాజకీయ నాయకునిగా ఆయన కాంగ్రెస్ పార్టీకి ఎంత సేవ చేశారో, రాష్ట్రపతి అయిన తర్వాత దేశానికి పెద్ద దిక్కుగా అదే రీతిలో సలహాలు ఇచ్చారు.ఈ విషయాన్ని మోడీయే స్వయంగా అంగీకరించారు. ప్రణబ్ ముఖర్జీ సుదీర్ఘ జీవితంలో దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా అత్యున్నత పౌర పురస్కారాన్ని ఆయనకు ప్రకటించడం హర్షణీయం. అదే మాదిరిగా ఈ పురస్కారాన్ని పొందిన నానాజీ దేశముఖ్ కూడా రాజకీయాల్లో చాలా కాలం కొనసాగినా, వివాద రహితునిగానే పేరు తెచ్చుకున్నారు. భారతీయ జనసంఘ్ తొలితరం నాయకుల్లో ఆయన ఒకరు.ఆయన సంఘ్ పరివార్ కార్యకర్తగా,నాయకునిగానే కాకుండా, వినోబాబావే ప్రారంభించిన భూదాన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. భారతీయ జనసంఘ్‌లో కీలక వ్యక్తిగా అప్పట్లో పేరొందినా ఆయన పై మత ముద్ర పడకపోవడం గమనార్హం. 39 ఏళ్ళ క్రితం రాజకీయాలకు స్వస్తి చెప్పి గ్రామీణాభ్యుదయ కార్యక్రమాల్లో చివరి వరకూ సేవలందించారు. ముఖ్యంగా, గ్రామాల రూపురేఖలు మార్చాలన్న మహాత్మాగాంధీ ప్రబోధాన్ని ఆయన వారసులమని చెప్పుకునే కాంగ్రెస్,సేవాదళ్ నాయకుల కన్నా నానాజీ దేశ్ ముఖ్ ఎక్కువ వంటపట్టించుకుని సేవా రత్నగా పేరొందారు.అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. గ్రామాల స్వయం పోషకత్వం, జల సంరక్షణ తదితర అంశాలపై ఆయన స్ఫూర్తిదాయకమైన సేవలందించారు. ఆయనకూ, అస్సామీ గాయకుడు భూపేన్ హజారికాకూ మరణానంతర పురస్కారంగా ఈ అవార్డును ప్రభుత్వంప్రకటించింది.భూపేన్ అస్సామీ గాయకుడైనా హిందీలో కూడా పలు చిత్రాలకు సంగీతం గానాన్ని అందించారు. జానపద గీతాలను ఆలపించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. హజారికాకు భారత రత్న అవార్డును ప్రకటించడం ఈశాన్య ప్రాంత జానపద గీతాలకు కేంద్రం గుర్తింపు లభించినట్టయింది. భారత రత్న, పద్మశ్రీ, పద్మ విభూషణ్ వంటి అవార్డులను తమ ప్రభుత్వం పారదర్శకంగా అందిస్తుందన్న మాటను మోడీ నిలబెట్టుకున్నారు.

లౌకికవాదమే ఇరుసు!



మన రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 69 సంవత్సరాలు అయింది. మనది లిఖిత రాజ్యాంగం, మనదిలౌకిక రాజ్యాంగం. అన్ని మతాలకూ సమానమైన గౌరవం,ప్రతిపత్తిలను మన రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతిపౌరునికి ప్రాథమిక హక్కులతో పాటువాక్ స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ,ఉపాధి స్వేచ్ఛలను కల్పించింది. రాజ్యాంగంలో ఇప్పటికి 124 సార్లు సవరణలు చేశారు.పార్లమెంటులో మూడింట రెండు వంతులమంది సభ్యులు ఆమోదిస్తేనే రాజ్యాంగ సవరణ సాధ్యమవుతుంది. మన దేశంసామ్యవాదాన్ని అనుసరిస్తోంది. దీనినే నెహ్రూ సామ్యవాదంగా స్థిరపడింది. మన దేశం సర్వసత్తాక ప్రతిపత్తిని పొందిన రోజు ఇది. కనీస అవసరాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రతి పౌరునికీ తిండి, బట్ట, గూడు వంటి కనీస వసతులను సమకూర్చేందుకు మన రాజ్యాంగం హామీ పడింది.మనది లౌకిక రాజ్యాంగం,రాజ్యాధికార మతమంటూ ఉండదు. పాలనలో కానీ, ప్రభుత్వ వ్యవహారాల్లో కాని మత ప్రమేయం ఉండదు.దేశంలో పౌరులందరికీ మత స్వేచ్ఛ ఉంది.మన రాజ్యాంగానికి లౌకిక వాదమే ఇరుసు.

సార్వభౌమాధికారం అంటే ఆంతరంగిక, విదేశాంగ విధానాల్లో ఎవరి నుంచి ఒత్తిడి లేకుండా స్వతంత్ర నిర్ణయాలను తీసుకోవడమే.మనదేశం మొదటి నుంచి సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది.షెడ్యూల్డ్ కులాలు,తెగల వారికి విద్యా,ఉద్యోగ రంగాల్లోనూ, చట్ట సభల్లోనూ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించింది. రిజర్వేషన్ల కోసం సమాజంలో వివిధ సామాజిక వర్గాల నుంచి డిమాండ్లు అధికమయ్యాయి.పార్లమెంటు ఇటీవలి సమావేశాల్లో సంపన్న వర్గాల్లో పేదలకు10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడం, రాష్ట్రపతి దానికి ఆమోద ముద్రవేయడం జరిగింది.

పార్లమెంటు (చట్టసభ),కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం), న్యాయవ్యవస్థ (కోర్టులు),పత్రికా వ్యవస్థ (మీడియా) ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా తరచూ అభివర్ణిస్తూ ఉంటారు.ఈ వ్యవస్థలు దేనికదే స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ప్రజల హక్కులనూ, జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నాయి. రాష్ట్రా ల గవర్నర్లు, కేంద్ర ఎన్నికల సంఘం, రిజర్వు బ్యాంకు, సుప్రీంకోర్టు మొదలైనవి అన్నీ రాజ్యాంగ బద్ధ సంస్థలే.వీటి గౌరవాన్ని,ప్రతిపత్తిని కాపాడాల్సిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానిదే. దేశ ప్రజల అవసరాలను బట్టి పార్లమెంటు చేసే చట్టాలన్నీ రాజ్యాంగ పరిధిలోనే పని చేస్తాయి. మన రాజ్యాంగంలో పొందుపర్చబడిన అధికరణాలు దేశాన్ని సర్వస్వతంత్ర దేశంగా నిలబెట్టేందుకు ఎంతో దోహదం చేస్తున్నాయి. మన రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చడానికి ఏ ప్రభుత్వానికీ అధికారం లేదు.రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చే యత్నాలు జరిగినప్పుడు దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి ఎమర్జెన్సీకాలంలో నిరంకుశ పోకడలను ప్రతిఘటించారు.మౌలిక స్వరూపాన్ని మార్చాలన్నా వీలు లేని విధంగా మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇందుకు మూల పురుషుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్.అందుకే ఆయన రాజ్యాంగ నిర్మాతగా పరిగణింపబడుతున్నారు. మన పొరుగు దేశాల్లో గడిచిన ఏడు దశాబ్దాల్లో ఎన్నో సార్లు ప్రభుత్వాలు కుప్పకూలాయి. సైనికాధికారులు అధికారాన్ని చేపట్టారు. రాజ్యాంగాన్ని తమ యథేచ్ఛగా మార్చేశారు. కానీ, మన దేశంలో అటువంటి పరిణామాలకు అవకాశంలేని రీతిలో మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని పటిష్ఠంగా రూపొందించారు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశంలో 500 పైగా ఉన్న సంస్థానాలను ఇండియన్ యూనియన్ లో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ ది.అందుకే ఆయనను ఉక్కుమనిషిగా దేశ ప్రజలు కీర్తిస్తున్నారు. సంస్థానాలను విలీనం చేయడం కోసం పటేల్ చూపిన సాహసం,చొరవ అనన్యసామాన్యం. దేశంలో వెనక బడిన వర్గాల కోసం, మహిళల కోసం రాజ్యాంగ బద్ధంగా కమిషన్లు ఏర్పాటయ్యాయి. రాజ్యాంగ హక్కులను ఏ ప్రభుత్వమైనా కాలరాయడానికి ప్రయత్నిస్తే ప్రజలు ఎప్పటికప్పుడు చైతన్యవంతులై ప్రతిఘటిస్తున్నారు.మన దేశంలో న్యాయవ్యవస్థపై ప్రజలందరికీ సంపూర్ణమైన విశ్వాసం ఉంది. రాజ్యాంగ బద్ధ సంస్థలపై అలనాడు ఇందిరాగాంధీ హయాంలోనూ,ఇప్పుడు మోడీ హయాంలోనూ ఒత్తిడులు పెరుగుతున్నా ప్రజలు ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తుండటంతో రాజ్యాంగాన్ని పదిలంగా కాపాడుకోగలుగుతున్నాం.

అలాగే, పొరుగుదేశాల నుంచి వచ్చే ఒత్తిడులను తట్టుకునేందుకు అవసరమైన దన్నునూ, మద్దతునురాజ్యాంగం కల్పిస్తోంది.ఉదాహరణకు ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపి వేయాలని అమెరికా హూంకరింపులు చేసినప్పటికీ, మన దేశం రాజ్యాంగ బద్ధంగా నడుచుకుని ఈ సమస్యను పరిష్కరించుకుంది.అలాగే, అగ్రరాజ్యమైన అమెరికా, మన పొరుగు దేశమైన చైనా మన ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు కూడా వాటిని నిలువరించేసత్తాను మన రాజ్యాంగం మనకు ఇచ్చింది.సర్వసత్తాక మనే పదానికి అర్థంఏ అంతర్జాతీయ కూటమిలోనైనా సభ్యత్వాన్ని స్వీకరించడానికి,లేదా వదులు కోవడానికి స్వేచ్ఛను కలిగి ఉండటమే.తొలి ప్రధాని పండిట్ నెహ్రూ కామన్ వెల్త్ లో భారత్ సభ్యత్వాన్ని స్వీకరించడాన్ని పేర్కొనవచ్చు.దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినప్పుడు ఇదిఐచ్ఛికమైన నిర్ణయమనీ, ఎప్పుడు వదులుకోవడానికైన మనకు స్వేచ్ఛ ఉందని అప్పట్లో ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రాథమిక హక్కులు ప్రాణప్రదమైనవి, రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదికగా ఉండాలని 1945లోనే తేజ్ బహదూర్ సప్రూ సూచించారు.ప్రాథమిక హక్కుల విషయానికి వస్తే డాక్టర్ అనిబిసెంట్ 1925లో కామన్వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో ఐర్లండ్ మాదిరిగానే భారత ప్రజలకు ప్రాథమిక హక్కులు శాశ్వత ప్రాతిపదికపై కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్రెంచ్ విప్లవం సందర్భంగా పుట్టుకొచ్చిన నినాదాలైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వాలను ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నింటిలో హక్కుల రూపంలో పొందుపర్చారు. మన రాజ్యాంగంలో హక్కులకు ప్రాతిపదిక అదే. దేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న వస్తే, భారతరిపబ్లిక్ 1950 జనవరి 26న ఏర్పడింది.వివిధ దేశాల రాజ్యాంగాలను లోతుగా పరిశీలించి అంబేద్కర్,డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రభృతులు రూపొందించిన రాజ్యాంగం ప్రపం చంలోని దేశాలన్నింటికీ తలమానికమైనది. మన దేశంలో వివిధ మతాలు, కులాలు, జాతులు, వర్గాలు, ప్రాంతాలతో భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి మన రాజ్యాంగమే మూలకందమై నిలుస్తోంది. చట్టసభలు, న్యాయస్థానాలు, పత్రికా సమా చార వ్యవస్థ,కార్యనిర్వాహక వ్యవస్థలన్నీ రాజ్యాంగా నికి లోబడే పని చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని శిరసావహించే వారికే భారత పౌరసత్వం లభిస్తుంది.అందరినీ సమానంగా పరిగణిస్తూ లౌకిక, ప్రజాతంత్ర వ్యవస్థను కాపాడుకోగలుగుతున్నా మంటే అది రాజ్యాంగం పుణ్యమే.

-ఎ.వి. స్వామి

వ్యక్తిగత రాజ్యాంగాన్ని నిర్మించుకుందాం



స్వాతంత్రం సార్వభౌమాధికారాన్ని ఇవ్వలేదు. భారత జాతి లోని ప్రతి పౌరుడు సార్వసత్తాక ప్రజాస్వామ్య లౌకిక గణతంత్ర రాజ్యంగా మారి తమను తాము పరిపాలించుకొనే సమగ్రమైన క్షమత దక్షతలకు మహనీయుల చేత రూపకల్పన చేయబడిన పండుగ రోజు జనవరి 26 గణతంత్ర దినోత్సవ ము. ''స్వాతంత్ర దినోత్సవం ఇల్లలకడం అయితే.. గణతంత్రము పండగ చేసుకోవడం'' ఇది మన దేశానికి సంపూర్ణత్వాన్ని ప్రసాదించిన రోజు. 1935 నవంబర్ 26 న భారత జాతీయ రాజ్యాంగ సభచే రాజ్యాంగం ఆమోదించ బడింది. భారత రాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్ గా మహా మేధావి డా!! బి ఆర్ అంబేద్కర్ , డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షులు మొదలైన విజ్ఞుల కృషి కారణంగా 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు రచన జరిగింది. ప్రజాతం త్ర పరిపాలనా పద్ధతిగా రాజ్యాంగాన్ని 26 జనవరి 1950 నాడు అమలులోకి తెచ్చారు. 1930 జనవరి 26న భారత జాతీయ కాంగ్రెసు పూర్ణ స్వరాజ్ ని ప్రకటించుకుంది. అందుకే అదే తారీఖు అయిన , జనవరి 26 ను గణతంత్ర అమలుకు ఎంచుకున్నారు. రాజ్యాంగం అంటే ''ఒక దేశం లోని ప్రజలు, పాలకులు, యంత్రాంగం అందరు ఆచరించి, పాటించవలసి న నియమ నిబంధనల పట్టిక. ప్రభుత్వం గురించి, ప్రభుత్వ విధానాల గురించి, దాని లక్ష్యాల గురించి వివరించే ఒక అత్యు న్నత శాసనం. వివిధ దేశాల రాజ్యాంగాలల్లోని మంచి మంచి ఉపయుక్తమైన విషయాలను.. స్వేచ్ఛ సమానత్వం, ఆదేశిక సూత్రాలు, పంచ వర్ష ప్రణాళికలు వంటివి దిశానిర్దేశనంగా నిలిచాయి. రాజ్యాంగంలోని అధికరణాలు జాతిని నడిపిసున్నాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకుని వ్యక్తిత్వ నిర్మాణం లో మనలను మనం తీర్చిదిద్దుకోవడానికి '' వ్యక్తిగత రాజ్యాంగాన్ని నిర్మించుకుందాము'' దేశదేశాలను పరిశీలించి మన మేధావులు రాజ్యాంగాన్ని రచించారు. పరిశీలన అనుకరణ అనేవి వ్యక్తి పురోభివృద్ధికి దోహదపడే అంశాలలో ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చును. ప్రేమ సహనం సౌభ్రాతృత్వం, జ్ఞానం క్రమశిక్షణ దేశభక్తి నిజాయితీ, శీలం, అంకితభావం, ఆధ్యాత్మికత, సంపద సంస్కారం, పరమత సహనం వంటి ఉత్తమ గుణాలు బాల్యదశలోనే అలవాటుగా మారితే దేశ సౌభాగ్యానికి లోటుండదు. అలాగే ప్రతి ఒక్కరు తనకేమి కావాలి, జీవిత లక్ష్యం ఏమిటీ అనేవి ఆలోచించుకోవాలి. ప్రతి వ్యక్తి వైయక్తిక నియమావళి రాసుకోవాలి. తానేం చేయాలి అని అవి మూడు అంశాల్లో ఉండేలా ఒకటి తనకోసం రెండు కుటుంబం కోసం, మూడు సమాజం కోసం. ఎన్ని సాధించారు ఇంకా సాధించాల్సినవి ఏమిటి అనేవి పొందుపరుచుకుంటే... మనకు కూడా చాలా ఉత్సాహంగా ఉంటుంది లక్ష్య సాధనకు ఒకసూచికగా మారుతుంది. నీరసించినప్పుడు తట్టిలేపుతుంది మన వ్యక్తిగత రాజ్యాంగం.

ఇంకొక ముఖ్యమైన విషయం ''పరిశీలన అనుకరణ'' ఆయా రంగాలలో కృషిచేసిన వారిని సాధకులను గమనించడం వారినుంచి విషయాలు గ్రహించి అమలు చేయడం. ఇలాంటివి చిన్నవిగా అనిపించే మహత్వపూర్ణమైన అంశాలు. నియమాలు సమగ్ర జీవితానికి మూలస్థంభాల వంటివి. జాతిపిత మహాత్మా గాంధీ జీవితం దీనికొక చక్కని ఉదాహరణ. అలాగే మన రాజ్యాంగ ప్రణేత అంబేద్కర్ గారు కూడా... ప్రణాళిక బద్ధమైన జీవనం ద్వారా మహనీయులయ్యారు.

చిన్న వయసులోనే ఇలాంటివి పిల్లలకు అలవాటు చేయగలిగితే పెద్దలను గురువులను గమనిస్తూ ఆచరిస్తూ వెళ్లడం, తప్పొప్పులు సరిచేసుకుంటూ వెళ్లడం తమ దినచర్యలో భాగంగా మలిస్తే ...నిజంగా ఊహించనంత గొప్ప ఫలితం వస్తుంది. జన్మనెత్తితే సరిపోదు చరితార్థం చేసుకోవాలి. నలుగురిలో ఉన్నతంగా ఎదగాలి ''ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్ళాలి'' ఇది నియమాలు ప్రణాళికల ద్వారానే సాధ్యం సరైన మార్గదర్శనం, దిశానిర్దేశనం ఏర్పరచుకున్న వాళ్ళ జీవితాలను గమనిస్తే అర్థం అవుతుంది. లేదా గాలివాటంగా సాగాలి. ఎగరచ్చు పడిపోవొచ్చు కూడా!! అందుకే భవ్య సమాజనిర్మా ణం కోసం వ్యక్తిగత అభివృద్ధి వికా సం కోసం మహోన్నత లక్ష్య సాధన కోసం వ్యక్తిగత నియమాల ఆదేశ సూత్రాల రాజ్యాంగాన్ని ఎవరికి వారు తయారు చేసుకుందాము. గణ తంత్ర పర్వాన్ని మన జీవితాల్లో ప్రతి రోజు జరుపు కుందాము. అందరము కలిసి భరత మాత మెడలో మణిహారంలో రత్నాలై వెలుగొందుదాము.



-రమాదేవి కులకర్ణి, 985613123

మెరుగైన సమాజం రాజ్యాంగానికి స్ఫూర్తి!

భారతదేశం వలస పాలన నుండి విముక్తి పొందిన తరువాత మెరుగైన సమాజాన్ని రూపొందించే విధానంలో జాతీయోద్యమ నాయకులలో తీవ్రమైన అభిప్రాయభేదాలు ఉండేవి. అయినా కూడా ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం నడవాలని ఆనాటి నాయకులు అంగీకరించారు.. మనం నమ్మిన మౌలిక సూత్రాలను, దేశాన్ని పరిపాలించే విధానాలను అందరికీ అనుకూలంగా పొందుపరచాలని ఆనాటి నాయకులు అనుకున్నారు. దాని ప్రకారమే ''భారత రాజ్యాంగం ''అనే పుస్తకం అవసరం ఏర్పడింది. భారతదేశాన్ని బ్రిటిష్ వారు దాదాపు రెండు వందల సంవత్సరాలు పరిపాలించారు. వాళ్లకు అనుగుణంగానే పరిపాలన సంస్థలను రూపొందించుకున్నారు. దేశంలో అధిక భాగం రాచరిక పాలనలో ఉండి సామాజిక, సాంస్కృతిక, వైవిధ్యాలే కాకుండా పేద , ధనిక,మధ్య, అగ్ర కులాల తేడాలు ఉండేవి. మత కల్లోలాల వల్ల కూడా విభజన కాబడి ఉన్నది. మన జాతీయోద్యమం కేవలం విదేశీ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం కాదు .అసమానతలను, దోపిడీనీ, వివక్షలను సైతం మన సమాజం నుంచి నిర్మూలించాలనీ భావించింది. దేశంలో అక్షరాస్యత స్థాయి చాలా తక్కువగా ఉండి, తీవ్ర పేదరికంతో ఉంది. కరువు కాటకాలతో లక్షలాది మంది చనిపోయారు. మౌలిక అవసరాలైన ఆహార ధాన్యాల కోసం కూడా ఇతర దేశాలపై ఆధారపడిన పరిస్థితులు అవి భవిష్యత్ సమాజం కోసం ఒక లక్ష్యంను ఏర్పరచుకుని దానిని చేరుకోవడానికి ''రాజ్యాంగం'' అవసరం ఏర్పడింది.

రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి దేశం కృషి చేయాలన్నది నాయకులు అందరి ఆలోచన. దీని ప్రకారమే ఈ దేశాన్ని ఎలా సమర్థవంతంగా పరిపాలించాలి, చట్టాలు ఎలా చేయాలి, ప్రభుత్వ ఏర్పాటు ఏవిధంగా ఉండాలి, పౌరుల పాత్ర ఎంత, చట్టం ముందు అందరూ సమానమే అయినా వారికి కొన్ని ప్రాథమిక హక్కులు ఇంకా కుల, మత, జాతి, సంపద భేదం లేకుండా ఎన్నికలలోపోటీ చేసే హక్కు మొదలైనవి కల్పించడం జరిగింది. సర్వసత్తాక, గణతంత్ర దేశంగా ఉండి స్వతంత్ర అధికారాలు కలిగిన అనేక రాష్ట్రాలు ఉంటాయి. ప్రజాస్వామ్యం వల్ల సమానత్వం, స్వేచ్ఛ పౌరులందరికీ లభిస్తుంది .ప్రపంచ శాంతి కోసం , మానవాళి అంతటి సంక్షేమం కోసం కాబట్టి దీనిని ''ఉద్దేశాల తీర్మానం'' అని కూడా అన్నారు.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం. వివిధ కులాల, మత సంస్కృతుల, వివిధ ప్రాంతాల వారు అందరూ కూడా శాంతియుతంగా జీవిస్తున్నారంటే అది రాజ్యాంగ పుణ్యఫలమే. స్వాతంత్ర్య అనంతరం 1946 జూలైలో రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి. నిజానికి ఈ రాజ్యాంగ సభలో అంబేద్కర్ లేరు. ఆ తర్వా త బాబు రాజేంద్రప్రసాద్ చూపిన చొరవతో తను రాజ్యాంగ సభకు కాంగ్రెస్ ఆయనను సభ్యునిగా తీసుకోవాలని నిర్ణయిం చుకుంది. భారతదేశానికి ఒక దిశ నిర్దేశనం చేసే ఒక రాజ్యాం గం అవసరమని1947లో నిర్ణయించారు.అందుకూ1947 ఆగస్టు29న ఏడుగురుతో కూడిన ఒక రచన సంఘాన్ని ప్రకటించారు. ఆ రచనా సంఘానికి చైర్మన్‌గా అంబేద్కర్ ను నియమించారు. ఈ విధంగా చర్చ నిమిత్తం ఏర్పడిన డ్రాఫ్టింగ్ కమిటీ. అంబేద్కర్‌తో పాటుగా రచనా సంఘంలో పండిట్ వల్లభాయ్ పటేల్, కె.ఎం.మున్షీ, కృష్ణస్వామి అయ్యర్, గోపాల స్వామి అయ్యంగార్, మహమ్మద్ సాదుల్లా, డీ.పి ఖైతాన్ ఉన్నారు. ఖైతాన్ ఆకస్మికంగా మరణించడంతో అతడి స్థానంలో టి. కృష్ణమాచారిని నియమించారు. భారత రాజ్యాంగ నిర్మాణం కోసం 2 సంవత్సరాల 11నెలల 18 రోజులు పట్టింది. ఈ రచనా సంఘంలో కంటే ఎక్కువగా కృషి చేసినది అంబేద్కర్ అని అందరూ ఒప్పుకున్నారు. రచన కమిటీ ఏర్పాటు అయినప్పటి నుండి రాజ్యాంగ రచన అనే బృహత్కార్యానికి తన సర్వశక్తులూ వెచ్చించారు అంబేద్కర్. బాబు రాజేంద్రప్రసాద్ తన చివరి ప్రసంగంలో భారతరాజ్యాంగాన్ని ఓ.. శక్తివంతమైన ఆయుధంగా మలిచిన అంబేద్కర్‌ను ఎంతగానో ప్రశంశిస్తూ తన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ఒక యజ్ఞంలా కొనసాగించారని అభినందించారు.

-గోస్కుల శ్రీలతరమేశ్, హుజురాబాద్

గణతంత్ర 'మహా'మంత్రం!

తూరుపు తెల్లారింది.
వెలుతురు దూసుకొచ్చింది.

దేశం స్వేచ్ఛా పతంగమయ్యింది.
పరిగెత్తే తురంగమయ్యింది!.
మహా తరంగమయ్యింది!!.
ఆనంద సంరంభం...
భారతమాత సోత్తయ్యింది!.
భారతీయుల సోత్తయ్యింది!!.
ఓగమ్యం కోసం ...ఓ లక్ష్యం కోసం.
స్థితి కొసం గతి కోసం....
ప్రత్యేక ఆకృతి కోసం....
మనల్ని మనమే నియంత్రించుకునే
మన దారుల్ని మనమే నిర్ధేశించుకునే
ద్వారాలు తెరుచుకున్నాయి..!!
ఓ మహాభాష్యం సాకారమయ్యింది.!
రాజ్యాంగం వెలిసింది.!!
రాజ్యాంగమై నిలిచింది!!!
ఆది మంత్రమయ్యింది.
మహామంత్ర మయ్యింది!
గణతంత్ర మయ్యింది.
గణతంత్ర దినోత్సవమయ్యింది!!!
ఎర్రకోట బురుజులపై...
గణతంత్ర మంత్రమై మ్రోగుతోంది.!
మహామంత్రమై మార్మోగుతోంది!!.


-రమా ప్రసాద్ ఆదిభట్ల, 9348006669

ఆంధ్రప్రదేశ్‌లో ఓటు విలువ!

25 లక్షల కోట్లు!

● కాబోయే సీఎందే పెత్తనం ● ఏటా రూ.5 లక్షల కోట్ల వ్యయం ● నిరాటంకంగా పాలించే అధికారం● గతంలో ముళ్ల కిరీటం.. నేడు పూలపాన్పు ● తూ.తూ. మంత్రంగా ఓటరు దినోత్సవం

ఓటరులో చైతన్యమేదీ?




అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఓటు విలువ 25 లక్షల కోట్లపై పెత్తనం.. ఐదు కోట్ల జనాభాను ఐదేళ్ళ పాటు నిరాటంకంగా పాలించే అధికారం. ఇంత విలువైన ఓటుపై చైతన్యం తెచ్చేందుగ్గాను ఏటా ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌లు ఓటరు దినోత్సవాన్ని నిర్వహిసున్నాయి. ఈ నెల 25న ఈ దినోత్సవాన్ని ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహిస్తే కొన్ని సామాజిక సంస్థలు ప్రచార పరిమితికి లోబడి పూర్తి చేశాయి. అంతకుమించి ప్రజల్ని ఓటు హక్కుపై చైతన్యపర్చి ఓటు సద్వినియోగం దిశగా ప్రేరేపించ గలిగే స్థాయిలో ఎలాంటి కార్యక్రమాలు అమలు కాలేదు. ఆఖరకు ఈ బాధ్యతలో ముందుండాల్సిన మీడియా కూడా ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం మేథావుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. గతంతో పోలిస్తే ఓటు ప్రాధాన్యత అనూహ్యంగా పెరిగింది. ఇందుక్కారణం అధికారం పట్ల రాజకీయ నాయకుల్లో పెరిగి ఆసక్తే. గతంలో సాధారణ ఎన్నికలకు నాలుగైదు మాసాల ముందు రాజకీయ వాతావరణం వేడెక్కేది. పోటీ చేసే ఆసక్తి ఉన్న అభ్యర్ధులు, వారి ప్రత్యర్థులు పరస్పర ఆరోపణలకు దిగేవారు. ప్రభుత్వ తమ విజయాల్ని ఏకరవు పెడితే విపక్షం వైఫల్యాల్ని ప్రజల ముందు విప్పి చెప్పేది. ప్రధాన పక్షాలన్నీ ప్రజల్ని ఆకర్షించే పథకాలు ప్రకటించి ఓట్ల కోసం తహతహలాడేవి.

ఎన్నికల అనంతరం పాలకపక్షంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు నిరసన ప్రదర్శనలకు పాల్పడేవి. తద్వారా తమ ఉనికిని కాపాడుకునేవి. కానీ ఇప్పుడు ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ఎన్నికలకు ఇంకా ఏడాది ముందే పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. విపక్షాలు ప్రజాకర్షక పథకాల్ని అమలు చేస్తామని ప్రజల్లోకి వెళ్తుంటే అధికారపక్షం అవే పథకాల్ని ఆచరణలో అమలు చేసి చూపిస్తోంది. ప్రభుత్వం రోజూ ఏదొక కొత్త పథకాన్ని ఆచరణలోకి తెస్తోంది. గతంలో కంటే మెరుగైన ప్రజాకర్షక పథకాల్ని ప్రకటిస్తోంది.

ఇవన్నీ ప్రజలకు అవసరమా కాదా అన్న ఆలోచన కూడా చేయడంలేదు. ఇందుక్కారణం ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ప్రజలు కూడా గతంలోలా ఆచరణ సాధ్యం కాని డిమాండ్లు చేయడంలేదు. ఇప్పటికే రాష్ట్రబడ్జెట్ రూ. 2 లక్షల కోట్లకుపైగా పెరిగింది. ఇది కాక అన్ని విధాలుగా సమకూరే ఆదాయం మరో మూడు లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఇలా ఏటా రూ. 5 లక్షల కోట్లను తమ ఇష్టారాజ్యంగా వ్యయం చేసే అధికారం ప్రభుత్వాలకు ఏర్పడుతుంది. ఇలా ఐదేళ్ళలో రూ. 25 లక్షల కోట్లు ఒక వ్యక్తి చేతుల మీదుగా ఆయన విచక్షణాధికారాలకు అనుగుణంగా ఖర్చు పెట్టగలిగే వెసులుబాటు అందుబాటులోకొచ్చింది. గతంలో ముఖ్యమంత్రి పదవి అంటే ముళ్ళ కిరీటంగా భావించేవారు. నిత్యం సమస్యల వలయంలో ఇరుక్కోవాల్సి ఉంటుందని భయపడేవారు. కానీ ఇప్పుడు అదే పదవి పూల పాన్పులా మారింది. ఎలాంటి నిర్ణయాన్నైనా ఇష్టారాజ్యంగా తీసుకునే అవకాశమేర్పడింది. ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లు కూడా సాగిలపడి ఆదేశాల్ని అమలు చేసే పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే మీదపడ్డ వయసును కూడా ఖాతరు చేయడం లేదు. మరికొంతకాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగాలని కోరుకుంటున్నారు. కొందరు ఎంత సంపన్నులైనా కనీసం మూడు దశాబ్దాల పాటు ఆ పీఠంపై కూర్చోవాలని అభిలషిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఓటుహక్కు సద్వినియోగం కావడం అత్యంత కీలకం. ప్రజాస్వామ్య పరిపుష్టికి అసలైన ఆయుధం కూడా ఈ ఓటుహక్కే. కానీ ఓ ఓటుపై చైతన్యపర్చే కార్యక్రమాలకు అటు ప్రభుత్వం ఇటు స్వచ్ఛంద సంస్థలు, ఆఖరుకు మీడియా కూడా తగిన ప్రాధాన్యత నివ్వకపోవడం విడ్డూరం.

గెలిస్తే ఓకే... ఓడితే ఒప్పుకోరా?

● కాంగ్రెస్‌ను నిలదీసిన ఎంపీ బూర నర్సయ్యగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న యాగీని టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఎంఎల్ఎ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మాట్లాడిన నర్సయ్యగౌడ్ ఈవీఎంలను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. తెలంగాణతో పాటు దేశంలోనిమరో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయని, తెలంగాణలో కాంగ్రెస్ ఓడిపోగా, మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిందన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయని, ఎన్నికల నిర్వహణ సక్రమంగా లేదని తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాలలో ఎందుకు ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయని మాట్లాడటం లేదని నిలదీశారు. ఓడితే ఈవీఎంల తప్పు గెలిస్తే తమ ప్రతాపమని కాంగ్రెస్ నేతలు గల్లీ లీడర్లలా మాట్లాడటం దారుణమన్నారు. కాంగ్రెస్ నేతల ఆరోపణలు ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌దే హవా అని సర్వేలు పేర్కొంటున్నాయని, ఫెడరల్ ఫ్రంట్ గురించి అపహాస్యంగా మాట్లాడిన వారే ఇప్పుడు తమ వైఖరిని సమీక్షించుకుంటున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం కేసీఆర్ జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించడం ఖాయమన్నారు.

కాంగ్రెస్, టీడీపీలు ప్రజలను మోసం చేసేందుకు మరోసారి ప్రయత్నిస్తున్నాయని నర్సయ్యగౌడ్ మండిపడ్డారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, టీడీపీలు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వేర్వేరుగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యాయన్నారు. ఏపీలో టీఆర్ఎస్‌ను బూచిగా చూపుతూ ఆరోపణలు చేయడం టీడీపీ మానితే మంచిదని హితవు పలికారు.

ఓట్ల తొలగింపు బాధ్యులపై చర్యలేవీ?



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో 22 లక్షల ఓట్లు గల్లంతైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమారే స్వయంగా ఒప్పుకున్నారని, అయినా సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. న్యాయంగా జరగాల్సిన ఎన్నికలను ఇష్టారాజ్యాంగా నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితా విషయంలో హై కోర్టును కూడా ఎన్నిక సంఘం పూర్తిగా తప్పుదోవ పట్టించిందన్నారు. కేసీఆర్ చెప్పినట్లుగానే రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్ కుమార్ నడుచుకుంటూ.. టీఆర్ఎస్‌కు తొత్తుగా మారాడని శశిధర్‌రెడ్డి విమర్శించారు. ఇదే విధానం కొనసాగితే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే అధికారులు కరువయ్యారన్నారు. గవర్నర్ కూడా రాజ్యాంగ హక్కులను కాపాడటంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

రేషన్ షాపుల కన్నా మద్యం దుకాణాలే ఎక్కువ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రేషన్ షాపుల కంటే మద్యం దుకాణాలే ఎక్కువగా ఉన్నాయని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంత రావు అన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వడం మర్చిన ప్రభుత్వం.. మద్యం తాగినోళ్ల ఉద్యోగం మాత్రం ఊడుతోందని ఆయన విమర్శించారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వైన్స్‌షాపుల వద్దే పర్మిట్ రూమ్స్ ఏర్పాటు చేయ డం వల్లే.. అక్కడే మద్యం కొనుగోలు చేసి తాగుతున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పర్మిట్ రూమ్స్‌ను రద్దుచేస్తే అక్కడే మద్యం తాగడం తగ్గుతోందని, దీంతో ప్రమాదాల నివారణ కూడా జరుగుతోందని ఆయన సూచిం చారు.

మహాత్మ జ్యోతిబా పూలేకు భారత రత్న ఇవ్వాలి

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న అవార్డును ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించిన ప్రణబ్ దేశానికి ఎంతో చేశారని కొనియాడారు. అయితే దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతిబా పూలెను గుర్తించి భారత రత్న ఇచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహాత్మ పూలేను కూడా ప్రధాన మంత్రి నరేంద్రమోడి గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు తేకుంటే యుద్ధమే



కోదాడ, ప్రభ న్యూస్ : పార్లమెంట్‌లో బీసీ బిల్లును పెట్టి దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు చట్ట సభలో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టకపోతే యుద్ధమే జరుగుతుందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. క్రిష్ణయ్య హెచ్చరించారు. శుక్రవారం కోదాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో పాలకులు బీసీలను దిక్కులేని వారిగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లో గుజర్లు, గుజరాత్‌లో పటేల్, హర్యానాలో జాట్లు వారి రిజర్వేషన్లకోసం తెగించి చేసిన పోరాటాన్ని బీసీలు కూడా చేస్తే తప్ప దేశంలో బీసీలకు భవిష్యత్ ఉండదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిలపక్షాల ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిని కలిసి బీసీ బిల్లు పెట్టేందుకు వత్తిడి తేవాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీలో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేశారు కానీ పార్లమెంట్‌లో 36 రాజకీయ పార్టీల సభ్యులున్న ఏ ఒక్కరు రాజకీయ పార్టీ కూడా నోరెత్తడం లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మండల శ్రీనివాస్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశం, కృష్ణయాదవ్, వీరబోయిన లింగయ్య పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారా ఎంపీ ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం) ద్వారా జరిగే ఎన్నికల్లో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నందున త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడికి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య శుక్రవారం లేఖ రాశారు. ఈవీఎంల ద్వారా జరిగే ఎన్నికల్లో అవకతవకలతోపాటు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికల్లోనే కాకుండా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు.

మంచిర్యాల ఎన్నికపై వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ పలువురు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయిసున్నారు. తాజాగా మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని పేర్కొంటూ మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హైకోర్టులో శుక్రవారం ఎన్నికల వ్యాజ్యం(ఈపీ) దాఖలు చేశారు. ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎం యంత్రాలను రిటర్నింగ్ అధికారికి తెలియకుండానే స్ట్రాంగ్ రూంకు తరలించినట్లు పేర్కొన్నారు.

చిద్దు ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ.చిదంబరం ముందస్తు బెయిల్ కోసం చేసుకున్న వినతిపై తీర్పును ఢిల్లీ హైకోర్టు రిజర్వ్‌లో ఉంచింది. తొలుత సీబీఐ, ఈడీ అధికారులు చిదంబరం ఐఎన్ఎక్స్ మీడియా కేసు విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా ఎగవేస్తున్నారని ఆరోపించి ఆయనను కస్టోడియల్ ఇంటరాగేషన్‌కు అనుమతించాలిసిందిగా న్యాయస్థానాన్ని కోరారు. 2007లో ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో విదేశాలనుంచి 305 కోట్లు మీడియా గ్రూప్ తీసుకునేందుకు అనుమతించారని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.

పొత్తులా...ఒంటరి పోరాటమా?

● లోక్‌సభ ఎన్నికలపై హైకమాండ్ నిర్ణయం కోసం కాంగ్రెస్ నేతల ఎదురుచూపు ● అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ప్రభావంపై భిన్నాభిప్రాయాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా వెడుతుందా? లేక ప్రజాకూటమితో బరిలోకి దిగుతుందా? అనేది ఇంకా స్పష్టత రావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేయగా, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ అధిష్టానం ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వడం లేదు. పొత్తుల విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది కాంగ్రెస్ నేతలు ఒంటరిగా వెళ్లాలని డిమాండ్ చేస్తున్నప్పటికి.. మెజారిటీ నాయకులు మాత్రం ప్రజా కూటమితోనే వెళ్లాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికార టీఆర్ఎస్‌ను గట్టిగా ఢీ కొట్టాలంటే పొత్తులే మేలని అంటున్నారు. ఓటు బదిలీ అయ్యేలా చూడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇటీవల తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా కూటమి పేరుతో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, తెలంగాణ జనసమితి పార్టీలు కలిసి పోటి చేసిన విషయం తెలిసిందే. ప్రజా కూటమికి ఎమ్మార్పీఎస్ తోపాటు పలు ప్రజాసంఘాలు కూడా మద్దతిచ్చాయి. అయినప్పటికి ప్రజాకూటమి ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ ఓటమికి టీడీపీతో పొత్తే కారణ మని కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి సోదరులతో పాటు కొంత మంది బాహాటంగానే విమర్శించారు. అందుకు భిన్నంగా మరికొంతమంది నేతలు స్పందించారు. ప్రజాకూటమి ఓటమికి టీడీపీతో పొత్తు కారణం కాదని, కాంగ్రెస్ విజయం సాధించలేకపోవడానికి అనేక లోపాలున్నాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు, సీనియర్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లాంటి నేతలు ఖండించారు. దీంతో పార్టీలో కొంత గందరగోళానికి తావిస్తున్నదని ద్వితీయశ్రేణి నాయకత్వం అభిప్రాయపడుతోంది. పొత్తులపై మిత్రపక్షాల్లో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల బదిలీ కాలేదని సీపీఐ నేతలు ఆరోపించారు. సీట్ల పంపకాల్లో ఆలస్యం చేయడం వల్లే తాము ఓడామని తెలంగాణ జనసమితితో పాటు సీపీఐ నేత లుకూడా విమర్శలు చేశారు. అయినప్పటికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని టీజే ఎస్ అధ్యక్షుడు కోదండరామ్ పలుమార్లు ప్రకటించారు. ఇక సీపీఐ మాత్రం ఇంకా తేల్చుకోలేక పోతున్నది. జాతీయ స్థాయిలో మాత్రం కాంగ్రెస్ కూటమిలో ఉండాలని సీపీఐ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ కూడా రాష్ట్రంలో పొత్తు వైపు మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజక వర్గా లకు గాను రెండు, మూడు సీట్లు అడిగే అవకాశం ఉండొచ్చని కాంగ్రెస్‌కు చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయడ్డారు.

పంచాయతీ ఎన్నికల్లో కాస్త బెటర్!

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కంటే రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కాస్త మెరుగైన ఫలితాలు సాధిస్తున్నదని పార్టీ నేతలు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండటం వల్లే పంచాయతీ ఎన్ని కల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఆశించిన మేర విజయం సాధిస్తున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయప డ్డారు. ఇక రెండు, మూడో విడతల్లోనూ కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబు తున్నాయి. ఇకపోతే పార్టీలో మరో వాదన కూడా వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికలకు తేడా ఉంటుందని అంటున్నారు. రాష్ట్రంలోని పరిస్థితులకు అనుగుణంగా అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని, అదే పార్లమెంట్‌లో మాత్రం జాతీయ అంశాలను ప్రజలు పరిగణలోకి తీసుకుం టారని పలువురు నేతలు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యన జరుగుతాయని వాదనలు వినిపిస్తున్నాయి.

పులి చర్మం కేసు ఛేదించిన పోలీసులు

ఆదిలాబాద్, ప్రభ న్యూస్ : రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా, మందమర్రి పట్టణంలో లభించిన పులిచర్మ కేసును ఫారెస్ట్ పోలీస్ అధికారులు రామగుండం పోలీస్ కమిషనర్‌కు అప్పగించడంతో కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.సత్యనారాయణ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిఐ సాగర్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది తో కలసి 2 టీములుగా ఏర్పడి ఒక్క రోజులో అట్టి కేసును ఛేదించారు. కొంతమంది వేటగాళ్లు జైపూర్ మండలం శివారం అడవి ప్రాంతంలో పులిని విద్యుత్ వైర్లు అమర్చి కడ తేర్చి, పులి చర్మం తీసి కళేబరాన్ని, అవయవాలను చెట్ల పొదల్లో పూడ్చి పెట్టగా ఆ సంఘటన స్థలాన్ని గుర్తించి 24 గంటల లోపు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఛేదించి అందరి ప్రశంసలు అందుకున్నారు. సంఘటన స్థలాన్ని సిపి సత్యనారాయణ గారు, మంచిర్యాల డీసిపి వేణుగోపాల్, అడిషనల్ డీసిపి రవి కుమార్, అటవీ శాఖ డీఎఫ్ఐ రామలింగయ్య, ఎఫ్డీఓ జేవి రావ, ఇతర పోలీసు, అటవీశాఖ అధికారులు సందర్శించారు.

సీపీ మాట్లడుతూ కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటకు అడ్డుకట్టు వేయడానికి పోలీస్ శాఖ, అటవీ శాఖ సమన్వయంతో కలిసి పనిచేయడం జరుగుతుందన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో అటవి సంపాదనలు కొల్లగొడుతూ వారిపై కఠినంగా ఉంటామని ఉక్కుపాదం మోపుతాం అన్నారు. అడవులను ధ్వంసం చేస్తున్న స్మగ్లర్లపై ,వేటగాళ్ల పై పోలిస్, అటవీశాఖ ప్రత్యేక నిఘా పెట్టిందని వారి కదలికలు ఎప్పటికప్పుడు పసిగడుతూ దాడులు చేస్తాం అన్నారు. దాడుల సమయంలో, పెట్రోలింగ్ సమయంలో పోలీస్ వారు అటవీశాఖకు సహకరిస్తాం అన్నారు. తరుచుగా అటవి నేరాలకు పాల్పడే వారిపట్ల చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు .స్మగ్లర్ల పట్టుకోవడంలో, అటవీ నేరాల అదుపులో అటవీ శాఖకు పూర్తి సహాయసహకారాలు అందిస్తాం అన్నారు. కలప అక్రమ వ్యాపారస్తులపై మరియు వన్యప్రాణులను వేటాడే వ్యక్తుల పై పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడము జరుగుతుందన్నారు.

ప్రతిపాదనలు రెడీ

● తుది దశకు ఓటాన్ బడ్జెట్ కసరత్తు ● 3 లేదా 6 నెలలకు తగ్గట్టు ప్రతిపాదనలు ● అయినా వార్షిక బడ్జెట్‌లా అంచనాలు ● ఇక సీఎం సమీక్షే తరువాయి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరిమిత కాలానికి నిధుల వ్యయం కోసం రూపొందిస్తున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు అన్ని శాఖలనుంచి ప్రతిపాదనలు అందాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మూడు నుంచి ఆరు నెలల కాలానికి ప్రతిపాదించేందుకు అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఎన్ని మాసాలకు అనేది పరిగణలోకి తీసుకోకుండా 12 నెలల వార్షిక బడ్జెట్ అంచనాలనే ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించ నున్నారు. ప్రభుత్వ రాబడి ఏటా కాస్త ఇటూఅటుగా రూ. 90 వేల కోట్ల లోపే వస్తున్నది. వార్షిక రాబడి పెరుగుదల ఏటికేడు రూ. 8వేల కోట్లే ఉంటోంది. ఇంకోవైపు అప్పులు రూ. 1.3 లక్షల కోట్లకు చేరాయి. వడ్డీలు, అసలు చెల్లింపులకు రూ. 19వేల కోట్లు వెచ్చించడం తప్పనిపరి. ఇప్పుడు ఇవన్నీ పరిగణలోకి తీసుకుని బడ్జెట్ పద్దులను సిద్ధం చేస్తున్నారు. ప్రధానమైన వ్యవసాయం, సాగునీటి రంగాలకు సింహ భాగం కేటాయింపులు చేసి బడ్జెట్‌ను రూ. 2లక్షల కోట్లకు చేర్చనున్నారు. సాగునీటి పారుదల శాఖకు రూ. 26 వేల కోట్ల ప్రతిపాదనలు అందాయి. ఈ మొత్తాన్ని ప్రతిపాదించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపు తోంది. రైతుబంధుకు రూ. 12 వేల కోట్లు కేటాయించను న్నారు. ఇక లక్షలోపు పంట రుణమాఫీకి రూ. 24వేల వేల కోట్లు అవసరం కానుండగా ఈ మొత్తాన్ని 4విడతల్లో కేటా యింపులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో రుణ మాఫీకి రూ. 6 వేల కోట్లు ప్రతిపాదించారు. విద్యుత్ రంగానికి రూ. 5వేల కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ.9వేల కోట్లు, అన్ని రకాల విద్యకు రూ. 15వేల కోట్లు, సంక్షేమ పించన్లకు రూ. 10 వేల కోట్లు, ఇతర సంక్షేమ రంగాలకు భారీ మొత్తంలో నిధులు కోరుతూ ప్రతిపాదనలు అందాయి.

పథకాలకు అదనంగా రూ. 50వేల కోట్లు...

తాజాగా టీఆర్ఎస్ ప్రభుత్వ హామీలు తక్షణం అమలు చేయాలంటే ఏటా రూ. 50 వేల కోట్లు అదనంగా అవసరమని భావిస్తున్నారు. ఆసరా పించన్లు ఏడాదికి రూ. 5600కోట్లను ఖర్చు చేస్తుండగా, వయసు తగ్గింపుతోపాటు, రెండింతలకు పెంచడంతో ఈ పద్దుకు రూ. 10వేల కోట్లకు పైగా ప్రతిపాదిం చాల్సి వస్తోంది. నిరుద్యోగ భృతికి రూ. 3600కోట్లకుపైగా అవసరం కానుండగా ఈ బడ్జెట్‌లో దీని ప్రస్తావన ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఆదాయ, వ్యయాల మధ్య అంతరం...

2017-18 ఆర్థిక యేడాదిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం అంచనా రూ. 1,13,083కోట్లుకాగా వాస్తవంగా రూ. 88,711 కోట్లు మాత్రమే సమకూరింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే పీఆర్సీ ప్రకటించాల్సి వస్తే చివరి నిమిషంలో జీతాల పద్దును పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సమాచారం, పీఆర్సీ ద్వారా వేతన సవరణ చేస్తే జీతాలు, పింఛన్ల ఖర్చు ఏటా రూ. 24వేల కోట్లకు పెరగనుంది. ఈ పద్దుకు ఖచ్చితంగా నిధు లను కేటాయించాల్సి రానుంది. ఉచిత విద్యుత్‌కు రూ. 10వేలకోట్లు, ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల హెల్త్‌స్కీంలకు రూ. 4500కోట్లు సబ్సిడీ బియ్యానికి రూ. 3వేల కోట్లు ప్రతిపాదించనున్నారు.

తాజాగా లోటు..

బడ్జెట్‌లో ఉన్న నిధులు, రాష్ట్రఆదాయంలో సింహభా గం ఈ మూడు నాలుగు పథకాలకు ఖర్చుకానున్నాయి. నిరుద్యోగ భృతికి దాదాపు రూ. 3600కోట్లు, పించన్లకు రూ. 10వేలకోట్లు రైతు రుణమాఫీ, పించన్లు, నిరుద్యోగ భృతివంటి వాటికే దాదాపు రూ. 50వేల కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇరిగేషన్ ప్రాజెక్టులకు వ్యయాలు, జీతాలు, కళ్యాణలక్ష్మి, కేసీ ఆర్ కిట్లు, రైతుబంధు, రైతు బీమా, ఇతర బడ్జెటేతర ఖర్చులకు ఏటా రూ. 1.50లక్షల కోట్లు అవసరం కానున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు రూ. 33 వేల కోట్లకుపైగా ఖర్చ వుతోంది. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకాలకు ప్రభు త్వం దాదాపు రూ. 80వేల కోట్లకు పైగా రుణాలు తీసుకుంది.

Andhraprabha business 2018

బిజినెస్

ఎస్ బ్యాంక్‌కు కొత్త డైరెక్టర్లు

మహేశ్వర్ సాహు, అనిల్ జాగ్గియా



ముంబై: ప్రైవేట్ బ్యాంకు ఎస్ బ్యాంకు బోర్డులో అదనంగా మహేశ్వరసాహు, అనిల్ జాగ్గియాను అదనపు (ఇండిపెండెంట్) డైరెక్టర్లుగా నియమిస్తూ.. బోర్డు సిఫారసు చేసింది. వీరి నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. వీరి పదవీ కాలం ఐదుసంవత్సరాల పాటు కొనసాగుతుంది. అయితే వార్షిక సాధారణ సమావేశంలో వాటాదారులు వీరి నియమాకాన్ని ఆమోదించాల్సి వస్తుందని బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఎస్ బ్యాంకు బోర్డు ఇలా ఉంది. బ్రహ్మదత్ పార్ట్‌టైం చైర్మన్, లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ ముఖేష్ సబర్వాల్(రిటైర్డ్) ఇండిపెండెంట్ డైరెక్టర్, సుభాష్ చంద్ర కలియా, నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్, అజయ్‌కుమార్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్, ఉత్తమ్‌ప్రకాశ్ అగర్వాల్, అదనపు (ఇండిపెండెంట్ డైరెక్టర్), టీఎస్ విజయన్, అదనపు ఇండిపెండెంట్ డైరెక్టర్, అనిల్ జాగ్గియా అదనపు ఇండిపెండెంట్ డైరెక్టర్, రాణాకపూర్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అని బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది. మహేశ్వర్‌సాహు 1980 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో 30 సంవత్సరాల పాటు పనిచేసిన అనుభవం ఉంది. అనిల్ జాగ్గియాకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ, సెంచూరియన్ బ్యాంకు ఆఫ్ పంజాబ్, సిటి బ్యాంకుల్లో పనిచేసిన అనుభవం ఉంది.

మారుతి లాభాలకు భారీ గండి

- నికరలాభం రూ.1,489 కోట్లు
- క్యూ3లో 17 శాతం క్షీణత



న్యూఢిల్లీ: దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఇండియా (ఎంఎస్ఐ)డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక నికర లాభంలో 17.21 శాతం క్షీణించి రూ.1,489.3 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.1,799 కోట్లు ఆర్జించింది. ఐదేళ్లలో ఈ స్థాయిలో నష్టాలను చవిచూడ్డం ఇదే మొదటిసారి. పండుగ సీజన్‌లో అంచనా కంటే తక్కువ స్థాయిలో అమ్మకాలు జరగడం, కమాడిటీ ధరలు ధరలు పెరగడంతో పాటు కరెన్సీ ఒడిదుడుకులు, మార్కెటింగ్‌కు, అమ్మకాలకోసం ఎక్కువ మొత్తంలో వ్యయం చేయాల్సి వచ్చిందని, దీంతో పాటు వడ్డీల భారం కారణమని లాభాలు తగ్గడానికి ప్రధాన కారణాలని వివరణ ఇచ్చింది. మొత్తం ఆదాయం విషయానికి వస్తే రూ.20,585.86 కోట్లకు ఎగబాకగా... క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19,528.1కోట్లని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. క్రితం ఏడాది డిసెంబర్ త్రైమాసికంతో పోల్చుకుంటే ఈ ఆర్థికసంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో అమ్మకాలు స్వల్పంగా 0.6 శాతం తగ్గాయని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. బీఎస్ఈలో దీని షేరు 6.85 శాతం క్షీణించి రూ.6,555.40 వద్ద ముగిసింది.

ఒకినావా నుంచి ఎలక్ట్రిక్ స్కూటర్

ది ఇంటెలిజెంట్ స్కూటర్ పేరుతో విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఒకినావా స్కూటర్స్ నూతన శ్రేణి ఈ-స్కూటర్‌ను శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఒకినావా హై-ప్రైజ్ ఉన్నత శ్రేణి టెక్నాలజీతో రూపొందించిన 'ది ఇంటెలిజెంట్ స్కూటర్'ని దేశీయ మార్కెట్‌లో ఆవిష్కరించింది. అధునాతన టెక్నాలజీ కలిగిన ఈ స్కూటర్ ఎక్స్-షోరూమ్ ధరను రూ.లక్షా 15వేలుగా నిర్ణయించినట్లు ఒకినావా స్కూటర్స్ ప్రతినిధి జితేందర్ శర్మ చెప్పారు. ఈ స్కూటర్‌కు లిథియం, అయాన్ బ్యాటరీతో రూపొందించామని, ఈ బ్యాటరీకి 5ఏ పవర్ సాకెట్ అవసరమవుతుందన్నారు. ఇది అన్ని ప్రాంతాల్లో కూడా రీచార్జ్ చేసుకునే వీలు కల్పిస్తుందని ఆయన చెప్పారు. పూర్తిస్థాయిలో ఛార్జింగ్ చేసేందుకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని తెలిపారు. ఈ స్కూటర్ రెడ్ బ్లాక్, గోల్డెన్ బ్లాక్, సిల్వర్ బ్లాక్ రంగుల్లో లభిస్తుందని జితేందర్ శర్మ తెలిపారు.

లోటస్ నుంచి మేకప్ రిమూవర్

హైదరాబాద్ : లోటస్ మేకప్ మై సెల్లర్ క్లీనింగ్ వాటర్ పేరుతో క్లీనింగ్, టోనింగ్ మేకప్ రిమూవర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఈ రిమూవర్‌లో ఎలాంటి రసాయనాలు వాడలేదని, కాంటాక్ట్ లెన్స్ వాడే వారికి కూడా ఇది సురక్షితమని లోటస్ ఒక ప్రకటనలో తెలిపింది. 100 ఎంఎల్ రూ.275కు దేశంలోని అన్నీ లోటస్ ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ స్టోర్‌లలో లభిస్తుందని పేర్కొంది.

అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో... భారత్ నెంబర్ 5

- రోజువారి సంస్కరణలతో సాధ్యం
- పెట్టుబడులకు భారత్‌లో అపారావకాశాలు
- భారత్ – దక్షిణాఫ్రికా వాణిజ్య సదస్సులో ప్రధాని మోడీ



భారత ఆర్థిక వ్యవస్థ 2.6 ట్రిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఐదవ స్థానానికి ఎగబాకడానికి ఎంతో సమయం పట్టదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిశ్చితాభిప్రాయంతో ఉన్నారు. తమ ప్రభుత్వం రోజువారి సంస్కరణలు తీసుకురావడంతో ఇది సాధ్యమైంది.. పెట్టుబడులు భారత్ ప్రస్తుతం స్వర్గధామమని అభివర్ణించారు.

భారత్ - దక్షిణాఫ్రికా వాణిజ్య సదస్సులో ప్రధాని మోడీ శుక్రవారం మాట్లాడుతూ.. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని.. కొత్తభారత్‌ను సృష్టించడానికి.. వచ్చేతరానికి తగ్గట్టు మౌలికవసతులు సృష్టించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని అన్నారు. భారతఆర్థికవ్యవస్థప్రస్తుతం 2.6 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఆరవ స్థానంలో ఉందని, నెంబర్ వన్ నుంచి ఐదవ స్థానాల వరుసగా అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, బ్రిటన్‌లు ఆక్రమించాయి. ఈ ఏడాదిలోనే బ్రిటన్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని భారత్ ఆక్రమించే అవకాశాలున్నాయి. దేశీయ తయారీరంగాన్ని మేకిన్ ఇండియా ద్వారా బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలను తీసుకున్నారు. అలానే దేశ ఆర్థిక వ్యవస్థను డిజిటలైజేషన్ చేసేందుకు డిజిటల్ ఇండి యాకు ఎలాంటి చర్యలు తీసుకున్నామో ఆయన వివరించారు. విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను ఆకర్షించడంలో తాము అగ్రస్థానంలో ఉన్నట్లు యుఎన్‌సీటీఏడీనే తేల్చి చెప్పిందని, అయినా తమకు సంతృప్తి కలగలేదన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కీలకమైన రంగాల్లో రోజు వారి కావా ల్సిన మార్పులు చేర్పులు చేస్తుంటామని మోడీ వివరించారు.

> ప్రపంచబ్యాంకు తాజా ఎడిషన్‌లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లేదా సరళతర వాణిజ్యంలో భారత్ గత నాలుగు సం వత్సరాల్లో ఏకంగా 65 స్థానాలు ముందుకెగసి 77వ స్థానానికి ఎగబాకిందని చెప్పారు. వచ్చే తరానికి అవసరానికి తగ్గట్టు న్యూఇండియా కోసం మౌలికరంగాన్ని బలోపేతం చేస్తామని ముఖ్యంగా స్పీడ్, స్కిల్, స్కేల్ అని ఆయన వ్యాఖ్యానించారు.
>
> **సరళతర వాణిజ్యంలో 77వ స్థానానికి**

ఇరు దేశాల వాణిజ్యం గురించి

ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్య గురించి మోడీ ప్రస్తావిస్తూ.. భారత్ - దక్షిణాఫ్రికాల మధ్య వాణిజ్యం 2017-18 ఆర్థిక సంవత్సరంలో 10 బిలియన్ డాలర్ల మార్కును దాటిపోయిందన్నారు. ఈ విలువను మరింత పెంచుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని... దీనికి భారత్ ప్రభుత్వం తో పాటు దక్షిణాఫ్రికా ప్రభుత్వ ఏజెన్సీలు, పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులు, ఇరుదేశాలకు చెందిన బిజినెస్ లీడర్లు కలిసి సంయుక్తంగా పర్యవేక్షించాలని ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం పెంచుకోవడంపై దృష్టిపెట్టాలని ప్రధాని సూచించారు. దక్షిణాఫ్రికాలో భారత్ పెట్టుబడులు క్రమంగా పెంచుకుంటూ పోతోంది. ఇప్పటి వరకు సుమారు పది బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టామని, స్థానికంగా 20వేల మంది ఉపాధి కల్పించామని ప్రధాని అన్నారు. దక్షిణాఫ్రికాను సోదర దేశంగా నిస్సందేహంగా.. భారత్ తన అనుభవాలద్వారా దక్షిణాఫ్రికాలో విధానాలు, సంస్కరణలు తదితర అంశాల్లో సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని, దక్షిణాఫ్రికాలో మరిన్ని భారతీయ కంపెనీలు తమ వ్యాపారాలు ప్రారంభించాలని కోరుకుంటున్నారు. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన కంపెనీలు పెద్ద మొత్తంలో భారత్ మార్కెట్లో వ్యాపారాలు ప్రారంభించుకోవాలని కోరారు.

న్యూ ఇండియాలో వ్యాపారావకాశాల గురించి...

దక్షిణాఫ్రికా వ్యాపారవేత్తలకు న్యూ ఇండియాలో వ్యాపారావకాశాల గురించి ప్రస్తావిస్తూ.. ఫుడ్, ఆగ్రో ప్రాసెసింగ్, డీప్ మైనింగ్, రక్షణ, బీమా, మౌలికరంగాల్లో వ్యాపారావకాశాలు మెండుగా ఉన్నాయని ప్రధాని తెలిపారు. అలాగే భారత్ దక్షిణాఫ్రికాతో స్టార్టప్‌లలో భాగస్వామ్యం చేపట్టడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ముఖ్యంగా హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్, ఐటి, ఐటి ఆధారిత రంగాల్లో మెండుగా ఉన్నాయని ప్రధాని వివరించారు. జెమ్స్‌అండ్ జ్యువెలరీ రంగాల్లో ఇరు దేశాల్లో బోలెడన్ని అవకాశాలున్నాయని ప్రధాని అన్నారు. ఇరు దేశాల్లో పర్యాటక రంగాల్లో అవకాశాలు వెతుక్కోవచ్చునని, దీంతో ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థ బలపడు తుం దని, కొనుగోలుదార్లకు, అమ్మకం దార్లకు అనువ రవ్యయం తగ్గించవచ్చని ప్రధాని అన్నారు. అలాగే వ్యాపారులకు, పర్యాటకులకు వీసా నిబంధనలను సడలిస్తామని, దీంతో ఇరు దేశాల ప్రజల మధ్య ప్రత్యక్ష సంబం ధాలు మరింత మెరుగుపడతాయని ప్రధాని వివరిం చారు. సీఐఐ ఏర్పాటు చేసిన ఈ సదస్సులో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామాపోసా మాట్లాడుతూ.. ఇరు దేశాల్లో వ్యాపారావకాశాలు మెండుగా ఉన్నాయని, ఒకరికొకరు సహకరించుకుంటూ వ్యవసాయం, ఐసీటీ, ఎయిరోస్పేస్, ఎనర్జీ రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వేదాంత గ్రూపు దక్షిణాఫ్రికా గనుల రం గం లో 160కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టి రికార్డు సృష్టించి దని దక్షిణాఫ్రికా ప్రధాని అన్నారు. తమ దేశంలో వ్యవసాయం, ఆగ్రో ప్రాసెసింగ్, ఆటో, ఫార్మా, ఎయిరోస్పేస్, రక్షణరంగానికి చెందిన పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎనర్జీ, ఐసీటీ, మైనింగ్, వ్యాపారావకాశాలు ఉన్నాయని, భారతీయకు చెందిన వ్యాపారులు ఈ రంగాలపై ఫోకస్ పెట్టాలని కోరారు.

బీడీఎల్ విశాఖ యూనిట్‌లో అక్వాస్టిక్ ట్యాంక్ పరీక్షలు



హైదరాబాద్ : భారత్ డైనమిక్స్‌కు చెందిన విశాఖ యూనిట్‌లో డాక్టర్ అజయ్ కుమార్ సెక్రెటరీ (డిఫెన్స్ ప్రొడక్షన్) అక్వాస్టిక్ ట్యాంక్ పరీక్షలు జరిపారు. అత్యుత్తమ ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన ఈ పరీక్షలు సముద్ర గర్భంలో ఆయుధాలు ఎలాపనిచేస్తాయో పరీక్షిస్తారు. ఉదాహరణకు టార్పిడోయోస్, మైన్స్, సోనోబియోస్, డీకాయ్స్‌తో పాటు ఇతర వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో పరీక్షిస్తారు. ఇక అక్వాస్టిక్ సిస్టమ్ ద్వారా ఆయుధాలు సముద్రగర్భంలోకి తేవడానికి ముందు అక్కడ పర్యావరణం ఎలా ఉందో పరీక్షించడానికి వినియోగిస్తారు. బీడీఎల్ విశాఖ ఆస్పెట్‌లో ఒకేసారి పలురకాలు ఉత్పత్తులను ప్రారంభించడానికి కూడా బీడీఎల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని.. ఈ సందర్భంగా బీడీఎల్ సీఎండీ ఉదయ్ భాస్కర్, విశాఖ యూనిట్‌లో పొల్గొన్న పలు నౌకాదళాలను ఆయన అభినందించారు. కాగా విశాఖ బీడీఎల్ యూనిట్‌లో ప్రత్యేకం సముద్రగర్భంలో వాడే ఆయుధాలను తయారు చేసే నావికా దళానికి అందజేయడాని కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన టార్పిడోస్, ఆకాష్ వెపన్ సిస్టమ్, యాంటీట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లు మిత్రదేశాలకు విక్రయిస్తుందని బీడీఎల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమానికి బీడీఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు నందగోపాల్, ఎస్ పిరామనాయగమ్, ఎన్‌పీ దివాకర్, టీఎన్ కౌల్, ఉతోష్‌కుమార్, ఎస్ నారాయణన్, ఎన్‌వీకామేశ్వరరావు, ఇతర సీనియర్ అధికారులు పొల్గొన్నారు.

ఈ ఏడాది భారీగా ఉద్యోగ అవకాశాలు

- జనవరి-జూన్‌లోనే 20 శాతం పెరుగుదల
- ఐటీ, బీపీవో, మార్కెటింగ్ రంగాల్లో డిమాండ్
- నౌక్రీ డాట్ కామ్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2019-20లో వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు బాగా పెరగనున్నాయి. 2019 క్యాలెండర్ ఇయర్‌లో మొదటి ఆరు నెలలు గతంతో పోల్చితే గణనీయమైన ప్రగతితో నియామకాలు జరగనున్నాయి. ఆర్థిక వ్యవస్థలో కొనసాగనున్న అభివృద్ధి ప్రాజెక్టులు, ఉత్పత్తి, మౌలిక సదుపాయాల రంగానికి ప్రాధాన్యత పెరగడంతో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే మార్కెటింగ్, ఐటి, బీపీవో సర్వీస్ రంగాల్లో కూడా ఉపాధి పెరగనున్నట్లు నౌక్రీ డాట్ కాం ఉద్యోగ పోర్టల్ తన అధ్యయనంలో వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు గత ఏడాదికన్నా 20 శాతం రిక్రూట్‌మెంట్లు అధికంగా ఉంటాయని 84 శాతం రిక్రూటర్లు అంచనా వేస్తున్నారు. అయితే అనుభవం, ప్రతిభ ఉన్న వాళ్లకి అవకాశాలు వేగంగా వస్తాయని, ఇలాంటి వారిని రిక్రూటర్లు మరీ వెతికి ఉద్యోగాలు ఇస్తారని రిక్రూటర్లు పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా మూడు నుంచి ఐదేళ్ల అనుభవం ఉన్న వాళ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని హైరింగ్ ఔట్‌లుక్ వెల్లడించింది.



ఉపాధి కల్పనాపరంగా చూస్తే ఆశాజనకంగా ఉన్నప్పటికీ సరైన ప్రతిభ ఉన్న వారికి లభించకపోవడంతో నియామకాలు ఆలస్యం అవుతున్నాయని, ఉద్యోగార్థులకు ఉద్యోగ అవకాశాలు లేవని కొందరు రిక్రూటర్లు అభిప్రాయ పడ్డారు. రానున్న ఆరు నెల్లలో ప్రతిభావంతుల కొరత మరింత తీవ్రతరమవుతుందని భావిస్తున్నారు. ప్రతిభ కొరతతో గడిచిన ఆరు నెల్లలో నిరాశగా నియామకాలు జరిగాయని, ఈ ఏడాది అనుభవం, నైపుణ్యం ఉన్న వారికి గణనీయమైన డిమాండ్ ఉంటుందని ఆ అధ్యయనం పేర్కొంది. కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వారికే ఎక్కువ అవకాశాలు వస్తాయని ఇంటర్వ్యూలో వారే ఎక్కువగా విజయాలు సాధిస్తారని, కార్పొరేట్ పర్యావరణంలో కలిసిపోయి బాగా పనిచేస్తారో రిక్రూటర్లు అభిప్రాయ పడుతున్నారు.ఉద్యోగ నియామకాలతో పాటు ఇంక్రిమెంట్లలో కూడా మంచి ఫలితాలు ఉంటాయని భావిస్తున్నారు. సామర్థ్యం, అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని 20 శాతం మంది ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు వస్తాయని, అది 15 నుంచి 20 శాతం వరకు ఉంటుందని నౌక్రీ డాట్ కామ్ పేర్కొంది. ఉద్యోగులకు మెరుగైన జీతం, పదోన్నతి ఆశిస్తూ నూతన కంపెనీలకు పెద్దఎత్తున మారుతారని ఔట్‌లుక్ సర్వే పేర్కొంది. మెరుగైన ఉద్యోగం కోసం ఎక్కువ మంది మారుతుంటారని, ప్రతిభను గుర్తించిన కంపెనీలు అలాంటి వారికోసం ఆఫర్లను పంపుతుంటాయని రిక్రూటర్లు పేర్కొన్నారు. తమ సంస్థ మంచి ఫలితాలు సాధించేందుకు, బ్రాండ్ ఇమేజ్ పెరిగేందుకు ఇతర కంపెనీల నుంచి రాబట్టేందుకు కూడా పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తుంటారని అధ్యయనం పేర్కొంది.

స్లీప్‌వెల్ వ్యాపార విస్తరణ

- కొత్త ఉత్పత్తులతో వినియోగదారులకు చేరువ
- యేటా రూ.1500 కోట్ల వ్యాపార లావాదేవీలు
- షీలా గ్రూప్ స్లీప్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ హెడ్ భూషణ్ జి.పతక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో ప్రతియేటా రూ.1500 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న షీలా గ్రూప్ సంస్థ స్లీప్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్త ఉత్పత్తులను మార్కెట్లో ఆవిష్కరించింది. మ్యాట్రెసెస్, పిల్లోస్, బెడ్‌షీట్స్ తదితర ఉపకరణాలను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించడంతో పేరుగాంచిన తమ సంస్థ వ్యాపారాభివృద్ధి విస్తరణతో వినియోగదారులకు మరింతగా దగ్గరవుతోం దని షీలా గ్రూప్ స్లీప్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ హెడ్ భూషణ్ జి.పతక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇక్కడ ఏర్పా టు చేసిన మీడియా ప్రతినిధుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో స్లీప్‌వెల్ 40 శాతం మార్కెట్ షేర్ కలిగి ఉందన్నారు. సుఖనిద్రకు దోహదపడే పరుపులు, దిండులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. నిత్యజీవనానికి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు నిద్ర ఎంతో ముఖ్యమని అనేక వైద్య పరిశోధనల్లో ధృవీకరించబడిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని షీలా గ్రూప్ స్లీప్‌వెల్ బ్రాండ్‌ను ఆవిష్కరించిందని ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 4200 స్లీప్‌వెల్ ప్రత్యేక షోరూంలు ఉన్నాయని, త్వరలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈసమావేశంలో సంస్థ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ సంగమేశ్వర్ తదితరులు పొల్గొన్నారు.



వృద్ధిరేటు7 నుంచి 7.5 శాతం

- వచ్చే కొన్ని సంవత్సరాల పాటు ఇదే వరుస..
- ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి అంచనా


న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ రాబోయే కొన్ని సంవత్సరాల పాటు 7 నుంచి 7.5శాతం వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) శుక్రవారం నాడు వెల్లడించింది. సంస్కరణల ద్వారా నిర్మాణాత్మకమైన సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెడితే దృష్టి రేటు ఒక శాతం తేలికంగా సాధించవచ్చునని శుక్రవారం జరిగిన సమావేశంలో పేర్కొంది. ముఖ్యంగా నిర్మాణాత్మకమైన సంస్కరణలు ద్వారా వాటిని అధిగమించవచ్చునని వెల్లడించింది. ప్రస్తుతం ప్ర పంచ ఆర్థిక వ్యవస్థ మాత్రం పెద్ద ఆశా జనకంగా లేదని, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవ స్థలు మందగమనంలో కొట్టుమిట్టా డు తుంటే.. దీనికి ప్రతికూలంగా అభి వృద్ధి చెందుతున్న మార్కెట్లు వృద్ధిరేటులో దూసుకుపోతాయని ప్యానెల్ అభిప్రాయపడింది. పెట్టుబడుం గురించి ప్రభుత్వం జాతీయస్థాయిలో రాష్ట్రస్థాయిలో తీసుకొచ్చిన విధానాలు, వడ్డీరేట్లు, రైతులకు రుణాలు అందుబాటు గురించి కూడా ఈ సమా వేశంలో చర్చించారు. మదుపుదారుల ధరలు ఒడిదుడుకులకు గురైనా డాలర్ మారకంతో రూపాయి ప్రస్తుతం బలంగా ఉండటంతో ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఆర్థికరంగంలో సంస్కరణలను మరింత బలోపేతం చేయాలని, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ప్రకటనలో పేర్కొంది. ఎగుమతులకు పెద్ద ఆశాజనకంగా లేకపోయినా ఎగుమతులను ప్రోత్సహించేదిశగా విధానాలు తీసుకురావాలని దీంతో ఎగుమతులను పుంజుకునే అవకాశం ఉంటుందని అంచనా వేసింది. కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతం సాధించవచ్చునని పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థపై నాడులు బలంగా ఉన్నాయని, అయితే వాటితో పాటు కొన్ని సవాళ్లు కూడా ఎదుర్కొవాల్సి ఉంటుందని ఈసమావేశంలో వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులగురించి ప్రస్తుతం ఎగుమతులు పుంజుకునే విధంగా చర్యలు కూడా క్రమంగా పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు.



మారుతి పడేసింది!

- ఆరంభ లాభాలు .. చివర్లో ఆవిరి!
- 169 పాయింట్లు పతనం

ముంబై : స్టాక్ మార్కెట్లు శుక్రవారం నాడు నష్టాలతో ముగిశాయి. మారుతి క్యూ3 ఫలితాలు మార్కెట్లకు నిరాశకు గురి చేశాయి. సెన్సెక్స్ 169 పాయింట్లు క్షీణించి 36,025.54 వద్ద ముగిసింది. ట్రేడింగ్ విషయానికి వస్తే ఇంట్రాడేలో ఏకంగా 250 పాయింట్లకు పైగా దూసుకుపోయి 36,474.48 మార్కుకు ఎగబాకింది. మధ్యాహ్నం తర్వాత నుంచి ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో ఇంట్రాడేలో 35,953.15 మార్కుకు దిగివచ్చింది. చివరకు 169.56 పాయింట్లు నష్టంతో 36,025.54 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 69.25 పాయింట్లు నష్టపోయి 10,780.55 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 10,931.70 నుంచి 10,756.45 మధ్య తచ్చాడింది. మొత్తానికి ఈ వారం సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయింది.



మార్కెట్లు పడిపోవడానికి ప్రధాన కారణం మారుతి క్యూ3 ఫలితాలు నిరుత్సాహంగా ఉండటం... కంపెనీ షేర్లు... హెచ్చరికతో షేర్లు 7.40 శాతం పడిపోయింది. నష్టపోయిన ఇతర కంపెనీల షేర్లు ఇలా ఉన్నాయి. హీరోమోటో కార్ప్, బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్ బ్యాంకు, హెచ్‌యుఎల్, యస్ బ్యాంకు, ఎంఅండ్ఎం, టాటాస్టీల్, టాటామోటార్స్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ షేర్లు 4.23 శాతం వరకు నష్టపోయాయి. ఐటీ, ఫార్మా షేర్లు తప్పించి మిగిలిన రంగాలకు చెందిన షేర్లు నష్టాలతో ముగిశాయి. దీంతో పాటు లాభాలను ఆర్జించిన షేర్ల విషయానికి వస్తే ఎస్ బ్యాంకు, హెచ్‌సీఎల్ టెక్, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్‌లు 2.71 శాతం వరకు లాభపడి మార్కెట్ మరింత పడిపోకుండా కాపాడాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు ఐరోపా మార్కెట్లు రెండు లాభాలతో ముగిశాయి. కారణం మారుతి క్యూ3 ఫలితాలు నిరుత్సాహపరచడంతో సెంటిమెంట్ ప్రతికూలంగా ప్రభావం చూపిందని చెబుతున్నారు. క్యూ3లో నికరలాభం 17.21 శాతం క్షీణించడంతో దీని షేరు కూడా ఏకంగా 7.40 శాతం పడిపోయింది.

ఇండియా ఇంటర్నెట్ టైకూన్


- ముఖేష్ అంబానీ
- ఎకనమిస్ట్ తాజా ఎడిషన్‌లో వెల్లడి

ముంబై: బిలియనీర్ ముఖేష్ అంబానీ కొత్తగా టెలికం రంగంలో రిలయన్స్ జియో పేరుతో ఎంట్రీ ఇచ్చి పోటీ కంపెనీలకు చుక్కలు చూపించారు. జియో మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు సుమారు 28 కోట్ల మంది యూజర్లను సంపాదించింది. ప్రస్తుతం ఆయన భారత్‌లో ఇంటర్నెట్ టైకూన్ కావాలనుకుంటున్నారని ది ఎకనమిస్ట్ పేర్కొంది. భారత్ టెలికం రంగంలో జియో పేరుతో ప్రవేశించి ప్రస్తుతం టెలికం రంగం రూపు రేఖలు పూర్తిగా మార్చేశారు. జియోను విమర్శించకుండా ఆయన ఇండియన్ జెఫ్ బెజోస్, లేదా జాక్ మాగా కావాలనుకుంటున్నారని ది ఎకనమిస్ట్ తాజాగా జనవరి 26వ ఎడిషన్‌లో పేర్కొంది. గతేడాది నవంబర్ చివరినాటికి దేశంలో మొబైల్‌ఫోన్ కస్టమర్ల సంఖ్య ఏకంగా 1.17 బిలియన్లకు చేరిందని టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ పేర్కొంది. బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు 500 మిలియన్లకు చేరారు. వారిలో 97 శాతం మంది వైర్‌లెస్ కనెక్షన్స్ కలిగినవారున్నారు. జియో వేదికలో సుమారు 28 కోట్ల సబ్‌స్క్రైబర్లున్నారు. వీరంతా అతి తక్కువ చౌకరకం డేటాప్లాన్‌ను వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ముఖేష్ మదిలో టెలికం రంగం నుంచి పెద్దమొత్తంలో డబ్బు సంపాదించడంతో పాటు టెక్ టైకూన్ కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే రిటైల్, క్రికెట్ వ్యాపార డిస్ట్రిబ్యూషన్ హక్కును పొందింది. దీంతో పాటు డిస్నీ సినిమాలు కూడా 'జియో టీవీ ప్లాట్‌ఫాం' ద్వారా వీక్షించుకోవచ్చునని ఎకనమిస్ట్ నివేదికలో వెల్లడించింది. ఈ నెల 18 తేదిన గుజరాత్‌లో జరిగిన వైబ్రెంట్ గుజరాత్‌లో ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. వచ్చే దశాబ్ద కాలంలో పెట్టుబడులు రెట్టింపు చేయడంతో పాటు ఉద్యోగాలను కూడా రెట్టింపు చేస్తామని ప్రకటించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీని డేటా వలసరాజ్యానికి పోరాటానికి నాయకత్వం వహించాలని కోరారు. డేటా స్టోరేజీ భారత్‌లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న చిన్నరిటైలర్స్‌కోసం ఈ-కామర్స్ రంగంలో ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. మొదుగా గుజరాత్ నుంచి ప్రారంభించి అటు తర్వాత దేశవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ స్టాండ్ఎలోన్ నికరలాభం 65 శాతం పెరిగి రూ.831 కోట్లకు చేరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.504 కోట్లు ఆర్జించింది.



సర్కారు బడుల్లో ఎందుకీ దురవస్థ?

• విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోండి • రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా భ్యాసం చేస్తున్న విద్యార్థుల ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని తెలంగాణ సర్కారును హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందనే విశ్వాసాన్ని తల్లిదండ్రుల్లో కలిగించేలా చర్యలు చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది.. ప్రభుత్వ పాఠశాలలు పిల్లల్ని ఆకర్షిచడంలో ఎందుకు విఫలమవుతున్నాయని, మెరుగైన ఫలితాలు ఎందుకు రావడంలేదని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు నిలదీసింది. ప్రభుత్వపాఠశాలల పట్ల తల్లిదండ్రుల దృక్పథం మార్చేందుకు, తల్లిదండ్రుల్లో నమ్మకం కల్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇందుకోసం పాఠశాలల్లో మౌలిక సదుపాయాయాలు కల్పించాలి, ఉపాధ్యాయుల ఖాళీలను యుద్ధప్రాతి పదికన భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఎంత మంది ప్రజాప్రతి నిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారని హైకోర్టు ప్రశ్నిం చింది. శాసనసభ్యులు, సర్పంచులు, తదితర ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశా లలకు పంపినపుడే మంచి ఫలితాలు వస్తాయంది. కేరళ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారులు తమ పిల్లల్ని అంగన్ వాడీ కేంద్రాలకు పంపుతారని హైకోర్టు పేర్కొంది.


ఇలాంటి చర్యల వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠ శాలల పట్ల విశ్వాసం, పెంపొం దుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది.ఒక తాలూకాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను అనుసం ధానం చేస్తూ పైలట్ ప్రాజెక్టుగా రూపొందించి అధ్యయనం చేసి తమకు నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రభు త్వాన్ని ఆదేశించింది. మన ప్రధాన మంత్రి ఎవరని ప్రశ్నిస్తే చెప్పలేని దుస్థితిలో పిల్లలున్నారని హైకోర్టు అభిప్రాయపడింది.

అంగన్ వాడీ కేంద్రాల్లో నమోద వుతున్న పిల్లల సంఖ్య ఎంత, ప్రాథమిక పాఠశాలలు మరియు ఉన్నత పాఠశాలల కు వెళ్తున్న పిల్లల సంఖ్యఎంత, ఆయా పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం తదితర అంశాలపై అధ్యయనం చేసి ఓ నివేదికను సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలను వివరిస్తూ రూపొందించిన నివేదికను ధర్మాసనానికి సమ ర్పించారు.దాన్ని పరిశీలించిన ధర్మాసనం నివేదికను బాగా రూపొందించారు. కానీ ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది.

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేలా తగు చర్యలు తీసుకునేలా రెండు తెలుగు రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. .రాజ్యాంగంలోని45 వ ఆదేశ సూత్రాన్ని అనుసరించి ఉచిత నిర్బంధ 0-14 ఏళ్ల వయుస్సున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్ కు చెందిన ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే..

మహనీయుల ఆశయాల సాధనకు కృషి

• రాష్ట్ర ప్రజలకు గవర్నర్ గణతంత్ర శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు గవర్నర్ నరసిం హన్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజలంతా గణ తంత్ర దినోత్సవాన్ని పండు గలా జరుపుకుంటున్న శుభ తరుణంలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో అమరవీరులు, త్యాగమూర్తులను స్మరించు కుందామని ఆయన పిలుపునిచ్చారు. ఆ మహనీ యుల ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామని, నిరంతర కృషి, అనేక సంక్షేమ పథకాల అమలు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అభి వృద్ధి పథంలో పయనిస్తోందని గవర్నర్ ప్రశంసించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల వారికి సమంగా అందాలని, బాధ్యతగల పౌరులుగా అందరం సమష్టిగా శ్రమించాలని ఆయన ఆకాంక్షించారు. మన రాజ్యాంగ నిర్మా తలు ఆశించిన ఉజ్వల భారతాన్ని నిర్మించుకోవాలని, బంగారు తెలంగాణ సాధన లక్ష్యంతో అహర్నిశలు, అనుక్షణం కృషి చేద్దామని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ శుభ తరుణంలో అందరికీ ఆయన శుభాభివందనలు తెలిపారు.

సీఎం శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. నిజమైన సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా భారత ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ బలపడాలని సీఎం ఆకాంక్షించారు.

సీఎం సీపీఆర్‌వో నియామక ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రధాన ప్రజా సంబంధాల అధికారి (సీపీఆర్‌వో)ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యమంత్రి సీపీఆర్‌వోతో పాటు ప్రైవేట్ సెక్రెటరీ, నలుగురు అదనపు ప్రైవేట్ సెక్రెటరీలను డిప్యుటేషన్‌పై నియమించేందుకు పోస్టులు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. సీఎం కార్యాలయంలో సీపీఆర్‌వో పోస్టును డిసెంబర్ 13 నుంచి నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంఛార్జీ, ఆరుగురు ప్రోగ్రామర్స్, నాలెడ్జ్ సెంటర్ ఇంఛార్జి, ఫోటో డిజైనర్, ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జిరాక్స్ ఆపరేటర్, ఐదుగురు ఆఫీస్ సబ్‌ఆర్డినేట్లు, ఒక డ్రైవర్‌ను నియమించేందుకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. వీరందరినీ ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై తీసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

కొత్తగా 31 రెసిడెన్షియల్ స్కూల్స్?

• ఇప్పటికే ప్రతిపాదనలు.. త్వరలో అనుమతివ్వనున్న సర్కార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూల్ విధానానికి ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర సర్కార్ కొత్తగా 31 జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి అనుమతి ఇవ్వనుంది. రెండేళ్ల క్రితం కొత్తగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తూ సర్కార్ ఉత్తర్వులిచ్చింది. ఇప్పటికే ఆయా స్కూల్స్‌లో 5 నుంచి 8వ తరగతి వరకు అడ్మిషన్లను తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో అగ్రకులాల వారికి ఆయా రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వారికి ప్రత్యేకంగా ఉన్న జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను కూడా పెంచాలని రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ అధికారులు ప్రభుత్వానికి ఏడాదిన్నర క్రితం ప్రతిపాదనలు పంపించారు. కొత్తగా జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి అనుమతిస్తేనే అగ్రకులాలకు చెందిన పేదలకు నాణ్యమైన విద్య చదివే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ వారు పంపించిన ప్రతిపాదనలను పరిశీలించిన సర్కార్ కొత్త స్కూల్స్‌కి అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

5వ తరగతిలో మాత్రమే ప్రవేశాలు..

సాధారణ రెసిడెన్షియల్ స్కూల్‌లో 5వ తరగతిలో మాత్రమే ప్రవేశాలను తీసుకుంటారు. ప్రతి స్కూల్‌లో 480 సీట్లతో స్కూల్‌ను ప్రారంభిస్తారు. 5వ తరగతిలో ప్రారంభించిన అనంతరం వారే పైక్లాసుకు పోతూ ఉంటారు. కేవలం 5వ తరగతిలో మాత్రమే రాత పరీక్షద్వారా ప్రవేశాలను చేపడతారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాత ఫిబ్రవరి మొదటి వారంలో కొత్త రెసిడెన్షియల్ స్కూల్స్‌కి అనుమతిస్తూ ఉత్తర్వులు వెలువరించే అవ కాశం ఉన్నట్టు తెలిసింది. ఇప్పుడు ఉత్తర్వులు ఇస్తేనే జనరల్ రెసిడెన్షియల్ స్కూల్‌సొసైటీ అధికారులు ఎక్కడ స్కూల్‌ను ఏర్పాటు చేసుకోవాలి.. అక్కడ ఏర్పాటు చేసుకోవడానికి అవసరం అయిన భవనాలు, సౌకర్యాలు, ఇతర సమస్యలు లేకుండా చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఉత్తర్వులు వెలువడిన వెంటనే అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన కసరత్తును కూడా అధికారులు చేసుకోవల్సి ఉంటుంది.

31 కొత్త స్కూల్స్‌కి అనుమతి..

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 35 సాధారణ రెసి డెన్షియల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. అవి కాకుండా అద నంగా మరో 31 స్కూల్స్ త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కరీంనగర్, నల్గొండ, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒక్క జనరల్ రెసిడెన్షియల్ స్కూల్ కూడా లేదు. రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ అధికారులు కొత్తగా బాలురు, బాలికలకు కలిపి 31 రెసిడెన్షియల్ స్కూల్స్ కావాలని ప్రతిపాదనలు పంపిం చారు.

ప్రతి జిల్లాలోనూ ఒకటి బాలురు, ఒకటి బాలికల స్కూల్ ఉండేలాగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఉన్న జిల్లాలో బాలికల స్కూల్ ఉంటే అక్కడ బాలుర స్కూల్ కావాలని, ఇప్పటికే బాలుర స్కూల్ ఉంటే అక్కడ బాలికల స్కూల్ కావాలని ప్రతిపాదనలు పంపించారు. ఒక్క స్కూల్ కూడా లేని జిల్లాలో ఒక బాలురు, ఒక బాలికల స్కూల్ కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు..

ఇప్పటికే కొనసాగుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్తగా బిల్లు ఆమోదించిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయడంలో ఇబ్బందులున్నాయి. ఉదాహరణకు బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇప్పటికే ఉన్న సీట్లలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ సీట్లను భర్తీ చేయాలంటే బీసీలకు అమలు చేస్తున్న 75 శాతం సీట్లలో కేటాయించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన 25 శాతాన్ని తగ్గించడానికి అవకాశం లేదు.. రాజ్యాంగ పరంగా ఇబ్బందులొస్తాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ మైనారిటీ స్కూల్స్‌లో కూడా. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే 10 శాతం ఈడబ్ల్యూఎస్ సీట్లతోపాటు అదనంగా మరో 10 శాతం సీట్లను పెంచినప్పుడు మాత్రమే న్యాయం జరుగుతుంది. ఇప్పటికే ఉన్న సీట్లతో విద్యార్థులను కొనసాగించడానికి భవనాల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పుడు అదనంగా 20 శాతం సీట్లను పెంచితే ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్న వాటిలో అదనంగా విద్యార్థులను చేర్చుకోవాలి.. దాంతోపాటు కొత్తగా చేర్చుకోవాల్సి వస్తుంది. కాబట్టి ఇప్పటికే ప్రారంభించిన స్కూల్స్‌లో ఇబ్బందులు రాకుండా చూడటానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగా సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి అనుమతి ఇస్తే వాటిలో చేరే విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది అగ్రకులాలకు చెందిన వారు ఉంటారు.. వారిలో ఈడబ్ల్యూఎస్ వారు కూడా ఉంటారు కాబట్టి కొత్తగా మరో 31 జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి అనుమతి ఇవ్వాలని సర్కార్ నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

వార్తల్లో నిజం కనుమరుగు

• గీతం వర్సిటీ జాతీయ సదస్సులో వక్తలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పత్రికల్లో వచ్చే వార్తలతోపాటు టీవీ ఛానళ్లలో ప్రసారం అయ్యే వార్తల్లోనూ నిజం కనుమరుగవుతోందని గీతం డీమ్డ్ వర్సిటీ నిర్వహించిన జాతీయ సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీలో మారుతున్న మీడియా పరిణామాలు అనే అంశంపై హైదరాబాద్ క్యాంపస్‌లో జాతీయ సదస్సును నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన సదస్సు శుక్రవారం ముగిసింది. సదస్సును పీఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్, ప్రెస్‌క్లబ్- హైదరాబాద్ సంయుక్తంగా సదస్సును నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వ విద్యాలయం జర్నలిజం విభాగం ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వార్త కోసం ఒక ప్రతికనో లేకపోతే ఒక టీవీ ఛానల్‌నో చూస్తే వార్త నిజమని నమ్మే పరిస్థితి లేదన్నారు. మరో రెండు, మూడింటిని చూసిన తరువాత గానీ నిర్ధారించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వాతావరణ నివేదిక, క్రీడావార్తలు మినహా తొలి పేజీలో సత్యదూరమైన వార్తలే చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పత్రికల కంటే పురణాలు చదువుకోవడం మేలన్న మహాత్మాగాంధీ మాటలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆరు నుంచి 10 మీడియా సంస్థలే మీడియా రంగాన్ని శాసిస్తున్నాయని, వారి కనుసన్నలలోనే వార్తలు ప్రసారం అవుతున్నాయన్నారు. పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ పి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్‌లో 41వ పీఆర్ఎస్ఐ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు.

అటవీ సంపద రక్షణకు ప్రాధాన్యం

• ఉద్యోగ సంఘాలతో పి.కె.ఝా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అటవీ సంపద రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అటవీశాఖ సంరక్షణ రాష్ట్ర ప్రధాన అధికారి పి.కె.ఝా దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో జరుగుతున్న దాడులలో అనేక అటవీ నేరాలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. కొన్నిచోట్ల నేరాల్లో సిబ్బంది ప్రమేయం ఉండటం బాధాకరమన్నారు. అటవీ నేరాల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణ యించినందున ఉద్యోగులు సహా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం అటవీశాఖలోని ఎఫ్ఆర్వోలు, జూనియర్ ఎఫ్ఆర్వోలు, అటవీ శాఖ ఉద్యోగ సంఘాల నేతలతో పి. కె. ఝా సమావేశమయ్యారు. అటవీ సంపద రక్షణ, పర్యావరణం కాపాడటం వంటి ప్రభుత్వ సంకల్పానికి అటవీశాఖ సిబ్బంది పనితీరే కొలమానం అవుతుందని పి. కె.ఝా అన్నారు. ఉద్యోగ సంఘాలు తమ పరిధిలో ఉన్న ఉద్యోగులు, సిబ్బందిని అటవీ రక్షణ దిశగా మరింత జాగృతం చేయవల్సిన అవసరం ఉందన్నారు. మొదట అడవులు, వన్యప్రాణుల రక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, అనంతరం క్షీణించిన అడవుల పునరుద్ధరణకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. అక్రమ కలప నరికివేత, క్షేత్రస్థాయి లో జంతువుల వేట, అటవీ భూముల ఆక్రమణలపై అత్యంత కఠినంగా వ్యవహరిం చాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురా వాల న్నారు. అన్ని అటవీ ప్రాంతాల్లో విజిలెన్స్‌ను మరింత పటిష్టం చేయాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పిసిసిఎఫ్‌లు వృధ్వీరాజ్, రఘువీర్, అదనపు పిసిసిఎఫ్‌లు మునీంద్ర, శోభ, లోకేష్ జైస్వాల్, ఆర్. ఎం. డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్ అన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో మార్చిలో జరగనున్న ఎస్ఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం శుక్రవారం పాఠశాల విద్య సంచాలకుడికి వినతిపత్రం సమర్పించారు. గత ఏడాదిలో జరిగిన పరీక్షల సందర్భంగా జిల్లాకు కొన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న గుర్తు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల కంటే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని పరీక్షా కేంద్రాల్లో ఉత్తీర్ణతా శాతం ఎక్కువగా ఉందని, ఫలితాలు బాగా వచ్చాయని గుర్తు చేశారు. దీనిని బట్టి చూస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని తెలుస్తుం దన్నా రు.

ర్యాంక్ ఆఫ్ జేఈఈ కోర్సు ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జేఈఈ అభ్యర్థులు తమ మెయిన్ స్కోర్‌ను పెంచుకోవడం కోసం గ్రేడ్ అప్ సంస్థ ప్రత్యేకంగా ర్యాంక్ అప్ జేఈఈ కోర్సును ప్రారంభించింది. రెండవ ప్రయత్నంలో తమకు మంచి ర్యాంక్ రావాలని కోరుకునే వారి కోసం తాము ప్రత్యేకంగా ఈ కోర్సును ప్రారంభించినట్టు సంస్థ కో ఫౌండర్ షోబిట్ భట్నాగర్ తెలిపారు. ఇది 70 రోజుల స్కోర్ బూస్టర్ కోర్సు అని తెలిపారు. జేఈఈ మెయిన్ ఏప్రిల్ పరీక్ష కోసం సిద్ధం అవుతున్న విద్యార్థుల పనితీరును మెరుగుపర్చడానికి ఇది సమగ్రమైన కోర్సు అని అన్నారు.

అన్ని పంటలకు విలువ ఆధారిత పరిశ్రమలు


• వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి
• హర్యానాలో అధికారుల బృందం అధ్యయనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణాలో పండించే అన్ని పంటలకు విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు అవసరమని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి అన్నారు. రైతులు తమ పంటలను ఇళ్ళవద్ద అమ్ముకుంటే ఆశించిన లాభాలు సాధ్యం కాదన్నారు. వరి, కందులు, సోయా చిక్కుడు, వేరుశనగ, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలను ప్రాసెసింగ్ చేస్తే రైతులకు మద్దతు ధరలు రావడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సరుకులను అందించవచ్చునని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆహార శుద్ధి పరిశ్రమలపై అధ్యయనం చేసేందుకు పార్థసారథి నేతృత్వంలో అధికారుల బృందం హర్యానాలో పర్యటిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం భారత ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధీనంలోని జాతీయ ఆహార సాంకేతిక వ్యవస్థాపకత నిర్వహణ సంస్థను సందర్శించింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ఆహార శుద్ధి పరిశ్రమలు రాష్ట్ర సంపదను మెరుగుపరుస్తాయన్నారు. అదే సమయంలో రైతులకు ఆదాయం రెట్టింపు అవుతుందని, ఎదుమతులతో ప్రభుత్వానికి సైతం ఆదాయ వనరులు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రపంచ సంస్థలకు ధీటుగా తెలంగాణాలో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఆహార ఉత్పత్తుల టెక్నాలజీ, నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ విద్యార్థులకు బీటెక్, ఎంటెక్ కోర్సులతో పాటు బిజినెస్ ఇన్‌క్యుబేషన్‌లో శిక్షణ ఇస్తోందని తెలిపారు. ఉద్యాన పంటలైన పసుపు, మిర్చి, మామిడి, బత్తాయి, సీతాఫలం వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడానికి అవసరమైన సాంకేతిక సహకారం సంస్థ అంగీకారం తెలిపిందన్నారు. ఈ బృందంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఆహార శుద్ధిశాఖ డైరెక్టర్ అఖిల్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అగ్రి యూనివర్సిటీ డైరెక్టర్ జగదీశ్వర్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం వంట ఖర్చులు పెంపు

• ఆదేశాలిచ్చిన కేంద్రం • త్వరలో ఉత్తర్వులివ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం • 5.35 శాతం పెంపు • ఏప్రిల్ నుంచి అమలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వంట ఖర్చులను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా మేరకు పెంచి పెరిగిన ధరలను అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయనుంది. మధ్యాహ్న భోజనం వంట ఖర్చులను పెంచుతూ కేంద్రం డిసెంబర్‌లో నిర్ణయం తీసు కుంది. పెంచిన ధరలను ఏప్రిల్ 2018 నుంచి అమలు చేయనున్నట్టు పేర్కొంది. డిసెంబర్‌లో కేంద్రం పెంచిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాను పెంచుతూ నిర్ణయం తీసుకోవల్సి ఉం టుంది. అయితే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 30 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇప్పటి వరకు జారీ చేయలేదు. ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన మధ్యాహ్న భోజనం వంట ఖర్చుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉంది.

స్కూల్స్, విద్యార్థుల వివరాలు..

ఏ రకం	మొత్తం స్కూల్స్	విద్యార్థులు
ప్రైమరీ(1నుంచి 5)	20,105	11,95,440
అప్పర్‌ప్రైమరీ(6నుంచి 8)	3402	7,18,420
హైస్కూల్(9, 10 తరగతులు)	5114	4,73,883
మొత్తం	**28,621**	**23,87,751**

5.35 శాతం పెంపు...

కేంద్ర ప్రభుత్వం మధ్యా హ్న భోజనం వంట ఖర్చును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా మేరకు వంట ఖర్చును ప్రస్తుతం ఉన్న వాటి కంటే 5.35 శాతం పెంచడం జరిగింది. ప్రస్తుతం ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రూ. 4,13 ఇస్తుండగా దానిని కాస్త రూ. 4.35 పెంచారు. అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఇప్పటి వరకు రూ. 6,18 ఇస్తుండగా దానిని కాస్త రూ. 6.51కి పెంపు చేశారు. పెంచిన నిధులను ఏప్రిల్ 2018 నుంచి అమలు చేయాలని కేంద్రం సూచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం వంట ఖర్చు పెంపుపై జారీ చేసే ఉత్తర్వుల అనంతరం ఏప్రిల్ నుంచే పెంచిన బకాయిలను ఇవ్వనున్నారు.

23,87,751 మందికి మధ్యాహ్న భోజనం..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 23,87,751 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీరిలో 1వ తరగతి నుంచి 8 వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుండగా 9, 10వ తరగతి పిల్లలకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి ఖర్చును భరిస్తుంది. రాష్ట్రంలో ప్రైమరీ స్కూల్(1 నుంచి 5) విద్యార్థులు 11,95,440 మంది అప్పర్ ప్రైమరీ స్కూల్(6 నుంచి 8) విద్యార్థులు 7,18,420 మంది ఉన్నారు. 9, 10వ తరగతి విద్యార్థులు 4,73,883 మంది ఉన్నారు. మొత్తంగా మధ్యాహ్న భోజనం పథకంలో 23,87,751 మంది లబ్ధిపొందుతున్నారు.

స్కూల్	ప్రస్తుతం			5.35 శాతం పెంపు తరువాత		
	కేంద్రంవాటా	రాష్ట్రం వాటా	మొత్తం	కేంద్రం వాటా	రాష్ట్రం వాటా	మొత్తం
ప్రైమరీ	2.48	1.65	4.13	2.61	1.74	4.35
అప్పర్ ప్రైమరీ	3.71	2.47	6.18	3.91	2.60	6.51


ఆర్టీసీ ప్రాంగణాల్లో 15 మినీ థియేటర్లు

• చలనచిత్ర అభివృద్ధి సంస్థతో చర్చలు
• రూ.3.11 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖాళీగా ఉన్న స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్సులు, పెట్రోల్‌బంక్‌లు, ప్రయాణ ప్రాంగణాలలో మినీ థియేటర్ల ఏర్పాటు ద్వారా రవాణేతర ఆదాయాన్ని తెచ్చుకోవాలని టీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు బస్టేషన్లల్లో 15 మినీ థియేటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. నష్టాలలో మునిగి ఉన్న సంస్థను గట్టెక్కించేందుకు రవాణేతర ఆదాయంపై దృష్టి కేంద్రీకరించిన అధికారులు ఖాళీ స్థలాల వినియోగంతో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఖాళీ స్థలాలలో పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటు కోసం పలు చమురు రంగ కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. తాజాగా సంస్థ బస్టేషన్లల్లో మినీ థియేటర్ల నిర్మాణంపై రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థతో చర్చించారు. టీఎస్ఆర్టీసీకి 97 డిపోలు, 358 బస్టేషన్లు, 10504 బస్సులున్నాయి. సంస్థ నిత్యం 90 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తోంది. అయినప్పటికీ సంస్థ నష్టాల బాటను వీడటం లేదు. ప్రయాణికుల రవాణా ద్వారా వచ్చే ఆదాయంతో పాటు రవాణేతర ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వీలుగా ప్రయాణ ప్రాంగణాలలోని షాపులను అద్దెకు ఇవ్వడం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. వాణిజ్య పరమైన ఆదాయాన్ని పెంచుకునే ఆలోచనలో భాగం గా మినీ థియేటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ అంశంపై చలన చిత్ర అభివృద్ధి సంస్థకు చెందిన కొంత మంది ప్రముఖులతో చర్చలు జరిపిన అధికారులు మొత్తం 23 స్థలాలు మినీ థియేటర్ల నిర్మాణానికి అనుకూలంగా ఉండగా అందులో 15 స్థలాలను ఎంపిక చేశారు. ఈ థియేటర్ల ద్వారా సంస్థకు రూ. 3.11 కోట్ల ఆదాయం సమ కూరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కొల్లూ రు, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్చర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జునసాగర్, కోదాడ, ఆర్మూర్, చేవెళ్ళ, తాం డూర్, వికారాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బస్టేషన్లల్లో మినీ థియేటర్లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

విజయవాడకు అధికారుల బృందం

ఏపీలోని విజయవాడ నగరంలోని పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో నిర్మించిన మినీ థియేటర్‌ను సంస్థ ఈడీ పురుషోత్తం నేతృత్వంలో అధికారుల బృందం త్వరలోనే పరిశీలించనుంది. నిర్మాణం, పనితీరు తది తర అంశాలను పరిశీలించిన తర్వాత రాష్ట్రం లోని బస్టాండ్‌లలో నిర్మించే థియేటర్లపై ఒక నిర్ణయానికి రానున్నారు.



ఆర్‌టీసీని లాభాల బాటలో నడిపిస్తున్న అధికారులకు ఎండీ సునీల్ శర్మ ప్రశంస

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి




సూర్యాపేట (సిటి), ప్రభ న్యూస్ : అప్పటిదాక ఇంట్లో అల్లరి చేస్తూ తిరిగిన చిన్నారి చూస్తుండగానే కానరాని లోకానికి వెళ్లి తల్లి దండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చాడు. సూర్యా పేట జిల్లా, కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపం లో అను ముల రవీందర్, సంధ్య కుమారుడు గుణాకర్ (5) ఇంట్లో ఆడుకుం టూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. చిన్నారి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని న్యూసిటీ సెంటర్ స్కూల్‌లో యుకేజి చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు.

జెన్‌కోలో సమ్మెలు నిషేధం

హై దరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లో సమ్మెలను ఆరు నెలల పాటు నిషేధిస్తూ విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి అజయ్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ ఉత్పత్తిని తెలంగాణ ప్రభుత్వం 1971 చట్టం కింద అత్యవసర సర్వీసుగా ఎంపిక చేసినందున సమ్మెలపై నిషేధం విధించినట్టు ఈ మేరకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 27నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప వరకు పొడిగింపు

అమరావతి, ఆంధ్రప్రభ: పలు రైళ్ల వేళలు మార్పు,స్టాపేజీ,స్టేషన్ల పొడిగింపునకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. చెన్నై సెంట్రల్ - హజ్రత్ నిజాముద్దీన్ (12611) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు వేళలు ఈనెల 26 నుంచి మారనున్నాయి. చెన్నై స్టేషన్‌లో 6.05 నిమిషాలకు బయలు దేరాల్సిన ఈ రైలు ఈనెల 26 నుంచి 06.50 నిమిషాలకు బయలు దేరుతుంది. భోపాల్ జంక్షన్‌కు 2.25కు చేరుకుంటుంది.అలాగే ఝాన్సీ05:50 గంటలకు, గ్వాలియర్ 06:52 గంటలు, ఆగ్రా కాంట్ 8:17 గంటలకు చేరుకుంటుంది. హజ్రత్ నిజాముద్దీన్‌కు రాత్రి 10.30 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ మార్పును ప్రయాణీకులు గమనించాలని కోరారు. అదే విధంగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకు పొడిగించారు. ఈనెల 31 నుంచి ఈ మార్పు అమలులోకి వస్తుంది. ఇప్పటి వరకు విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు వెళుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31 నుంచి కడప వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నంలో ఈ రైలు 2 గంటలకు బయలు దేరి కడపకు రాత్రి 8.25 గంటలకు చేరుకుంటుంది. అదే విధంగా శివాజీ మహరాజ్ టెర్మినల్ - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019 సి), శివాజీ మహరాజ్ టెర్మినల్ - కన్యాకుమారి (16381 సి) జయంతి జనత ఎక్స్‌ప్రెస్ రైళ్లను తాత్కాలికంగా రెండు నిమిషాల పాటు థానే రైల్వేస్టేషన్‌లో ఆరు నెలల పాటు నిలుపుదల చేయనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.



మా ఊరు - మా రాజ్యం

అదే జోరు.. అదే జోష్



• రెండు విడతల్లోనూ ఆధిక్యం • టీఆర్ఎస్ మద్దతుదారులదే గెలుపు • మొత్తంమీద 2,512 పంచాయతీల్లో పాగా

మలి విడతలోనూ కారు జోరు

(మొదటిపేజీ తరువాయి)

సత్తా చాటారు. బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించడంతో శుక్రవారం బాగా పొద్దుపోయేంత వరకు ఓట్ల లెక్కింపు కొనసాగుతూనే ఉంది. కడపటి వార్తలు అందేసరికి 2,512 పంచాయతీల్లో తెరాస, 802 పంచాయతీల్లో కాంగ్రెస్, 37 పంచాయతీల్లో తెదేపా, 35 పంచాయతీల్లో భాజపా, 10 పంచాయతీల్లో సీపీఐ, 22 పంచాయతీల్లో సీపీఎం, 541 పంచాయతీల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించినట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిసిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొదటి విడతలో మాదిరిగానే కారు స్పీడును కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులతో సహా ఏ పార్టీ అందుకోలేకపోయింది. రెండవ విడతలో 788 మంది సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మరో ఏడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు.

జిల్లాల వారీగా తెరాస, కాంగ్రెస్ పార్టీల మద్దతుదారులు గెలుపొందిన పంచాయితీలివే.

జిల్లా	తెరాస	కాంగ్రెస్
జోగులాంబ గద్వాల	55	11
వనపర్తి	57	12
వరంగల్ గ్రామీణం	106	16
వరంగల్ అర్బన్	19	3
యాదాద్రి భువనగిరి	71	40
ఆదిలాబాద్	32	18
భద్రాద్రి కొత్తగూడెం	78	23
జగిత్యాల	68	16
జనగామ	79	17
జయశంకర్ భూపాలపల్లి	64	45
కామారెడ్డి	115	54
కరీంనగర్	51	21
ఖమ్మం	132	14
కొమురం భీం	63	25
మహబూబ్‌నగర్	157	26
మంచిర్యాల	60	24
మెదక్	124	34
మేడ్చల్	17	4
నాగర్‌కర్నూల్	93	20
నల్గొండ	177	63
నిర్మల్	67	36
నిజామాబాద్	89	31
పెద్దపల్లి	43	17
రాజన్న సిరిసిల్ల	55	3
రంగారెడ్డి	88	56
సంగారెడ్డి	127	37
సూర్యాపేట	100	38
వికారాబాద్	79	55
మహబూబాబాద్	109	23
సిద్దిపేట	145	21

ఉమ్మడి కరీంనగర్‌లో కారు దూకుడు

4 జిల్లాల్లో 228 మంది తెరాస మద్దతుదారులు గెలుపు

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : గ్రామపంచాయతి రెండోవిడత కారు జోరు కొనసాగింది. . రెండో విడత పంచాయతీ ఎన్నికలు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నాలుగు జిల్లాలలో మొత్తం 389 పంచాయతీలకు ఎన్నికలు జరగవలసి ఉండగా రెండో విడతలో 52 ఏకగ్రీవం కావడంతో 337 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవం కలుపుకొని 237 పంచాయతీల్లో టీఆర్ఎస్ మద్దతు దారులు గెలుపొందగా, 55 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. 89 చోట్ల స్వతంత్రులు గెలుపొందారు. చిగ ురుమామిడి మండలంలో సీపీఐ తన పట్టు నిరూపించుకుంది, మూడుచోట్ల వారి మద్దతు దారులు గెలుపొందారు. మూడు జిల్లాల్లో బీజేపీ ఒక్కరి చొప్పున ముగ్గురుమద్దతు దారులు గెలువగా, టీడీపీకి చెందిన వారు ఒకరు గెలుపొందారు. జిల్లాల వారిగా చూస్తే కరీంనగర్ జిల్లాలో 107 పంచాయతీ స్థానాలకు గాను టీఆర్ఎస్ మద్దతుదారులు 60 మంది, కాంగ్రెస్ మద్దతు దారులు 22 మంది, ఒకరు టీడీపీ, ముగ్గురు సీపీఐ మద్దతు దారులు గెలుపొందగా 20 మంది స్వతంత్రులు గెలుపొందారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 122 పంచాయతీ స్థానాలకు 66 చోట్ల టీఆర్ఎస్, 18 చోట్ల కాంగ్రెస్, ఒక చోట బీజేపీ మద్దతు దారులు గెలుపొందగా 36 చోట్ల స్వతంత్రులు గెలుపొందారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 76 పంచాయతీలు కాగా 54 చోట్ల టీఆర్ఎస్, 09 చోట్ల కాంగ్రెస్, 1 చోట బీజేపీ మద్దతు దారులు సర్పంచులుగా గెలుపొందగా 11 చోట్ల ఏ పార్టీకి సంబంధం లేని వారు గెలుపొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 84 పంచాయతీ స్థానాలకు గాను 57 చోట్ల టీఆర్ఎస్ మద్దతు దారులు, కేవలం 4 చోట్ల కాంగ్రెస్ మద్దతు దారులు, ఒక చోట బీజేపీ, 22 చోట్ల ఏ పార్టీకి సంబంధం లేని వారు గెలుపొందారు.

రంగారెడ్డిలో తెరాస జెండా రెపరెపలు

ఉమ్మడి జిల్లాలో 211 పంచాయతీలు కైవసం

రంగారెడ్డి, ప్రభన్యూస్ : పంచాయతీ ఎన్నికల్లో తెరాస విజయపరంపర కొనసాగుతోంది. మొదటి విడతలో మెజార్టీ పంచాయతీలను దక్కించుకున్న తెరాస రెండవ విడతలో కూడా తమకు తిరుగులేదని నిరూపించుకుంది ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 333 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 211 పంచాయతీలను తెరాస బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. 105 స్థానాలతో కాంగ్రెస్ ఆశించినమేర విజయాలు సాధించింది. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆశించిన జీపీలను దక్కించుకుంది. శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి (నాలుగుమండలాలు), వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 333 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వికారాబాద్ జిల్లాలో 98 జీపీలు తెరాస దక్కించుకుంది. రంగారెడ్డి జిల్లాలో 95 పంచాయతీలు గెలుచుకోగా మేడ్చల్ జిల్లాలో 18 పంచాయతీలు తెరాస ఖాతాలోకి చేరాయి. .మొదటి విడత పంచాయతీ ఎన్నికలతో పోలిస్తే రెండవ విడతలో కాంగ్రెస్‌కు ఆశించినమేర ఫ లితాలు వచ్చాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 211 జీపీలు తెరాస దక్కించుకోగా 105పంచాయతీలను కాంగ్రెస్ విజయం సాధించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో రంగారెడ్డి జిల్లాలో ఏకంగా 56 జీపీలు దక్కించుకుంది. వికారాబాద్ జిల్లాలో 43, మేడ్చల్ జిల్లాలో కేవలం ఆరు పంచాయతీలతో సరిపెట్టుకుంది. భాజపా 9 జీపీల్లో విజయం సాధించగా 3 పంచాయతీలను తెదేపా, 6 పంచాయతీలుసీపీఎం ఇతరులు 18 స్థానాలను దక్కించుకున్నారు.

వరంగల్‌లో తెరాస హవా

109 పంచాయతీలు ఏకగ్రీవం

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : పంచాయతీ మలి విడత ఎన్నికలలో టీఆర్ఎస్‌ది అదే జోరు..అదే జోష్ కనిపిస్తోంది.. మొదటి విడత పంచాయతీ ఫలితాలలో 67శాతం సీట్లను కైవసం చేసుకున్న టీఆర్ఎస్ పార్టీ రెండో విడతలో 70శాతంపైగా సీట్లను గెలుచుకుంది. మొదటి విడతకు జరిగిన పంచాయతీ ఎన్నికలలో వన్‌సైడ్ ఫలితాలు వచ్చాయి. రెండో విడతలో కూడా అవే ఫలితాలు వస్తున్నాయి. కాంగ్రెస్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1704 గ్రామ పంచాయతీలకుగాను మొదటి విడతలో 608 పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించగా 410 పంచాయతీలను కైవసం చేసుకుంది. మలి విడతలో కూడా అదే దిశగా ఫలితాల తీరు కనిపిస్తోంది. రెండో విడతలో 538 పంచాయతీలకుగాను 109 పంచాయతీలు ఏకగ్రీవం అయిన విషయం తెలిసిందే. మిగిలిన 429 పంచాయతీలకు శుక్రవారం ఎన్నికలను నిర్వహించారు. ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్ మధ్యాహ్నం 1గంట వరకు ముగిసింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. ఫలితాలు వెలువడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలోని పంచాయతీలు,వార్డులకు సంబంధించిన పోలింగ్ శుక్రవారం ఉదయం 7గంటలకు ప్రారంభం అయింది. మొత్తం 429 పంచాయతీలు, 3564వార్డులకు ఎన్నికలు జరిగాయి. వీటిలో వరంగల్ అర్బన్ జిల్లాలో 20 గ్రామ పంచాయతీలు, 198 వార్డులకు, వరంగల్ రూరల్ జిల్లాలో 103 గ్రామ పంచాయతీలు, 970 వార్డులకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 115 గ్రామ పంచాయతీలు, 872 వార్డులకు పోలింగ్ జరిగింది. జనగామ జిల్లాలో 83 గ్రామ పంచాయతీలు 680 వార్డులకు పోలింగ్ జరుగుతోంది. మహ బూబాబాద్ జిల్లాలో 108 గ్రామ పంచాయతీలు, 838 వార్డులకు పోలింగ్ జరిగింది.

మెదక్‌లో గులాబీ గుబాళింపు

కారు ఖాతాలో 400 పంచాయతీలు

మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడతలో అధిక స్థానాల్లో విజయఢంకా మోగించిన టీఆర్ఎస్ మద్దతుదారులు రెండో విడతలో కూడా విజయపరంపర కొనసాగించింది. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో తొలి, మలి విడత ఎన్నికల్లో 'కారు' పార్టీ స్పీడును అందుకోలేక కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు డీలాపడిపోయారు. రెండు విడతల్లో ఆ పార్టీ మద్దతుదారులు 400 పంచాయతీల్లో విజయం సాధించారు. రెండో విడతలో 442 పంచాయతీలకు, 3559 వార్డులకు ఎన్నికలు శుక్రవారం నాడు జరిగాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1244 మంది సర్పంచ్ పదవికి పోటీ పడ్డారు. రెండో విడతలో భాగంగా మెదక్ జిల్లాలో నర్సాపూర్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలకు 170 పంచా యతీలకు గాను 40 పంచాయతీలు ఏకగ్రీవం కాగా వారంతా టీఆర్ఎస్ మద్దతుదారులే కావడం విశేషం. అలాగే 130 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా 89 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందగా, 32 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. కొల్చారం మండలంలో నలుగురు టీఆర్ఎస్ రెబల్ అభ్యర్థులు గెలుపొందగా, ఆరు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. మొత్తంగా మెదక్ జిల్లాలో 170 పంచాయతీలకు గాను ఏకగ్రీవ పంచాయతీలతో కలుపుకొని 129 పంచాయతీలు టీఆర్ఎస్ కైవసం చేసుకోగా 32 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. అలాగే సిద్దిపేట జిల్లాలోని 191 స్థానాలకు గాను 150 స్థానాల వరకు టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందగా, 20 స్థానాల వరకు కాంగ్రెస్ గెలుపొందింది. సంగారెడ్డి జిల్లాలో సైతం 190 స్థానాలకు గాను 130కి పైగా పంచాయతీలను టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందగా, 40 స్థానాల వరకు కాంగ్రెస్ గెలుపొందగా 598 పంచాయతీలకు గాను 76 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, 522 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉభయ జిల్లాల్లో 442 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. 101 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు.



చెదురుమదురు 'పంచాయతీ'లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చెదురుమదురు సంఘటనలు చోటు చేసుకున్నాయి. రెండు మూడు జిల్లాల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ పడ్డ అభ్యర్థుల అనుచరుల మధ్య తోపులాటలు జరిగాయి. నిజామాబాద్ జిల్లా జిల్లాపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసిన ఒక అభ్యర్థికి కేటాయించిన ఎన్నికల గుర్తుకు బదులు బ్యాలెట్ పేపర్‌లో మరో గుర్తు ముద్రించి ఉండటంతో అభ్యర్థి పోలింగ్ నిలిపివేయాలంటూ ఆందోళన చేశారు. దీంతో బ్యాలెట్ పత్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు అక్కడ పోలింగ్‌ను నిలిపివేశారు. జనగాం జిల్లా రఘునాథపల్లి పంచాయతీలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తటంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం సర్వ గ్రామంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉద్రిక్తత పుట్టుకొచ్చింది. కౌంటింగ్ సిబ్బందిపై స్థానికులు దాడికి ప్రయత్నించారు. ఎన్నికల సిబ్బంది నిర్లక్షంగా వ్యవహరించారని అధికారులపై ఆగ్రహం వెలిబుచ్చారు. సర్పంచ్ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలైన అభ్యర్థి అనుచరులు పోలింగ్ కేంద్రంలోకి దూసుకుపోయి సామాగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

2 పంచాయతీల్లో 30న రీపోలింగ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జరిగిన పోలింగ్‌లో తప్పులు దొర్లిన రెండు పంచాయతీల్లో తిరిగి ఈనెల 30న రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాలు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం నల్లవారిపల్లె పంచాయతీలోని 8వ వార్డులో ఒక అభ్యర్థికి పొరపాటున నోటా గుర్తు కేటాయించినందున ఇక్కడ రీపోలింగ్‌కు ఆదేశాలిచ్చారు. అదే విధంగా అదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం తోసంతాండ పంచాయతీలో మూడవ వార్డులో కూడా టెండర్ ఓటు కారణంగా ఇక్కడ ఓట్ల లెక్కింపు నిలిపివేశారు. తిరిగి ఈనెల 30న ఇక్కడ రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం అదేశాలు జారీ చేసింది.

ఓటమి భారంతో మహిళా సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం



పవార్‌కళాబాయి

గుడిహత్నూర్, ప్రభన్యూస్ : ఆది లాబాద్ జిల్లా, గుడిహత్నూర్ మండలం ముత్నూర్ తండా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓడిపోయిన పవార్ కళాబాయి అనే అభ్యర్థిని ఓటమి భారంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. శుక్ర వారం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన అనంతరం జాదవ్ సులోచనాబాయి అనే మహిళ సర్పంచ్ గా గెలుపొందింది. ఓటమి అవమానంగా భావించిన ఎవార్‌కళాబాయి ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. దీనిని గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. సర్పంచ్ ఎన్నికల్లో ఆమె రెండవసారి ఓడిపోవడంతో మానసికంగా కుంగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు చికిత్స అందజేస్తున్న వైద్యులు తెలిపినట్లు సమాచారం.

ఓటెత్తిన మహిళాలోకం

• రెండో విడత 88.26 శాతం పోలింగ్• యాదాద్రి జిల్లా 93.71 శాతంతో ప్రథమ స్థానం
• మరో 8 జిల్లాల్లో 90 శాతంపైనే పోలింగ్ • జగిత్యాలలో అతితక్కువగా 80.23 శాతం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో రెండోదశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ మహిళలు చైతన్యంతో ముందుకు వచ్చారు. భారీఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచే బారులు తీరి... తమ ఓటుహక్కును ఉపయో గించు కున్నారు. మొత్తంమీద పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం ఏడుగంటలకు పోలింగ్ ప్రారంభం కాగా అంతకుగంట ముందు నుంచే పలు జిల్లాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి కనిపించారు. ఉదయం 11గంటలకే రాష్ట్రమంతటా పోలింగ్ 65.87శాతం జరిగిపోయింది. జగిత్యాల, నిర్మల్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ శాతం పెంచటంలో కూడా తమ సత్తా చాటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ముగిసిపోయింది. గడువు ముగిసే సరికి తుది విడుత పంచాయతీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 88.26 శాతం పోలింగ్ జరిగింది. ఈనెల 21న జరిగిన తొలిదశ ఎన్నికల్లో 85.76శాతం ఓట్లు పోల్ కాగా ఈసారి మరో మూడు శాతం అధికంగా పోలింగ్ జరిగింది. పంచాయతీ ఎన్నికల్లో ఇంత పెద్దమొత్తంలో పోలింగ్ జరగటం ఇదే రికార్డ్ అని పంచాయతీరాజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు. తొలిదశ ఎన్నికల్లో లాగే మలిదశలో కూడా యాదాద్రి భువనగిరి జిల్లా పోలింగ్‌లో ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకుంది. శుక్రవారం జరిగిన పోలింగ్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాలో 93.71శాతం ఓట్లు పోల్ అయ్యాయి. తొలిదశలో కూడా ఈ జిల్లాలో 95.32శాతం పోలింగ్‌తో రికార్డు నెలకొల్పింది. రెండవ దశ ఎన్నికల్లో మరో ఎనిమిది జిల్లాల్లో 90శాతం పైగా పోలింగ్ జరిగింది. రాష్ట్రంలో అతి తక్కువగా జగిత్యాల జిల్లాలో 80.23శాతం పోలింగ్ జరిగింది. తొలిదశలో జరిగిన పోలింగ్‌లో వికారబాద్ జిల్లా అతి తక్కు వగా కేవలం 68.25శాతం మాత్రమే పోలింగ్ జర్గగా రెండవ దశ ఎన్నికల్లో ఈజి ల్లాలో పోలింగ్ 83.20శాతం జరగటం రికార్డే అని అధికారులు చెబ తున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్స్

ఈ సారి గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో 9.35శాతం మంది ట్రాన్స్ జెండర్స్ కూడా తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 35.71శాతం ట్రాన్స్‌జెండర్స్ పోలింగ్‌లో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లాలో 25శాతం,మంచిర్యాల జిల్లాలో 20శాతం ట్రాన్స్‌జెండర్స్ ఓట్లు పోల్ అయ్యాయి. ఈ మూడు జిల్లాలు మినహా మరెక్కడా ట్రాన్స్‌జెండర్స్ ఓట్లు పోల్ కాలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

రెండోదశలో 37.76లక్షల ఓట్లు పోల్

రెండవ దశ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 37,76,797మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. రాష్ట్రంలో రెండో దశకింద 172 మండ లాల పరిధిలో 4137 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు , వాటి పరిధిలో 36620 వార్డు స్థానాలకు ఎన్నికలు ప్రకటించగా అందులో 788 పంచాయతీలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శుక్రవారం 3342 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు , వాటి పరిధిలోని 26,191 వార్డుస్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 42,79,277మంది ఓటర్లు ఉండగా అందులో 37,76,797మంది ఓటు హక్కును ఉప యోగిం చుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో 19,08,889 మహిళల ఓట్లు కాగా , 18,67,898మంది పురుష ఓటర్లు ఉన్నారు. పదిమంది ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

గ్రామీణ మహిళ సత్తా

ప్రజాస్వామ్యవ్యవస్థకు మహిళలు పట్టుకొమ్మలుగా నిలుస్తునవారు. శుక్రవారం జరిగిన రెండోదశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో క ూడా మహిళలు పురుషులకంటే ఎంతో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. రాష్ట్రంలో ఓటింగ్‌లో పాల్గొన్న పురుష ఓటర్లు 87.67శాతం మాత్రమే ఉండగా మహిళా ఓటర్ల పోలింగ్ శాతం రాష్ట్ర సగటును కూడా దాటిపోయింది. మహిళల్లో 88.85శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పంచాయతీ ఎన్నికలకు రూ.33కోట్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.33కోట్లు విడుదల చేసింది.రాష్ట్రంలో మూడు దశల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 240 కోట్లు కేటాయించారు.ఇందులో భాగంగానే శుక్రవారం 30కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికలు బహిష్కరించిన నాలుగు తండాలు



ఎస్సై జె. లక్ష్మణ్‌రావుతో మాట్లాడుతున్న తండావాసులు

రాయపర్తి, ప్రభన్యూస్ : శ్రీరాం నగర్‌తం డా ను గ్రామ పంచాయతీ చేయాలని వరంగల్ జిల్లా, రాయపర్తి మండలంలోని సన్నూరు శివారు శ్రీరాంరాంనగర్‌తండ, దర్యా నాయక్‌తండ, సూర్యతండ, లాక్యతండవాసులు రెండవ విడ తలో భాగంగా జరిగిన సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల కొన్ని తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. ప్రత్యేక గ్రామపంచాయతీలను గుర్తించే క్రమంలో మా తండాల (480 మంది 265ఓటర్ల) ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయంతో ఎలాంటి సౌకర్యాలు లేకుండా అందుబాటులోలేని జయరాం తండా గ్రామపంచాయతీలో చేర్చి మా తండా వాసులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జయరాం తండాలో చేర్చిన విషయం తెలసిన నాటి నుంచి మా తండాను గ్రామ పంచాయతీగా చేయాలని గతంలోనే స్థానిక తహసీల్దార్‌కు, ఎంపీడీవోకు, డీపీవోకు కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేసినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలను బహిష్కరిస్తున్నారనే విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై జె లక్ష్మణ్‌రావు సంఘటనా స్థలానికిచేరుకొని ఎన్నికలలో పాల్గొనాల్సిందిగా తండా వాసులతో నచ్చ చెప్పినప్పటికీ మాతండాను గ్రామ పంచాయతీ చేసేంతవరకు ఒక్కరు కూ డా రానున్న పాల్గొనమని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లి పోయి నట్లు తెలిపారు.

'పంచాయతీ'లో పుంజుకున్న కాంగ్రెస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల పరాజయం పాలైన కాంగ్రెస్ పార్టీ.. పంచాయతీ ఎన్నికల్లో మాత్రం కొంతమేరకు బలం పుంజుకున్నట్లుగా స్పష్టమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టున్నప్పటికి శాసన సభ ఎన్నికల్లో ఓటర్లను అనుకూలంగా ఆ పార్టీ నేతలు మలుచుకోలేకపోయారనే విమర్శలు అప్పట్లోనే వినిపించాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనుభవంతో పంచాయతీ ఎన్నికల్లో మాత్రం స్థానిక కాంగ్రెస్ నేతలు తమ పట్టును నిలుపుకునేందుకు గట్టిగానే కృషి చేసినట్లుగానే కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండు విడతలుగా జరిగిన ఎన్నికల్లో సమష్టి కృషితో తమ ఉనికిని కాపాడుకోగలినట్లు ఫలితాలను బట్టి తెలుస్తోంది. రెండు విడుతలుగా జరిగిన 8600 గ్రామ పంచాయతీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు 835 మంది సర్పంచ్‌లు విజయం సాధించారు. ఈ 8600 గ్రామాల్లో ఏకగ్రీవమైన గ్రామాలు క ూడా కలిసి ఉన్నాయి. కాగా రెండో విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 4130 గ్రామాలకు ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన 1755 మంది సర్పంచ్‌లు గెలిచారు.

ఇటు ఆహార్యం... అటు ఆహారం





ప్రయాగ్‌రాజ్‌లో ఎటు చూసినా ఆధ్యాత్మిక సౌరభమే. కుంభమేళాకు తరలి వస్తున్న కోట్లాది మంది పవిత్ర స్నానాలు ఓ అద్భుత దృశ్యమయితే.. సాధుసంతుల వేషభాషా విన్యాసాలు మరో ఆకర్షణ. ఏవీ పట్టని.. ఏదీ పట్టించుకోని సాధువులు.. ప్రయాగలో మాత్రం హైటెక్ సాంకేతికతను చూసి మురిసి పోతున్నారు. ఇదిగో ఇక్కడ సావధానంగా ఓ స్మార్ట్ ఫోన్ సొబగులను నిశితంగా చూస్తున్న ఓ సాధువు మోములో ఒకింత ఆశ్చర్యం.. ఆనందం తొణికిసలాడుతూండగా ఆయన అందరినీ ఆకర్షించాడు.. మరోవైపు రక్షణ విధుల్లో ఓ ఉన్న జవాను... అంతే దీక్షతో పక్షులకు ఆహారాన్ని అందించి ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాడు.. భక్తి.. ముక్తిధామంలో కనిపించే జనజీవన సౌందర్యంలో రెండు మనహోర దృశ్యాలు శుక్రవారం కనువిందు చేశాయి.



ఒడిశాలోని బిజుపట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వస్తున్న రాహుల్ గాంధీ ఫొటో కవరేజ్ చేస్తూ పడిపోయిన ఫొటో గ్రాఫర్‌కు రాహుల్ సాయం.

జైట్లీ వేగంగా కోలుకుంటున్నారు



న్యూఢిల్లీ: వైద్య పరీక్షల నిమిత్తం అమెరికాలో ఉన్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వేగంగా కోలుకుంటున్నారని తాత్కాలిక ఆర్థికశాఖమంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. గతరాత్రి జైట్లీతో ఫోన్‌లో మాట్లాడాడనని ఆయన తెలిపారు. జైట్లీ వేగంగా కోలుకుంటున్నారన్నా రు. ఆయన త్వరగా కోలుకోవాలని తనతోపాటు అంద రూ కోరాలని సూచించారు. జైట్లీ త్వరగా భారత్ వచ్చి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. జైట్లీ ఎప్పుడు భారత్ రానున్నారనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. అంతర్జాతీయ కస్టమ్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జైట్లీకి జనవరి 13న సర్జరీ జరిగింది. కనీసం రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రధాని మోదీ సిఫారసు మేరకు రైల్వేమంత్రి పియూష్ గోయల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

రెండు నిమిషాల్లో మోటార్ సైకిళ్ల పన్ను తగ్గించా



వాషింగ్టన్: హార్లీ-డేవిడ్‌సన్ లాంటి మోటారు సైకిళ్ల దిగుమతులపై పన్నును 50 శాతం తగ్గిస్తూ గతేడాది ఫిబ్రవరిలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించారు. భారత్ మంచి నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు. మోటారు సైకిళ్లపై దిగుమతుల పన్నును 50 శాతం తగ్గించడాన్ని ఆయన సమర్థించారు. భారత్ ప్రభుత్వంతో కేవలం రెండు నిమిషాలు మాట్లాడి పన్నులను తగ్గించానని ఆయన వెల్లడించారు. 50 శాతం మాత్రమే తగ్గించినప్పటికీ ఇది మంచి నిర్ణయమేనని భారత్ నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించారు. భారత్ ఎగుమతి చేస్తున్న మోటారు సైకిళ్లపై అమెరికా 2.4 శాతం పన్ను విధిస్తోందని ఆయన గుర్తు చేశారు. విదేశీ విస్కీలపై భారత్ 150 శాతం విధిస్తుండగా అమెరికా పన్ను విధించడం లేదన్నారు.

లక్ష మంది దళిత యువతులకు కళ్యాణ లక్ష్మి

- రూ. 625 కోట్లు పంపిణీ • ఈ ఏడాది ఇప్పటికే రూ. 162 కోట్లు మంజూరు
- పెళ్లికి నెల రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే చెక్ అందజేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కళ్యాణలక్ష్మి పథకంలో ఇప్పటి వరకు లక్ష మంది దళిత యువతులకు ఆర్థికసాయాన్ని అందించారు. 2014-15 సంవత్సరం నుంచి పథకం ప్రారంభమైనా 2018 డిసెంబర్ వరకు 1,02,279 మందికి ఆర్థికసాయం చేశారు. ఇందు కోసం రూ. 625 కోట్లు పంపిణీ చేశారు. పేద దళిత యువతులు పెళ్లికి నెల రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే వారికి చెక్‌ను అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు తరువాత నుంచి చెక్ జారీ చేయడానికి కనీసం 20 రోజుల సమయం పడుతుందని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ సంచాలకులు కరుణాకర్ తెలిపారు. పథకం అమలు తీరు గురించి తెలుసుకోవడం కోసం థర్డ్ పార్టీతో ఎవాల్యుయేషన్ చేయించనున్నారు.

1,02,279 మందికి ఆర్థిక సాయం..

టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రత్యేకంగా ప్రకటించారు. పేద దళిత యువతుల పెళ్లి ఖర్చు కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని ప్రకటించారు. 2014 అక్టోబర్ 2న పథకం ప్రారంభించిన సందర్భంలో రూ. 51,00 ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. ఆ తరువాత 2017 సెప్టెంబర్‌లో ఆర్థిక సాయాన్ని కాస్త రూ. 75,116కు పెంచారు. అనంతరం 2018 మార్చిలో మరోసారి పెంచుతూ రూ. 1,00,116 పెంచారు. పెళ్లి చేసుకోబోయే యువతి తల్లి బ్యాంక్ అకౌంట్‌లో నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,23,660 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,02,279 మందికి మంజూరు చేశారు. ఇప్పటి వరకు రూ. 625 కోట్లు పంపిణీ చేశారు. 2017- 18లో 25,223 మందికి రూ.166 కోట్లు, ఈ ఏడాది డిసెంబర్‌కి 18,920 మందికి రూ. 162 కోట్లు మంజూరు చేశారు.



సంవత్సరాలవారీగా లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య
2014-15	5105
2015-16	30,569
2016-17	22,454
2017-18	25,223
2018-19	18,928
మొత్తం	1,02,279

నెల రోజుల్లోనే చెక్...

యువతి పెళ్లికి నెల రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే యువతి తల్లి బ్యాంక్ అకౌంట్‌లో నిధులు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకున్న తరువాత 20 రోజుల్లో పరిశీలన, అర్హతలను పరిశీలన చేసి నిధులు మంజూరు చేస్తున్నారు. పెళ్లికి నెల రోజుల ముందు ఈ-పాస్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే చెక్‌ను ఇస్తామని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ సంచాలకులు కరుణాకర్ తెలిపారు.

ప్రధానంగా పథకం పాపులారిటీ గురించి తెలుసుకోవడం, నిధులు సరైన సమయంలో అందుతున్న వారి సంఖ్య తెలుసు కోవడం, రెవిన్యూ అధికారుల దగ్గర వస్తున్న సమస్యలు, మీ-సేవాలో వస్తున్న సమస్యల ను ఎవాల్యుయేషన్ చేయించనున్నట్టు తెలిపారు. త్వరలోనే నివేదిక అందుతుందన్నారు.

సరైన సర్టిఫికెట్లు లేక అనర్హత

కొందరు దరఖాస్తుదారులు సమర్పించే ఆదాయ సర్టిఫికెట్ రూ. 2 లక్షల కంటే అదనంగా ఉంటుందని, వాటితోపాటు పెళ్లి కాకున్నప్పటికీ అవుతుందని కొందరు దరఖాస్తు చేసుకుంటున్నారని, తెలంగాణ కానీ వారు కూడా దరఖాస్తు చేసుకుంటున్నట్టు తెలిసింది. వీటి ద్వారా వారిని పథకానికి అనర్హులుగా అధికారులు ప్రకటిస్తున్నారు.

మేల్కొనకుంటే.. తొక్కేస్తారు..

- నిరంకుశుల్లో మోడీ సీనియర్.. నవీన్‌జూనియర్
- పారిశ్రామిక వేత్తలే వారికి మార్కెటింగ్ ఏజెంట్లు
- ప్రధాని, ఒడిశా సీఎంపై రాహుల్ విమర్శలు

భువనేశ్వర్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నవీన్ పట్నాయక్‌ను మోడీ జూనియర్ పార్ట్‌నర్‌గా అభివర్ణించిన రాహుల్.. కేంద్రంలో మోడీ.. ఒడిశాలో నవీన్‌లది నిరంకుశ పాలనేనని విమర్శించారు. భువనేశ్వర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో సంభాషించిన రాహుల్.. తాము కేంద్రంలో మోడీ నిరంకుశత్వంపై.. ఒడిశాలో మోడీ లాంటి మరో నిరంకుశుడు నవీన్ పట్నాయక్‌పై పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. నవీన్ పట్నాయక్‌ను మోడీ రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేస్తున్నారని ఆరోపించిన రాహుల్.. ఒడిశాలోనూ గుజరాత్ మోడల్ పాలన సాగుతోందన్నారు. మోడీ, నవీన్ పట్నాయక్ పారిశ్రామిక వనేత్తలతోనే మార్కెటింగ్ చేస్తాని విమర్శించారు. బయటకు శత్రువుల్లా కనిపించే బీజేపీ, బీజేపీ పార్టీలు.. లోలోపల ఒక్కటేనని రాహుల్ మండిపడ్డారు. జీఎస్టీ నోట్లరద్దు వద్ద మోడీ ప్రభుత్వ నిర్ణయాలకు నవీన్ పట్నాయక్ పార్టీ బీజేపీ మద్దతుపలకడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఒడిశాకు ఏకచత్రాధిపత్యం నుంచి విముక్తి కల్పించి.. ప్రజలకు సేవ చేయడమే తన సంకల్పమని రాహుల్ చెప్పుకొచ్చారు. ఒడిశాను ప్రజాస్వామ్య రాష్ట్రంగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు. కేంద్రంలో ప్రధానిగా మోడీ, ఒడిశాలో సీఎంగా పట్నాయక్ ఉన్నంతకాలం రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరుగుతూనే ఉంటుందని ఆరోపించారు. బీజేడీ నేతలను అవినీతి కేసుల నుంచి మోడీ ప్రభుత్వం విముక్తి కల్పిస్తున్నందునే ఆ రెండు పార్టీ పరస్పర అంగీకారంతో పార్లమెంట్‌లో కలిసినడుస్తున్నాయని రాహుల్ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను గుర్తించి ఎన్నికల సమయంలో ప్రజలు మేల్కొనకుంటే మళ్లీ నిరంకుశ పాలనలో మగ్గకతప్పదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై సొంత కేబినెట్ మంత్రులే వ్యతిరేకిస్తున్నా.. మోడీ నిరంకుశ తత్వంతో బాహాటంగా గళమెత్తలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల గళాన్ని వింటుందని రాహుల్ గుర్తు చేశారు. మోడీ నిరంకుశవాదంతో ప్రభుత్వ సమాచారం ఇతరులకు అందే పరిస్థితి లేదని విమర్శించారు.



తెలంగాణ అధికారిణికి ఓటర్స్‌డే అవార్డ్

- దివ్యాంగుల ఓటు హక్కు కోసం శ్రమించిన టీడబ్ల్యూడీఎస్సీ డైరక్టర్ శైలజ • రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ అధికారిణి శైలజ ప్రతిష్ఠాత్మక నేషనల్ ఓటర్స్ డే అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డ్ అందుకున్నారు. ఏ ఒక్క ఓటరూ మిగిలిపోరాదు అన్న లక్ష్యంతో ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో విశేష కృషి చేసిన 10 మంది అధికారులను కేంద్ర ప్రభుత్వం అవార్డులతో సత్కరించింది. అందులో తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ ఆఫ్ డిసేబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్ విభాగం డైరక్టర్‌గా పనిచేస్తున్న శైలజ అంధులు, దివ్యాంగుల ఓటు హక్కుపై విశేష కృషి చేశారు. స్పెషల్ కేటగిరీ కింద ఆమెకు ఈ అవార్డును అందజేశారు. రాష్ట్రపతి భవన్లో అవార్డు అందుకున్న తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఓటు హక్కు విషయంలో వైకల్యం అడ్డు కారాదన్నదే తమ నినాదంగా పనిచేశామని తెలిపారు. దేశంలోని తొలిసారి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో అంధులైన ఓటర్లకు ఎపిక్ కార్డు అందించామని అన్నారు. ఓటు హక్కు వినియోగంపై బ్రెయిలీ లిపిలో అంధులకు అవగాహన, శిక్షణనిచ్చామని ఆమె తెలిపారు. అలాగే బధిరులు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ బూత్ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు ఆమె వివరించారు. దాదాపు 21 విభాగాల్లో దివ్యాంగులకు ఓటు హక్కు కల్పించాలన్నదే తమ లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. కేవలం 45 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2.75 వేల దివ్యాంగులైన ఓటర్లను గుర్తించినట్టు ఆమె వెల్లడించారు.

తెలంగాణలో 90% ఓటింగ్ జరగాలి

జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం ఓటింగ్ జరగాలని గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ ఆకాంక్షించారు. ఓటు అందరి హక్కు అని, ప్రభుత్వాన్ని, గవర్నర్ వ్యవస్థను నిందించకుండా అందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలింగ్ రోజున ఓటింగ్‌లో అందరూ పాల్గొనాలనే ఉద్దేశ్యంతో ఆ రోజు సెలవు ప్రకటిస్తారని, ఈ నేపథ్యంలో ఓటర్లు ఆరోజు ఇంట్లో విశ్రాంతి తీసుకోకుండా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలని ఆయన వివరించారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం రవీంద్రభారతిలో 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ నరసింహన్ ఓటర్ల హెల్ప్ లైన్ నెంబర్ 1950 ను ప్రారంభించారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను ప్రదానం చేశారు. అలాగే, ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్‌ను అభినందించారు. అలాగే రాష్ట్రంలో కొనసాగుతున్న పంచాయితీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో గ్రామీణ ఓటర్లు పాల్గొనడం సంతోషకరమంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి పనితీరును ప్రశంసించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించినందకు ఎక్సైజ్ కమిషనర్ సోమేష్ కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ దాన కిషోర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, అదనపు సీఈవో జ్యోతి బుద్ధ ప్రకాశ్, జాయింట్ సిఈవో అమ్రపాలి గవర్నర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అలాగే ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్ ఓటర్లు, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలను గవర్నర్ నరసింహన్ అందేశారు.

అనంతరం గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ.. భారత దేశ ఎన్నికల వ్యవస్థను అనేక దేశాల ప్రతినిధులు అధ్యయనం చేసి ప్రశంసించారని గుర్తు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొనేందుకు ప్రత్యేక సదుపాయాలను కల్పించిన ఎన్నికల సంఘాన్ని అభినందించాలన్నారు. తొలిసారి ఓటింగ్‌లో పాల్గొంటున్న ఓటర్లు ఎలాంటి ప్రభావాలకు గురికావద్దని ఆయన సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ మాట్లాడుతూ.. పారదర్శకంగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించి, పోలింగ్ శాతాన్ని పెంచగల్గామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, రిపోలింగ్ జరిపే అవసరం లేదన్నారు.

త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని, అర్హత ఉన్న వారందరూ ఫిబ్రవరి నాల్గొవ తేదీ లోగా పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి విడత పంచాయితీ ఎన్నికలు పూర్తి అయ్యాయని, రెండవ విడత పోలింగ్‌లో 90 శాతం ఓటింగ్ నమోదు అవుతుందన్నారు. భారత దేశం గొప్ప ప్రజాస్వామ్య దేశమని, ఇక్కడ అందరూ కలిసి మెలిసి ఉంటారన్నారు. ఏ రంగంలోనైనా భారత దేశం టాప్ టెన్‌లో ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యం లేని దేశంలో ఎన్ని వనరులు ఉన్నప్పటికీ ఇబ్బందులు తప్పవన్నారు.

నేతల ఆరోపణలపై స్పందించను



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తనపై రాజకీయ నేతలు తనపై చేసే ఆరోపణలపై స్పందించబోనని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి డాక్టర్ రజత్ కుమార్ స్పష్టం చేశారు. తననే లక్ష్యంగా చేసుకుని ఆధారాలు లేని ఆరోపణ చేస్తే ఎట్లా అని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లోపాలు లేకుండా పనిచేస్తామన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అదనపు ఎన్నికల అధికారి జ్యోతి బుద్ధ ప్రకాశ్, జాయింట్ సిఈవో అమ్రపాలితో కలిసి రజత్ కుమార్ మాట్లాడారు.. ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలో 1982 నుంచి ఈవీఎంలు వాడుతున్నామని చెప్పారు. ఈవీఎంలపై వివాదం అనవసరమని, ట్యాంపరింగ్ సాధ్యం కాదని అనేక సందర్భాల్లో నిరూపించామని ఆయన తెలిపారు. ఈవీఎంల వినియోగంలో లోపాలు లేవని కేంద్ర ఎన్నికల సంఘం కూడా స్పష్టత ఇచ్చిందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన ఎమ్మెల్యే అభ్యర్థులు జమాఖర్చులు వివరాలు వెల్లడించేందుకు ఈనెల 26 చివరి తేదీ అని చెప్పారు. ఇంకా 72 మంది లెక్కలు సమర్పించాల్సి వుందని వారందరికీ నోటీసులు జారీ చేశామన్నారు. వారు లెక్కలు సమర్పించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా సమయముందన్నారు. సోషల్ మీడియాపై నియంత్రణ కష్టమైనప్పటికీ వీలైనంత మేరకు నియంత్రించగల్గామని ఆయన చెప్పారు. ఓటర్ల నమోదు సహా అన్ని సమస్యల పరిష్కారానికై 1950 నెంబర్‌తో కాల్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ఒ.పి. రావత్‌కు హైదరాబాద్‌లో ఓటు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని, దీనిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఓటుకు ఓటేద్దాం

- ప్రజాస్వామ్యస్ఫూర్తిని చాటుదాం • 9వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలో ఎమ్మెల్యే హరీష్‌రావు



సిద్దిపేట, ప్రభన్యూస్: ప్రతి ఒక్కరు విధిగా ఓటేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటి చెప్పాలని, అవసరమైతే తప్పనిసరిగా ఓటు వేయాలని చట్ట సవరణ చేయాల్సి వచ్చే అవకాశమున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. శుక్రవారం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటర్లలో చైతన్యాన్ని కల్పించేలా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దేశంలోనే అతిపెద్ద మోడల్ ఈవీయం పెయింటింగ్ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశ పౌరుడైన నేను ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాతయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడుతానని, జాతి, మతం, ప్రాంతం, కులం, వర్గం, భాషలేదా ఎలాంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదని, ఈ దేశంలో ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్క పౌరుడు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఈవీయం పెయింటింగ్ వేసి జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకోవడం చాలా సంతోషమని, దేశంలోనే లక్ష మెజారిటీతో గెలిపించిన ప్రజలు సిద్దిపేట ఖ్యాతిని చాటి చెప్పినట్లుగానే అతిపెద్ద ఈవీయం పెయింటింగ్ వేసిన నిర్వాహకులు విజయ్‌కలాంను అభినందించారు. ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ఓటును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్‌లు చిప్ప ప్రభాకర్, వైబ్రెంట్స్ కలాం ఆర్గనైజేషన్ ప్రతినిధులు విజయ్‌కలాం, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

రెండేళ్ల బాలికపై అత్యాచారం భాగ్యనగరంలో ఘోరం

- బాధితురాలి బంధువులు, గ్రామస్థుల ఆందోళన
- నిందితుడికి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత



నిందితుడు మొయినుద్దీన్

హైదరాబాద్ (దుండిగల్), ప్రభన్యూస్: నిండా రెండేళ్లయినా లేని చిన్నారిని చిదిమేశాడో కామాంధుడు. మానవత్వాన్ని మంటగలిపిన ఓ ఆటో డ్రైవర్ అరాచకం బయటకు పొక్కడంతో జనం ఆగ్రహోదగ్రులయ్యారు. నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఉరిశిక్ష వేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. మేడ్చెల్ జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జహీరాబాద్ ప్రాంతానికి చెందిన మొయినుద్దీన్ (33) కైసర్‌నగర్‌కు వలసవచ్చి ఆటో నడుపుకుంటున్నాడు. అతడితో వేగలేక మొదటి భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. రెండోభార్యతో కలిసి ఉంటున్న మొయినుద్దీన్ గురువారం రాత్రి పొద్దుపోయాక ఇద్దరు మిత్రులతో కలిసి తప్పతాగాడు. పక్కింట్లో ఉంటున్న అభం, శుభం తెలియని రెండు సంవత్సరాల బాలికను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికకు రక్తస్రావం కావడం, చిన్నారి బాధతో అరవడంతో కుటుంబ సభ్యులు గమనించి ఆ నిర్జన ప్రదేశానికి వెళ్లి చూడగా.. అచేతనంగా పడి ఉండడం చూసిన తల్లిదండ్రులు జరిగిన ఘోరాన్ని తెలుసుకుని గుండెలవిసేలా రోదించారు. స్థానికుల సహకారంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి దేహశుద్ధి చేసి దుండిగల్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలియడంతో కైసర్‌నగర్, దుండిగల్ పరిసర ప్రాంతాలు అట్టుడికాయి. కుటుంబసభ్యులకు మద్దతుగా వందలాది తరలివచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలంటూ దుండిగల్ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. బాలానగర్ ఏసీపీ గోవర్ధన్, దుండిగల్ సీఐ శంకరయ్య స్థానికులు, కుటుంబసభ్యులతో చర్చించి నిందితుడిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అయితే మొయినుద్దీన్‌తో మరో ఇద్దరు కూడా మద్యం సేవించారని, వారు కూడా లైంగిక దాడికి పాల్పడ్డారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడిని విచారిస్తున్నామని, దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తామని సీఐ చెప్పారు. కాగా నిందితుడిపై ఫోక్సో చట్టం ప్రకారం ఉరిశిక్ష పడేలా కేసు నమోదు చేసి చార్జిషీట్ అత్యంత వేగవంతంగా దాఖలు చేయాలని బాలల హక్కుల సంఘం గౌరవ అధ్యక్షుడు అచ్యుత్‌రావు డిమాండ్ చేశారు.

అమెరికాలో కాల్పులు.. ఒకరి మృతి



పెన్సిల్వేనియా, యూఎస్ఏ: అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఓ హోటల్ బార్‌లో కాల్పుల కలకలం రేగింది. సాయుధుడైన ఓ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఓ వ్యక్తిని తుపాకీతో కాల్చిచంపాడు. ఈ దాడిలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలం నుంచి కారులో పారిపోయిన దుండగుడు ఓ ఇంట్లో చొరబడ్డాడు. ఇంట్లోని వ్యక్తిని తుపాకీతో కాల్చి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం తనని తాను తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. జోర్డాన్ విట్మేర్ అనే 21 ఏళ్ల యువకుడు ఈ కాల్పులకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. అయితే ఘటన జరిగిన బార్‌లో హంతకుడితో సంబంధముందని భావిస్తున్న ఓ మహిళ ఉందని పోలీసులు వెల్లడించారు.

విభజిస్తాం.. రండి!

- రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారంపై కేంద్ర హోంశాఖ నుంచి రెండు తెలుగురాష్ట్రాలకు లేఖలు
- ఎనిమిది అంశాలతో ఎజెండా
- ఫిబ్రవరి 1న రావాలని సీఎస్‌లకు సూచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. జటిలమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నిర్ణయించిన కేంద్ర హోంశాఖ ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఫిబ్రవరి 1న ఢిల్లీకి రావాలని సమాచారమందించింది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్, విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తులతో సహా పలు సంస్థల అంశాలపైఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్న ట్టు తెలుస్తోంది. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ లేఖలను అందుకున్న ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎదుట చర్చించా ల్సిన అంశాలపై ఇప్పటికే దృష్టి సారించినట్టు తెలుస్తోంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లలో పొందుపరిచిన సంస్థల విభజనకు సంబంధించి ఇప్పటికే పదికిపైగా సమావేశాలను కేంద్ర హోంశాఖ నిర్వహించింది. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ ఎల్ నరసింహన్ సమక్షంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన మంత్రుల బృందం సమా వేశమైనప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. కాగా ఇటీవల ఢిల్లీ వెళ్ళిన తెలంగాణ సీఎం కేసీఆర్ విభజన చట్టంలోని సమస్యలను పరిష్కరించాలని ప్రధాని నరేంద్ర మోడీని కలిసి వినతిపత్రం అందజేసిన సంగతి తెలిసిందే. ఏపీ సీఎం చంద్రబాబు సైతం ప్రధాని మోడీకి లేఖ రాస్తూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఇటీవల ఢిల్లీ వెళ్ళిన సమయంలో ఇవే అంశాలను ప్రధాని మోడీ, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే ఇబ్బందులు తప్పవన్న సంకేతాలను గవర్నర్ ఇవ్వడంతో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని ఫిబ్రవరి 1న ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

- హోంమంత్రిత్వశాఖ నుంచి అందిన లేఖలు
- ఏపీభవన్, సింగరేణి, విద్యుత్ బకాయిలు, ఏపీఎస్ఎఫ్‌సీ విభజన కీలకం
- 50:42 నిష్పత్తిలో ఆస్తులు పంచాలంటున్న ఏపీ.. ససేమిరా అంటున్న తెలంగాణ
- 9,10 షెడ్యూల్ సంస్థల విభజనపై చర్చ

8 అంశాలపై దృష్టి

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 ప్రకారం పరిష్కారం కావాల్సిన ద్వైపాక్షిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించను న్నట్టు రెండు ప్రభుత్వాలకు అందిన లేఖలో కేంద్ర హోం శాఖ పేర్కొంది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన, సింగరేణి బొగ్గు గనుల సంస్థ, ఏపీహెచ్ఎంఈఎల్, విద్యుత్ బకాయిల చెల్లింపులు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్థ విభజన, గిరిజన విశ్వవిద్యాల యం, ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహ్యాండ్స్ శిక్షణా సంస్థ ఏర్పాటు వంటి పది సంస్థల విభజనతో సహా 9వ షెడ్యూల్‌లోని 40 సంస్థలకు చెందిన ఆస్తులు, అప్పులపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ భవన్ విభజనపై గత ఏడాది మే 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు ప్రతిపాదనలు చేయగా, వాటిని తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోపాటు ఇంతవరకు స్పందించలేదని తెలుస్తోంది. సింగరేణి బొగ్గు గనుల సంస్థ రెండు రాష్ట్రాలకు చెందినదని, జనాభా ప్రాతిపదికన ఏపీకి 58 శాతం, తెలంగాణకు 42 శాతం వాటా దక్కేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఏపీ సర్కార్ కోరుతోంది. ఏపీహెచ్ఎం ఈఎల్ సంస్థను తమకు కేటాయించాలని ఏపీ సర్కార్ కోరుతుండగా అందుకు తెలంగాణ ససేమిరా అంటున్నట్టు చెబుతున్నారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి త్వ శాఖ ఇప్పటికే న్యాయశాఖ అభిప్రాయాన్ని కోరినట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఏపీఎస్ఎఫ్‌సీ) విభజనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపగా హోంశాఖ ఈ అంశంపై అభిప్రాయం కోరుతూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగానికి లేఖ రాసినట్టు తెలుస్తోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసుపై వచ్చిన తుది తీర్పును అన్ని సంస్థలకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఉన్నత విద్యామండలి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నిధులన్నింటినీ ఏపీకి చెందేలా సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. తెలం గాణ భూభాగంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, నిధులు, ఆస్తులు జనా భా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో పంచాలని ఏపీ ప్రభుత్వం కోరుతుండగా, ఇక్కడున్న సంస్థలు ఈ రాష్ట్రానికే చెందుతాయని, ఏపీలో ఉన్న సంస్థలు ఆ ప్రభుత్వం తీసుకోవచ్చని ఎటువంటి ఇబ్బంది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. తమ భూభాగంలో ఉన్న సంస్థలన్నీ తమకే చెందుతాయని ఇదివరకే తెలంగాణ సర్కార్ స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ఉన్నత విద్యామండలి కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు అమలు కాకపోవడంతో మిగతా సంస్థల విభజన, ఆస్తుల పంపకం అట్లాగే ఆగిపోయిం దని కేంద్రం జోక్యం చేసుకుం టే తప్ప ముందుకు సాగే అవకాశం లేదని అధికారులు అంటున్నారు.

కేంద్రంపై ఒత్తిడి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. 9వ షెడ్యూల్ లోని ఆస్తులు, అప్పుల విభజ నకు సంబంధించి నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను ఏపీ ప్రభుత్వం ఆమోదించిం దని తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాలపై ఎటువంటి స్పంద న కనబరచడం లేదని ఏపీ ప్రభుత్వ అధికారులు చెబుతు న్నారు. తెలంగాణ ప్రభుత్వం తమకు వేలకోట్ల రూపాయల విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఏపీ ప్రభుత్వం చెబుతుంటే తమ రాష్ట్రంలోని ఏడు మండలాలను ఏపీ ప్రభుత్వం బలవంతంగా లాక్కొని వెళ్ళిందని సీలేరు ప్రాజెక్టులో తమకు కూడా వాటా ఉందని తెలంగాణ ప్రభుత్వం వాది స్తున్న సంగతి తెలిసిందే. 9, 10 షెడ్యూ ల్‌లోని ఆస్తులు, ఉద్యోగుల విభజన జరగకపో వడంతో ఏపీలో పనిచేస్తున్న తెలంగా ణ ఉద్యోగులు, తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలున్నాయి. ఏపీ ఉన్నత విద్యామం డలి విజయవాడకు తరలివెళ్ళినా అందులో పనిచేస్తున్న ఆ ప్రాంత ఉద్యోగులు మాత్రం తెలంగాణ ఉన్నత విద్యామండలిలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏపీకి వస్తామంటే అక్కడి అధికారులు స్పందించడం లేదని ఇక్కడి నుంచి వెళదామనుకుంటే ఉద్యోగ ఊడుతుందన్న భయం తమను వెంటాడుతోందని వారంటున్నారు. ఇలా ఒక సంస్థలో కాకుండా అన్ని సంస్థల్లోనూ పరిస్థితి ఇలాగే ఉందని ఇరు ప్రభుత్వాలు కలిసి కూర్చుని చర్చలు జరిపితే అటు ఇటుగా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్న ధీమాతో అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

నెలాఖరులో అఖిలేష్ రాక?

- హైదరాబాద్‌లో కేసీఆర్‌తో భేటీ
- ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి కె.చం ద్రశేఖర రావుతో చర్చించేందుకు సమాజ్‌వాది జాతీయ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ త్వరలో హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నెలాఖరులో వచ్చి కేసీఆర్‌తో రాజకీయ చర్చలు జరుపుతారని తెలుస్తోంది. భాజపా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రం ట్ ఏర్పాటు చేయడంలో భాగంగా కేసీఆర్ ఇప్ప టికే కొందరు ప్రాంతీయ పార్టీ నేతలను కలిసిన విషయం తెలిసిందే. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అఖిలేష్‌లను కలిసి ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించారు. ఫ్రంట్ ఏర్పా టుకు ఒక రూపం ఇచ్చేందుకు మరోసారి అందరినీ కలిసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో అఖిలేష్ యాదవ్‌ను కలిసి మరోసారి సమావేశం కావాలని కోరారు. తానే హైదరాబాద్ వస్తానని, ఫ్రంట్ విషయంపై చర్చిద్దామంటూ అఖి లేష్ ఈ సందర్భంగా చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈనెల చివరిలోగా హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం. మరోవైపు భాజపాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి ఒక కూటమిని ఏర్పాటు చేయాలని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సహా ప్రాంతీయ పార్టీల నేతలందరినీ ఇప్పటికే కలిసి చర్చలు జరిపారు. ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల కోల్‌కతాలో ఇటీవల నిర్వహించిన భారీ బహిరంగ సభకు 22 పార్టీల నేతలను ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సభకు హాజరు కాలేకపోయారు.

భాజపా, కాంగ్రెస్ లేకుండా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని కేసీఆర్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తో కలిపి ఫ్రంట్ ఏర్పాటుచేసే దిశగా చంద్రబాబు కూడా అన్ని ప్రతిపక్షాలను కూడగడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఫ్రంట్ల ఏర్పాటుకు వేర్వేరుగా చేస్తున్న ప్రయత్నాలకు ప్రాంతీయ పార్టీల నేతలు ఇద్దరికీ మద్దతు ఇస్తున్నారు. అయితే ఎవరి నేతృత్వంలో ఫ్రంట్ ఏర్పాటవుతుందో అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రతిపక్షాలను ఏకమవుతున్న తరుణంలో త్వరలో ఫ్రంట్ ఏర్పాటుకు తుదిరూపం రానున్నట్టు స్పష్టమవుతోంది.

పాక్ బృందానికి భారత్ అనుమతి

న్యూఢిల్లీ: చీనాబ్ నది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను పరిశీలించేందుకు పాకిస్తాన్‌కు చెందిన ముగ్గురు ప్రతినిధుల బృందం భారత్ రానుంది. జనవరి 27 నుంచి ప్రాజెక్టులను పరిశీలించనుంది. సింధూ జలాల ఒప్పందంలో భాగంగా ప్రాజెక్టులను పరిశీలించే హక్కు పాకిస్తాన్‌కు ఉంది. హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు 1960లో ఇరు దేశాలు ఈ ఒప్పందాన్ని ఇరుదేశాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా శాశ్వత సింధూ కమిషన్(పర్మినెంట్ ఇండస్ కమిషన్)ను ఏర్పాటు చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు గతేడాది ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాక్ విజ్ఞప్తికి భారత్ అంగీకరించింది. భారత్‌లోని చీనాబ్ నది పరివాహక ప్రాజెక్టులను పరిశీలించేందుకు భారత్ అంగీకరించింది. ఇరు దేశాల మధ్య బంధాలలో ఇది పురోగతి అని పాకిస్తాన్ నీటి వనరులశాఖ మంత్రి ఫైసల్ వావ్డా ట్వీట్ చేశారు. ఇరు దేశాల్లోని ప్రాజెక్టులను సందర్శించాలని చివరిసారిగా జరిగిన సమావేశంలో ఇరుదేశాల సింధూ కమిషనర్ల ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

పాలమూరు ప్రాజెక్టు ఇక పరుగులే! ఆఖరి అనుమతి వచ్చేసింది



(మొదటిపేజీ తరువాయి)

డివిజన్‌లో ఉన్న 205.4811 హెక్టార్ల అటవీ భూమిని సాగునీటి శాఖకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి 2017, మే నెలలో లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను ఫారెస్ట్ అడ్వయిజరీ కమిటీ (ఎఫ్ఏసీ) పరిశీలించి 2018, ఏప్రిల్ నెలలో మొదటి దశ అటవీ అనుమతిని మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం విధించిన అన్ని విధి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేసిన కారణంగా కేంద్ర పర్యావరణ అటవీశాఖకు ప్రాజెక్టుకు తుది అటవీ అనుమతిని మంజూరు చేసింది.

టన్నెల్ తవ్వకానికి తొలగిన అడ్డంకి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో నిర్మాణమవుతున్న మొదటి స్టేజి పంప్‌హౌస్, నార్లపూర్ వద్ద అంజనగిరి జలాశయం నిర్మాణం, నార్లపూర్ అంజనగిరి - ఏదుల వీరాంజనేయ జలాశయం మధ్య టన్నెల్ తవ్వకానికి ఈ అటవీ భూముల బదిలీ అవసరమైంది. ఈ అనుమతితో 204.48 హెక్టార్ల అటవీ భూమి పాలమూరు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు ఆధీనంలోకి రానున్నది. ప్రాజెక్టు పనుల పురోగతికి ఈ అనుమతి దోహదం చేయనున్నది. పర్యావరణ అనుమతికి సంబంధించి ఇప్పటికే స్టేజ్-1 అనుమతి పొందిన సంగతి తెలిసిందే. తుది పర్యావరణ అనుమతి కోసం పర్యావరణ ప్రభావ నివేదికను సాగునీటిశాఖ తయారు చేస్తున్నది. త్వరలోనే ఈ నివేదికను కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖకు సమర్పించనున్నది. అటవీ పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులను కొనసాగిస్తున్నారని, కాబట్టి ఈ పనులను వెంటనే ఆపాలని ఎన్‌జీటీలో కేసులు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం తాగునీటి సరఫరా కోసం మాత్రమే పనులను చేపట్టిందని, పర్యావరణ, అటవీ అనుమతులు పొందిన తర్వాతనే సాగునీటి పనులను చేపడుతుందని ఎన్‌జీటీ తెలిపింది. ఈ కేసుల నేపథ్యంలో మంజూరైన అటవీ అనుమతి కీలకమైన ముందడుగుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ టర్మ్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా పరిగణించి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 6న సాగునీటి శాఖ అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సహస్ర చండీయాగం తుదిరోజున ఈ సమాచారం తెలుసుకున్న కేసీఆర్ హర్షం వ్యక్తంచేస్తూ కేంద్ర అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపాడు. ఈ కృషిలో పాలుపంచుకున్న నీటి పారుదల అధికారులను కూడా సీఎం అభినందించారు.

ఇదీ ప్రాజెక్టు.. ఆయకట్టు

తొలుత ప్రాజెక్టుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినపుడు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి మూడు జలాశయాల్లో నిల్వ చేయాలని నిర్దేశించారు. 10 లక్షల 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును రూపొందించారు. జూరాల జలాశయంపై ఇప్పటికే అధిక భారం ఉండడంతో ఈ చిన్న జలాశయం నుంచి రోజుకు 1.5 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం సాంకేతిక సాధ్యంకాదని ప్రభుత్వం భావించింది. అందుకు తోడు ప్రతిపాదించిన కోయిల్‌కొండ (76 టీఎంసీలు), గండీడు (35 టీఎంసీలు), కేపీ లక్ష్మీదేవిపల్లి (10 టీఎంసీలు) జలాశయాల్లో మొత్తం 47 గ్రామాలు, 85వేల జనాభా, 16,340 ఆవాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ భారీ ముంపును తగ్గించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ రెండు కారణాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. ఆ తర్వాత ప్రాజెక్టు ప్రతిపాదనల్లో కూడా కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధానమైన మార్పు నీటి సోర్స్ జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి మారడం. కొత్త జలాశయాలను ప్రతిపాదించడం, డంపింగ్ సామర్థ్యాన్ని రోజుకు 1.5 టీఎంసీల నుంచి 2 టీఎంసీలకు పెంచడం, ఆయకట్టు విస్తీర్ణం 10 లక్షల ఎకరాల నుంచి 12.30 లక్షల ఎకరాలకు పెంచడం లాంటివి జరిగాయి. గతంలో కంటే కొత్త డిజైన్ ప్రకారం నిర్మించే ప్రాజెక్టు ద్వారా ముంపు ప్రాంతం గణనీయంగా తగ్గింది.

ఆయకట్టు వివరాలు

జిల్లా ఆయకట్టు	ఆయకట్టు మండపాలు	ఆయకట్టు గ్రామాలు	ఎకరాలు
మహబూబ్‌నగర్	39	718	7 లక్షలు
రంగారెడ్డి	20	400	5 లక్షలు
నల్గొండ	3	13	30వేలు
మొత్తం	62	1,131	12.30 లక్షలు

లిఫ్టుల వివరాలు

లిఫ్టు	లిఫ్టు ఎత్తు	పంపుసామర్థ్యం (క్యూసెక్కులు)	ఆయకట్టు ఎకరాలు
లిఫ్టు-1	104 మీ	85	-
లిఫ్టు-2	124 మీ	75	-
లిఫ్టు-3	121 మీ	75	12,30,000
లిఫ్టు-4	123 మీ	75	9,55,000
లిఫ్టు-5	69 మీ	55	4,13,000

ఆన్‌లైన్ జలాశయాలు

జలాశయం	ముంపు ఎకరాలు	ముంపు కట్టడాలు	ముంపు ప్రాంతాలు
అంజనగిరి నార్లాపూర్	2490	218	4 తండాలు
వీరాంజనేయ ఏదుల గ్రామం	4338	434	ఒక గ్రామం ఒక తండా
వెంకటాద్రి వట్టెం గ్రామం	4245	259	5 తండాలు
కురుమూర్తిరాయ కరివెన గ్రామం	6374	188	4 తండాలు
ఉద్దండపూర్	5297	1275	2 గ్రామాలు 6 తండాలు
కేసీ లక్ష్మీదేవిపల్లి పద్మారం	1340	0	0
మొత్తం	24084	2374	3 గ్రామాలు 20 తండాలు

జలాశయ వివరాలు

జలాశయం	గరిష్ట నీటిమట్టం	నీటి నిల్వ టీఎంసీ	ఆయకట్టు ఎకరాలు
అంజనగిరి నార్లాపూర్	+ 345 మీ	8.61	-
వీరాంజనేయ యేదుల గ్రామం	+ 445 మీ	6.55	-
వెంకటాద్రి వట్టెం గ్రామం	+ 542 మీ	16.58	1,29,000
కురుమూర్తిరాయ కరివెన గ్రామ	+ 531 మీ	19.15	1,46,000
ఉద్దండపూర్	+ 629 మీ	15.91	5,42,000
కేపీ లక్ష్మీదేవిపల్లి	+ 670 మీ	2.80	4,13,000
మొత్తం	12,30,000		69.60

నదుల పునరుజ్జీవంపై నెలాఖరులో నివేదిక

- ఎన్‌జీటీ ఉత్తర్వులు జారీ చేయకముందే రాష్ట్ర ప్రాజెక్టులపై నివేదిక పంపుదాం
- అధికారులకు సీఎస్ జోషి ఆదేశం
- నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన ముసాయిదా నివేదికపై సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో నదుల పునరుజ్జీవంపై ఈ నెలాఖరులోగా నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఉత్తర్వులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక ఉండాలని సూచించారు. నదుల పునరుజ్జీవంపై నేషనల్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన ముసాయిదా నివేదికపై శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ముసాయిదాపై ఎన్‌జీటీ ఉత్తర్వులు జారీ చేయకముందే పర్యావరణ పరిరక్షణతో ప్రజలకు నాణ్యమైన జీవితాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గురించి నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ప్రాజెక్టుల నిర్మాణం, పార్కుల ఏర్పాటు తదితర అంశాలన్నింటినీ నివేదికలో పొందుపర్చాలని చెప్పారు. రాష్ట్రంలో 8 నదుల్లో ఉన్న కాలుష్యాన్ని గుర్తించి కేంద్రానికి నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల కాలుష్యం, పట్టణాలు, నగరాల్లో నిత్యం వెలువడే మురుగునీటి కాలుష్యం, జనాభా, భూగర్భ జలాలపై వాటి ప్రభావం లాంటి అను బంధ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో మనదుల పునరుజ్జీవంపై తీసుకోవాల్సిన చర్యలునిధుల అవసరం, ఎస్టీపీల నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను గురించి సీఎస్ జోషి అధికారులతో చర్చిం చారు. ఈ అంశాలపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు సమర్పించేందుకు గానూ మూడేళ్ళ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణా రావు, పురపాలకశాఖ ముఖ్య యకార్యదర్శి అరవింద్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణ, టీఎస్ ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, ఈపీటీఆర్ఐ డీజీ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ పోస్టుపై ఆగ్రహం.. నిర్మాతపై దాడి

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి అన్నీ వయసుల మహిళ ప్రవేశంపై ఫేస్‌బుక్ వేదికగా తన అభిప్రాయాలను తెలియజేసిన మలయాళ నటుడు, నిర్మాత ప్రియనందన్‌పై దాడి జరిగింది. త్రిస్సూర్‌లోని తన నివాసం వెలుపల శుక్రవారం ఉదయం ఈ దాడి జరిగింది. ఇంటి నుంచి బయటకు వచ్చిన ప్రియనందన్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. ఒక చెంపదెబ్బ కొట్టాడు. అనంతరం ఆవు పేడ కలిపిన నీళ్లను ప్రియనందన్‌పై కుమ్మరించాడు. జనాలు అక్కడికి చేరుకునేలోగానే అక్కడి నుంచి ఉడాయించాడు. అయ్యప్పకు వ్యతిరేకంగా మాట్లాడడానికి తనను ప్రశ్నించాడని ప్రియనందన్ వెల్లడించారు. యువకుడికి సంబంధించిన ఆనవాళ్లను తెలియజేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపిన పోలీసులు దాడి చేసిన 25 ఏళ్ల సరోవర్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తానే దాడి చేశానని యువకుడు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు.

ఫేస్‌బుక్ పోస్టుపై దుమారం




అయ్యప్ప ఆలయం లోకి మహిళలపై ప్రవేశంపై తన అభిప్రాయాలను తెలి యజేస్తూ ఫేస్‌బుక్‌లో ప్రియ నందన్ పెట్టిన పోస్టు పెద్ద దుమారాన్నే రేపింది. ఆయన వాడిన భాషపై అయ్యప్ప భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రియనందన్ ఇంటి వద్ద బీజేపీ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ పోస్టుపై అనేక మంది అభ్యంత రం వ్యక్తం చేయడంతో కొద్ది సేపటి తర్వాత ప్రియనందన్ తన ఫేస్‌బుక్ పోస్టును డిలీట్ చేశారు.

అసహనానికి సూచిక ఇది

నిర్మాత ప్రియనందన్ ఫేస్‌బుక్ పోస్టు, ఆయనపై జరిగిన దాడిపై కేరళ సీఎం విజయన్ స్పందించారు. ప్రియనందన్‌కు బెదిరింపు హెచ్చరికలు వస్తున్నాయన్నారు. కేరళలో పెరుగుతున్న అసహనానికి ఇది సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘటనలో ఏం జరిగిందో పరిశీలించాల్సి ఉందన్నారు. ఇలాంటి ఘటనలను సమర్థించకూడదన్నారు.

కాంగ్రెస్‌లోకి వరుణ్ గాంధీ..?



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలతో ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగిన తర్వాత కీలక నాయకులు ఎప్పుడు ఏ పార్టీలోకి మారుతారోనన్న ఊహాగానాలు వస్తున్నాయి. బీజేపీ నాయకుడు వరుణ్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల రాహుల్ గాంధీ ఈ విషయంపై హింట్ ఇవ్వడం వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో వెళ్లనున్నారన్న వార్తకు బలం చేకూరింది. గాంధీ- నెహ్రూ కుటుంబాన్ని ఏకం చేసేందుకు వరుణ్ గాంధీ కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారా.. అని ఉత్పన్నమైన ప్రశ్నకు రాహుల్ సమాధానమనిస్తూ.. అలాంటి ఊహాగానాలు తనకు తెలియదని రాహుల్ బదులిచ్చారు. రాహుల్ గాంధీ, వరణ్ గాంధీ ఇద్దరూ అన్నాదమ్ముల కుమారులు. వరణ్ గాంధీ ప్రస్తుతం ఉత్తర్ ప్రదేశ్‌లోని సుల్తాన్ పూర్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా ఉన్నారు.వరుణ్ గాంధీ తల్లి మేనకాగాంధీ కేంద్ర కేబినెట్ మంత్రిగా కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో వరుణ్ గాంధీ బీజేపీనుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తే పరిస్థితులు ఎలా ఉండొచ్చన్నదానిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

అద్వానీ, జోషి పోటీ?



న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీనియర్ల బెర్తులు భద్రమేనా..? 75 ఏళ్లు దాటిన వారు కేంద్ర కేబినెట్ మంత్రులుగా ఉండొద్దంటూ మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ఎంపీలుగానే కొనసాగుతున్న సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీ(91), మురళీ మనోహర్ జోషి(84) వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి బరిలోకి దిగబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది.. 2014 లోక్‌సభ ఎన్నికల్లో అద్వానీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లోని గాంధీనగర్‌నుంచి బరిలోకి దిగి విజయం సాధించగా.. జోషి తనకు కంచుకోటలాంటి వారణాసి స్థానాన్ని జోషి మోడీ కోసం వదిలి.. కాన్పూర్ నుంచి పోటీ చేసి గెలిచారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న కాలంలోనే అద్వానీ, జోషిలు బీజేపీలో అత్యంత కీలక పదవులు పోషించారు. మార్గదర్శక్ మండల్ (సలహాకమిటీ)లో సభ్యులుగా ఉన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగేళ్లలో ఆ కమిటీ ఒక్కసారి కూడా భేటీ కాలేదు. గత ఎన్నికల తర్వాత లోక్‌సభ స్పీకర్‌గా సేవలందిస్తారనుకున్నప్పటికీ.. ఆ పదవి సుమిత్రా మహజన్ అలంకరించారు. ఇక పార్లమెంటరీ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఉన్న జోషి ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నారు. పార్టీలోనూ ఆయన అసౌకర్యంగానే కొనసాగుతున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తర్వాత అద్వానీ,జోషి, యశ్వంత్ సిన్హా లాంటి సీనియర్లు మోడీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ లేఖ రాశారు. సీనియర్లు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది వారి నిర్ణయానికి వదిలిపెట్టినట్లు బీజేపీ అధినాయకత్వం చెబుతున్నా.. ఎన్నికల నాటికి ఎవరి బెర్త్ ఎక్కడ అనేదానిపై స్పష్టత లేదు.

కొత్త బెంచ్‌కి అయోధ్య కేసు



న్యూఢిల్లీ: అయోధ్య కేసు విచారణకు ఐదుగురు సభ్యులతో కొత్త బెంచ్‌ను సీజే జస్టిస్ రంజన్ గొగొయ్ నియమించారు. జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్‌లను బెంచ్‌లోకి కొత్తగా తీసుకున్నారు. సీజే నేతృత్వం వహించనున్న ఈ బెంచ్‌లో జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్ సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ కేసు విచారణ క్రమం, తేదీలను జస్టిస్ గొగొయ్ నిర్ణయిస్తారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలో అయోధ్య కేసుపై ఇదివరకు విచారణ జరిపిన త్రిసభ్య బెంచ్‌లో జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్ సభ్యులుగా ఉన్నారు. అయోధ్యతో సంబంధమున్న ఓ కేసులో గతంలో లాయర్‌గా పనిచేయడంతో జస్టిస్ యూయూ లలిత్ బెంచ్ నుంచి స్వచ్ఛంధంగా తప్పుకున్న సంగతి తెలిసిందే. చివరిసారిగా జనవరి 10న జరిగిన విచారణలో ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ్ కొత్తగా నియమించిన బెంచ్‌లో కొనసాగడం లేదు.

10శాతంపై పరిశీలిస్తాం..

ఆర్థికంగా వెనుబడిన అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని పరిశీలించాలని దేశసర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 103వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లకు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన బెంచ్ ఈ నోటీసులను జారీ చేసింది. రిజర్వేషన్ల విషయాన్ని పరిశీలిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వానికి నాలుగు వారాల గడువిచ్చామని బెంచ్ వెల్లడించింది.

14మందికి పోలీస్ పతకాలు

ఏపీలో 17మందికి మెడల్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 2019 ఇండియన్ పోలీస్ మెడల్స్‌కు ఎంపికైన వారి జాబితాను కేంద్రం ప్రకటించింది. వివిధ విభాగాల్లో 31 మంది తెలుగువారికి పోలీస్ మెడల్స్ దక్కాయి. తెలంగాణలో ఎం.మధుసూదన్‌రెడ్డి, అడిషినల్ ఎస్పీ, ఏసీబీకి ప్రెసిడెంట్ మెడల్ దక్కింది. ఏపీలోని విశాఖకు చెందిన ఇంటెలిజెన్స్ ప్రత్యేక విభాగం ఎస్పీ అడ్డాల వెంకటరామారావు, డీఎస్పీ కింజారపు వెంకట రామకృష్ణప్రసాద్ ప్రెసిడెంట్ మెడల్స్‌కు ఎంపికయ్యారు.

పోలీస్ మెడల్స్ పొందిన వారి జాబితా

తెలంగాణ...

ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ, సంగారెడ్డి
మలిగెల్లి నారాయణ, ఎస్పీ, సీఐడీ ఐ/సి డీఐజీ(అడ్మిన్)
సీ.ఓ, సంగిపాగి ఫ్రాన్సిస్, అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్
రాంప్రకాశ్ బగ్గు, కమాండెంట్, 15వ బెటాలియన్ టీఎస్ఎస్పీ
ఇ.రామచంద్రారెడ్డి, డీసీపీ, రాచకొండ
డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషినల్ ఎస్పీ, భద్రాద్రి-కొత్తగూడెం
సూర్యనేని ప్రభాకర్‌రావు, డీఎస్పీ ఎఫ్‌పీబీ, సీఐడీ
వి.సూర్యచంద్రరావు, డీఎస్పీ, ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ
ఖాజా మొయినుద్దీన్, ఎస్ఐ సీఐ సెల్, ఇంటెలిజెన్స్
సయ్యద్ మఖ్బూల్ పాషా, ఎస్ఐ, సీఎస్‌బీ, వరంగల్
మహ్మద్ అలీఖాన్ ముఖ్తర్, ఏఆర్ఎస్ఐ, సీఐ సెల్, ఇంటెలిజెన్స్
జి.లక్ష్మీనరసింహారావు, హెచ్‌సీ 1688 ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్
మహమ్మద్ అజీజుద్దీన్, పీసీ 716, ఏసీబీ, వరంగల్

ఆంధ్రప్రదేశ్..

ఎస్.హరికృష్ణ, ఇంటెలిజెన్స్ ఎస్పీ, విజయవాడ
వరుపుల సత్తిరాజు, డీఎస్పీ (ఏఆర్) రాజమహేంద్రవరం
కొత్తపల్లి శ్యామ్ వినోద్‌కుమార్ ఎస్పీ(ఎస్సీ, ఎస్టీసెల్), కర్నూల్
కల్లా జనార్దన్‌రావు, ఇంటెలిజెన్స్ డీఎస్పీ, తిరుపతి
పాలేటి మోహన్‌ప్రసాద్, ఏపీఎస్పీ అడిషినల్ కమాండర్, విశాఖ
పెనుమూడి కిరణ్‌కుమార్, అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, హైదరాబాద్
వెన్నపూస వేణుగోపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సెల్, విజయవాడ
బంగారు రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్(పోలీసు ట్రైనింగ్ కాలేజీ), ఒంగోలు
మంత్రిప్రగడ వెంకట గణేష్, ఏసీబీ ఇన్‌స్పెక్టర్, విశాఖపట్నం
నటేష్ గుణశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ (రోడ్ సేఫ్టీ పెట్రోలింగ్) బంగారుపాలెం
షేక్ ముస్తాన్ అహ్మద్ భాషా, ఏఆర్ఎస్ఐ, ఎస్ఏఆర్ సీపీఎల్, హైదరాబాద్
గండవరపు వెంకట రామారావు, హెడ్ కానిస్టేబుల్, విశాఖపట్నం
గోపిశెట్టి సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్(ఆర్మ్ రిజర్వ్), విజయవాడ
యింజారపు వీరవెంకట సత్యసాయిప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ (ఎస్ఐబీ), పోరంకి
భోగాడి వెంకటేశ్వరరావు, రైల్వే పోలీసు కానిస్టేబుల్, విజయవాడ

చైనాలో డేటింగ్ లీవ్!

- ప్రేమించుకోవడానికి సెలవు
- ఉద్యోగులకు ప్రైవేటు కంపెనీల గిఫ్ట్
- 30 ఏళ్ల అవివాహిత యువతులకు మాత్రమే



ఉద్యోగులను ప్రేమగా చూసుకుని వారికి ఎన్నో తాయిలాలు ఇచ్చి... మచ్చిక చేసుకుని తమకు కావలసినంత పని చేయించుకోవడం ప్రైవేటు కంపెనీలు పఠిస్తున్న ఆధునిక మంత్రం. మెటర్నిటీ, పెటర్నిటీ.. ఆరోగ్యం, పర్యాటకం... ఇలా ఏదో ఒక కారణంతో సెలవులు ఇవ్వడం, ఇంటినుంచే పనిచేసుకునే వెసులుబాటు కల్పించడం ఇప్పుడు కొత్తేమీ కాదు. ఈ విషయంలో చైనా కంపెనీలు మరో అడుగు ముందుకు వేశాయి. ముప్పై ఏళ్లలోపు అవివాహిత యువతులు తమకు నచ్చినవారితో కలసి ఉండేందుకు డేటింగ్ లీవ్‌ను ఆఫర్ చేస్తున్నాయి. లూనార్ కొత్త సంవత్సర కానుకగా ఈ ఆఫర్‌ను రెండు కంపెనీలు ప్రకటించాయి. సాధారణ విధులు (ఇంటర్నల్ , ప్రదర్శనల విభాగాల్లో) నిర్వర్తించే ఉద్యోగినులకు ఈ వెసులుబాటు కల్పించారు. తూర్పు చైనాలోని హాంగ్‌ఝౌ సాంగ్‌చెంగ్ పెర్ఫార్మెన్స్, సాంగ్‌చెంగ్ టూరిజం మేనేజ్ మెంట్ సంస్థలు ఈ ఆఫర్‌ను ప్రకటించాయి. చైనాలో యువతులు ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం ఎక్కువైపోయింది. దీంతో జననాల సంఖ్య తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో యువతులను వివాహాలు చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఈ రెండు కంపెనీలు ఎనిమిది రోజుల డేటింగ్ లీవ్‌ను ప్రకటించాయి. వీటిని వాడుకునే యువతులు అవసరమైతే సెలవును పొడిగించుకోవచ్చు కూడా. చైనాలో ఒకప్పుడు యువతులకు వివాహం ఆలస్యమైతే కాస్త చులకనగానే చూసేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. ఉజ్వల భవిష్యత్, ఉన్నత ఉద్యోగాల కోసం యువతులు వివాహాన్ని వాయిదా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతులను ప్రోత్సహించేందుకు డేటింగ్ లీవ్ ఆలోచనను ఆవిష్కరించారు. దీనిపై అందరిలో ఉత్సుకత వ్యక్తమవుతోందంటున్నారు... హాంగ్‌ఝౌ సాంగ్‌సెంగ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ హువాంగ్. కాగా దీనిపై సామాజిక మాధ్యమాలలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. కొద్దినెలల క్రితం చైనాలోని కొన్ని ప్రైవేటు సంస్థలు ప్రేమించుకునేందుకు అవసరమైతే సెలవులు మంజూరు చేస్తామంటూ ప్రకటించిన విషయం తెలిసిందే.


స్వచ్ఛ్ చింపాంజీ!



పరిసరాలను శుభ్రంగా ఉంచడం కోసం మనం ఓ ఉద్యమాన్నే ప్రారంభించాం. కానీ చైనాలో ఓ చింపాంజీ ఎవరూ చెప్పకుండానే ఆ పని చేస్తోంది. తను ఉండే ఎన్‌క్లోజర్‌ను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటోంది. అందుకోసం చీపురుచేతబట్టి ఆకులు, గడ్డి తుడిచేస్తోంది. తరచూ తన ఎన్‌క్లోజర్‌ను జూ సిబ్బంది తుడుస్తూండటాన్ని గమనించిన ఈ చింపాంజీ తనే చీపురుపట్టి అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. చైనాలోని షెన్‌యాంగ్ సిటీ జూలో ఈ దృశ్యం కంటపడింది. ఇప్పుడ ఈ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. నిజానికి అడవుల్లో ఉండేలా సహజసిద్ధమైన వాతావరణం ఉండేలా చూసేందుకు అప్పుడప్పుడు జూలో జంతువుల ఎన్‌క్లోజర్‌లలో ఎండిని ఆకులు, గడ్డి, కొమ్మలు వేస్తూంటారు. వీటివల్ల దుర్గంధమూ తగ్గుతుంది. కొద్దిరోజుల తరువాత శుభ్రం చేసి మళ్లీ కొత్తవాటిని వేస్తూంటారు. అది గమనించిన చింపాంజీ తన ఎన్‌క్లోజర్‌ను మాత్రం శుభ్రం చేస్తూండటం వైరల్ అయింది. పైగా ఇదేదో మమ అనిపించినట్లు కాకుండా గది మూలల్లోనూ చెత్తలేకుండా శుభ్రపరచడం విశేషం.

ఆమే ఒక సైన్యం!

ఎన్‌సీసీ నుంచి ఆర్మీ దాకా!



- పురుష దళానికి తొలి మహిళా కమాండర్
- రాజ్‌పథ్‌లో వికసిస్తున్న తెలుగు తేజం
- దేశంలోని యువతులకు ప్రేరణ
- హైదరాబాద్ అమ్మాయి భావనా కస్తూరి..

ఉస్మానియాలో మైక్రోబయోలజీలో డిగ్రీ



న్యూఢిల్లీ: ఎక్కడో దక్షిణాదిన తమిళనాడులో అవకాయ పచ్చడి పెట్టుకొనే ఒక మహిళ ఆసేతు హిమాచలం వ్యాపించిన భారతదేశానికి తొలిసారిగా రక్షణమంత్రి పదవి చేపట్టడం స్వాతంత్ర్యానంతర చరిత్రలో నూతన అధ్యాయానికి ఆరంభమైతే, ఇప్పుడు త్రివిధ దళాల్లో పెరుగుతున్న మహిళా శక్తికి నేటి గణతంత్ర వేడుకల పెరేడ్ వేదిక కానుంది. బెంగళూరులో జరిగిన ఎంపిక, స్క్రీనింగ్ తరువాత అనేమంది సైన్యాధికారుల నుంచి ఒక మహిళను ఎంపిక చేశారు. రిపబ్లిక్ డే వేడుకల్లో పురుషులతో నిండిన ఒక పూర్తిస్థాయి దళానికి ఆమె నేతృత్వం వహించనున్నారు. దేశ రాజధానిలో జరిగే రిపబ్లిక్ పెరేడ్‌లో లెఫ్టినెంట్ భావనా కస్తూరి నేతృత్వంలో పురుష దళం ప్రదర్శన ఇవ్వనుంది. దేశ చరిత్రలో ఒక పురుష దళానికి మహిళను కమాండర్ చేయడం ఇదే తొలిసారి. యావత్ జాతి వీక్షిస్తుండగా భావనా కస్తూరి 144 మంది జవాన్ల దళంతో రాజపథ్‌పై కవాతు నిర్వహిస్తారు. సైనిక దళాల సైన్యాధిపతి ముందు పురుష దళానికి నేతృత్వం వహిస్తూ, ఆయనకి సైనిక వందనం చేయడం కలలో కూడా ఊహించలేదని భావనా కస్తూరి చెప్పారు. భావనా కస్తూరి హైదరాబాద్‌కి చెందిన అమ్మాయి. రెండున్నరేళ్ల క్రితం భారత సైన్యంలో చేరిన భావనా.. రిపబ్లిక్ డే ప్రదర్శన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పురుష దళాన్ని నడిపించే దృశ్యం దేశంలోని అమ్మాయిలకు ఎంతో ఉత్తేజభరితంగా ఉంటుందన్నారు. తనపై ఉంచిన ఈ బాధ్యత ముందు ఏ అవార్డు కూడా సరిపోదని, తన జీవితంలో లభించిన అత్యుత్తమ బహుమతిగా ఆమె సంబర పడ్డారు. నిజానికి రాజ్‌పథ్‌లో రిపబ్లిక్ ప్రదర్శనలో పాల్గొనడం భావనా కస్తూరికి ఇదే తొలిసారి కాదు. తొమ్మిదేళ్ల క్రితం నేషనల్ కెడెట్ కార్ప్స్ టీమ్‌లో భాగంగా రిపబ్లిక్ డే వేడుకల్లో భావనా పాల్గొన్నారు. ఎన్‌సీసీ ప్రదర్శనకి ఆవాళ యావత్ మంత్రి వర్గం నిలబడి చప్పట్లు కొట్టారని భావనా ఆనాటి అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ రోజున తను ఊహించి ఉండదు.. ఒక సైనికురాలిగా, లెఫ్టినెంట్‌గా పురుష దళానికి కమాండర్‌గా ఇదే రాజ్‌పథ్‌లో కవాతు చేస్తానని.

ఎలా ఎంపికయ్యారు?

గత ఏడాది జూన్‌లో ఎంపిక కార్యక్రమాన్ని బెంగళూరులో నిర్వహించారు. దీనికి ఎంతోమంది సైన్యాధికారులు పోటీ పడ్డారు. వారందరిలోంచి భావన కస్తూరి విజేతగా నిలిచారు. మొదట నలుగురు అధికారులను ఎంపిక చేశారు. వారి లోంచి ఇద్దరిని తీసుకున్నారు. ఆ ఇద్దరి లోంచే చివరిగా భావనా కస్తూరికి పురుష దళానికి నేతృత్వం వహించే బాధ్యతను అప్పచెప్పారు. ఈ విషయాన్ని ఈ జనవరి మొదటి వారంలో భావనకి ఆర్మీ విభాగం తెలియచేసింది. భావనా కస్తూరి ఆర్మీలో లాగిస్టిక్ నిర్వహణా బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. భావనా ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌ను తొలిగా బ్రిటీష్ వారు ఏర్పాటు చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి మైక్రో బయాలజీలో డిగ్రీ పట్టా అందుకున్న భావనా ఆ తరువాత సైన్యంలో చేరారు.

భావనా సాహిబ్..!

ఇప్పుడు జవాన్లంతా భావనా సాహిబ్ అని పిలవడం తనకు ఎంతో గర్వంగా ఉంటుంది. ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌కి ఇంతకాలం పురుష దళపతే రిపబ్లిక్ పెరేడ్‌లో కమాండర్‌గా ఉండడం రివాజుగా వస్తోంది. ఇప్పుడు ఈ బాధ్యత భావనా భుజస్కంధాలపై పడింది. తన పురుష దళంలోని వారంత ఎంతో ప్రోత్సాహం ఇస్తుంటారని, తనను చూసి వారెంతో గర్వపడుతుంటారని కస్తూరి సంతోషంగా చెప్పారు. భారత సైన్యం అంటేనే పురుష ఆధిపత్యం. అలాంటి చోట ఆర్నెళ్లుగా తాను మంచి స్నేహపూర్వక సంబంధాలను నెలకొల్పానని చెప్పారు. తన దళంలోని ప్రతి ఒక్కరూ ఈ రోజు తానీ స్థాయికి రావడానికి కారణమన్నారు. రిపబ్లిక్ పెరేడ్‌లో దళానికి కమాండ్ చేసేవారికి ఎన్నో బాధ్యతలు ఉంటాయి. పాలనతో పాటు, సైనికులు సరైన సమయానికి తినడం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఏవీ లేకుండా చూసుకోవడం చాలా కీలకం. రాజ్‌పథ్ పెరేడ్‌లో దళానికి కమాండర్‌గా వ్యవహరించడం కన్నా తనకు తన జవాన్లు, వారి కుటుంబాలు, యావత్ దేశమే తనకు కీలకమని భావన చెప్పారు.

సైన్యంలో ఎలా చేరారు?

భావనా కస్తూరి కుటుంబంలో కానీ, బంధువుల్లో కానీ, స్నేహితుల్లో కానీ, పరిచయస్తుల్లో కానీ సైన్యంలో చేరిన వారు ఎవరూ లేరు. తల్లి శశి రేఖ కార్మిక న్యాయస్థానంలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తుంటారు. ఎన్‌సీసీలో ఉన్నప్పుడే కస్తూరికి సైన్యం అంటే ఎంతో ప్రేమ ఏర్పడిందని, అప్పటి నుంచే ఆర్మీలోకి వెళ్లాలని ఉత్సాహపడేదని తల్లి శశిరేఖ చెప్పారు. ఎన్‌సీసీలో ఉన్నప్పుడే భావనకి ఎంతోమంది సైన్యాధికారులతో పరిచయం ఏర్పడింది. వారి ప్రేరణతో తాను ఎన్నటికైనా సైన్యంలో చేరాలని ఆశయంగా పెట్టుకుంది.

ఆమె కుటుంబమే సైన్యం

లెఫ్టినెంట్ భావన కస్తూరి పెరేడ్ ప్రదర్శన చూడడానికి ఆరుగురు కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్నారు. వీరిలో ఆమె అత్తా మామలు కూడా ఉన్నారు. భావనా భర్త ఆర్మీలోనే డాక్టర్‌గా సేవలందించడం విశేషం. తన కుటుంబం ఇప్పుడు తనను చూసి ఎంతో గర్వ పడుతోందన్నారు భావన. ఆర్మీలోకి చేరే తన ప్రయాణం లోని ప్రతి అడుగుకీ వారు సాక్షీభూతమన్నారు. తన స్కూల్ మేట్స్, కాలేజీ సహచరులు తాను సైన్యంలో చేరడాన్ని ఎంతో ఆసక్తిగా చూస్తారని, అక్కడ ఎలా ఉంటుంది? యూనీఫార్మ్ వేసుకుంటావా? వంటి ప్రశ్నలు వేస్తుంటారని భావనా చెప్పారు. ఆర్మీలో అమ్మాయిలకు మంచి అవకాశాలున్నాయని కస్తూరి చెప్పారు. ఆర్మీలో ప్రతి రోజు, ప్రతి క్షణం ఎంతో ఉత్తేజభరితంగా ఉంటుందన్నారు. యూనీఫార్మ్ వేసుకొంటే ఎంతో గౌరవంగా ఉంటుందని, దాంతో పాటు బాధ్యతలు కూడా అంతే గొప్పగా ఉంటాయన్నారు.

సైన్యమే జీవితం!

మాకు వేరే జీవితం ఉండదు. సైన్యం అంటే తన కన్నా దేశానికి సేవ చేయడమే ముఖ్యంగా భావిస్తారు. సైన్యంలో పని చేస్తుంటే ఎన్నో అద్భుతైన విషయాలు ఎదురవుతుంటాయి. భారత సైన్యం గురించి వర్ణించాలంటే మాటలు సరిపోవు... ఇవీ లెఫ్టినెంట్ భావనా కస్తూరి ఉద్వేగపూరితమైన మాటలు!

ఉగ్ర కుట్ర భగ్నం

- ఢిల్లీలో పేలుళ్లకు పన్నాగం
- నిఘా వర్గాలు అప్రమత్తం
- ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు... మారణాయుధాలు స్వాధీనం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ రాజధానిలో పేలుళ్లకు కుట్రపన్నిన ఉగ్రవాదులను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్టు చేసింది. మిలటరీ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు జైష్-ఏ-మహ్మద్ సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేశారు. వారిని కాశ్మీర్‌కు చెందిన అబ్దుల్ లతీఫ్ గని, హిలాల్ అహ్మద్‌గా గుర్తించారు. జైష్-ఏ-మహ్మద్ కమాండర్ అబూ బకర్ పాకిస్తాన్ నుంచి అందిస్తున్న ఆదేశాల మేరకు ఢిల్లీలో వరుస పేలుళ్లకు కుట్ర పన్నినట్టు గుర్తించారు. అరెస్టయిన ఇద్దరికి ఇంకా ఎవరైనా సహకరిస్తున్నారా అన్న కోణంలో ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఒక ప్రత్యేక బృందాన్ని కాశ్మీర్ పంపించి సోదాలు నిర్వహించగా, అరెస్టయిన ఉగ్రవాదుల నివాసాల్లో హ్యాండ్ గ్రనేడ్లు, సెమీ ఆటోమేటిక్ పిస్టళ్లు, జైష్-ఏ-మహ్మద్ రబ్బర్ స్టాంపులు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటరాగేషన్లో ఉగ్రవాదులిద్దరూ పేలుళ్ల కుట్రను బయటపెట్టారు. ఢిల్లీలో నిత్యం రద్దీగా ఉండే లజ్‌పత్ నగర్ మార్కెట్లో బాంబు పేలుళ్లతో భారీగా ప్రాణ నష్టం కలిగించాలని ఉగ్రవాదులు పన్నాగం పన్నారు. అలాగే తూర్పు ఢిల్లీలో గ్యాస్ పైప్‌లైన్ ను పేల్చివేసేందుకు కుట్రపన్నారు. ఈ రెండు పేలుళ్లకు రెక్కీ కూడా నిర్వహించారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో దేశ రాజధానితో పాటు దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు హైఅలర్ట్ అమలు చేస్తున్నాయి. మరోవైపు పోలీసుల జాబితాలో వాంటెట్ టెర్రరిస్టులుగా ఉన్న ఉగ్రవాదుల ఫొటోలను పోస్టర్ల రూపంలో ఢిల్లీ పోలీసులు విడుదల చేశారు. నగరమంతటా ఆ పోస్టర్లను అతికించి సాధారణ ప్రజల మద్ధతు కోరుతున్నారు. కేవలం ఇస్లామిక్ టెర్రరిస్టుల నుంచే కాదు, ఖలిస్తాన్ ఉగ్రవాదుల నుంచి కూడా ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ ముజాహిదీన్, జైష్-ఏ-మహ్మద్, లష్కర్- ఏ-తోయిబా, అల్ ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలతోపాటు ఖలిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్, ఖలిస్తాన్ జిందాబాద్ ఫ్రంట్ వంటి ఉగ్రవాద సంస్థల నేతల ఫొటోలను కూడా పోస్టర్ల రూపంలో ముద్రించి నగరమంతటా గోడలపై అతికించారు. వారి ఆచూకీ తెలిసినవారు కంట్రోల్ రూం లేదా దగ్గరిలోని పోలీసు స్టేషన్ కి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

- ♦ ఉగ్రవాద దాడి కుట్ర నేపథ్యంలో దేశవ్యాప్తంగా అప్రమత్తమైన భద్రతా బలగాలు
- ♦ అనుమానితులు, వాంటెంట్ ఉగ్రవాదుల ఫొటోలతో కూడిన పోస్టర్లను ఢిల్లీ నగరమంతటా అతికించిన పోలీసులు
- ♦ ఇండియన్ ముజాహిదీన్, ఖలిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ తదితర ఉగ్రవాదుల ఫొటోలతో పోస్టర్లు అతికించిన ఢిల్లీ పోలీసులు
- ♦ ఇస్లామిక్ ఉగ్రవాదులకు తోడు ఖలిస్తాన్ ఉగ్రవాదుల నుంచి కూడా ముప్పు ఉందని భావిస్తున్న భద్రతా బలగాలు
- ♦ ఖలిస్తాన్ ఉగ్రవాదుల ఫొటోలను కూడా పోస్టర్ల రూపంలో విడుదల చేసిన ఢిల్లీ పోలీసులు

కుంభమేళాపై ఉగ్రవాదుల కన్ను

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలను నిఘాను పెంచాయి. ఇస్లామిక్ స్టేట్ స్ఫూర్తితో ఉమ్మత్-ఏ-మహ్మదియా అనే ఉగ్రవాద సంస్థను నెలకొల్పి కుంభమేళాలో విషప్రయోగం ద్వారా భక్తుల ప్రాణాలు తీసేందుకు కుట్రపన్నిన 9 మంది ఉగ్రవాదులను మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద ప్రమాదకర, ప్రాణాంతక రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. కుంభమేళాలో ఆహారంలో, నీటిలో విషప్రయోగం చేయడం ద్వారా భారీగా ప్రాణనష్టం కలిగించాలని కుట్ర పన్నినట్టు ఏటీఎస్ దర్యాప్తులో తేలింది. వీరిలో ఒకరు అండర్ వరల్డ్ డాన్ రషీద్ మల్బారీ కుమారుడు. అరెస్టయిన ఉగ్రవాదులందరూ ఇంజనీర్లు, ఫార్మసిస్టులని, ఎవరికీ అనుమానం కలుగని రీతిలో నీటిని, ఆహారాన్ని కలుషితం చేసేందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఏటీఎస్ పోలీసుల దర్యాప్తులో తేలింది.

గాంధీజీ అస్త్రం అహింస

శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహాత్మా గాంధీ సమాజానికి అందించిన గొప్ప అస్త్రం అహింస అని శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్ కొనియాడారు. ఆయన అనుసరించిన మార్గం మనందరికీ ఆదర్శప్రాయమన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని రీజినల్ ఔట్ రీచ్ బ్యూరో శుక్రవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గాంధీజీ మెగా డిజిటల్, ఛాయచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఆరు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శను ప్రారంభించిన స్వామిగౌడ్ ముఖ్య అతిథి ప్రసంగం చేశారు.. నేటి యువతరం, విద్యార్థులు గాంధీ మార్గంలో నడవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గాంధీ ఛాయచిత్ర ప్రదర్శనను దర్శించి ఆయన గురించి సమగ్ర సమాచారం తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార శాఖ (తెలంగాణ) అదనపు డైరెక్టర్ టి.వి.కె. రెడ్డి, గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్, రీజినల్ ఔట్ రీచ్ బ్యూరో డైరెక్టర్ ఎం. దేవేంద్ర, అసిస్టెంట్ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్ తదితరులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







క్రీడా పద్మాలు

- తెలుగు రాష్ట్రాల నుండి సునీల్ ఛెత్రి, ద్రోణవల్లి హారికకు పద్మశ్రీ
- బచేంద్రిపాల్‌కు పద్మభూషణ్

న్యూఢిల్లీ : 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభు త్వం పద్మ అవార్డులను ప్రకటించింది. 1984లో ఎవరెస్టు ఎక్కిన మొదటి మ హిళగా చరిత్ర సృష్టించిన 64 ఏళ్ల బచేంద్రి పాల్‌ను పద్మ భూషణ్‌తో సత్కరిం చనుంది. గౌతమ్ గంభీర్ (క్రికెట్), బజరంగ్ పునియా (రెజ్లింగ్), ద్రోణవల్లి హారిక (చెస్, ఆంధ్రప్రదేశ్), సునీల్ ఛెత్రి (ఫుట్‌బాల్, తెలంగాణ), శరత్ కమల్ (టేబుల్ టెన్నిస్), బాంబేలా దేవి లాయిశ్రం (ఆర్చరీ), అజయ్ ఠాకూర్ (కబడ్డీ)లకు పద్మ శ్రీ అవార్డులు వరించాయి.

క్రీడాప్రభ

అదే జోరు..?



సొంత గడ్డపై ఆస్ట్రేలియాను చిత్తు చేసి వన్డే, టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా మంచి ఊపు మీద ఉంది. పక్కనే ఉన్న న్యూజిలాండ్ గడ్డపై అడుగుపెట్టి మొదటి వన్డేను 8 వికెట్ల తేడాతో కైవసం చేసుకుంది. నేడు (శనివారం) రెండో వన్డేకు సిద్ధమైంది. న్యూజిలాండ్‌ను సొంత గడ్డపై ఓడించి వన్డే, టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే దృఢ నిశ్చయంతో ఉంది. ఈ మేరకు కసరత్తు ప్రారంభించింది. కివీస్ జట్టు కూడా ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నది. మరి రెండో వన్డే విజయం ఎవరి వరిస్తుందో వేచి చూడాలి....

నేడు కివీస్‌తో రెండో వన్డే

- 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో భారత్ ఆధిక్యం
- స్పిన్నర్‌లు చెలరేగేనా..!
- ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

మౌంట్ మాంగనూయ్ (న్యూజిలాండ్) : బే ఓవల్ మైదానంలో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో వన్డే ప్రారంభం కానుంది. ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న టీమిండియా దాన్ని 2-0 చేసేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే మంచి శుభారంభం ఇచ్చింది. అదే శైలిని న్యూజిలాండ్ టూర్ మొత్తంగా కొనసాగించాలని భావిస్తున్నది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో కివీస్ జట్టు తడబడుతోంది. మొదటి వన్డేలో కుల్దీప్ యాదవ్ (4 వికెట్లు), చాహల్ (2 వికెట్లు) తన స్పిన్ మాయాజాలంలో న్యూజిలాండ్ ఆటగాళ్లకు చుక్కలు చూపించారు. వీరికి పేసర్ మహ్మద్ షమీ (3 వికెట్లు) జతకట్టడంతో టీమిండియాకు విజయం సులువైంది. వెలుతురు లేమి కారణంగా సుమారు 30 నిమిషాల పాటు మొదటి వన్డేకు ఆటంకం కలిగింది. మళ్లీ తమ మణికట్టు మాయ చూపించేందుకు స్పిన్నర్లు సిద్ధం అయ్యారు.



మూడో వన్డేలో హార్దిక్ పాండ్యా..!

క్రికెట్ పరిపాలక కమిటీ గ్రీన్ సిగ్నల్‌తో హార్దిక్ పాండ్యాకు టీమిండియా జట్టులో స్థానం దక్కింది. కేఎల్ రాహుల్‌పై కూడా కమిటీ సస్పెన్షన్‌ను ఎత్తేసింది. పాండ్యా మూడో వన్డే నుంచి అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. పరిస్థితులను బట్టి ఆల్ రౌండర్ విజయ్ శంకర్ ఆడించాలా..? లేదా రవీంద్ర జడేజాను తిరిగి జట్టులోకి తీసుకోవాలా..? అన్నదానిపై టీం మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. మొదటి వన్డేలో 23 బంతుల్లో 13 పరుగులు చేసిన అంబటి రాయుడికి మరో చాన్స్ ఇవ్వాలని భావిస్తోంది. ఆస్ట్రేలియాపై కూడా మెరుగైన ప్రదర్శన కనబర్చలేదు. శిఖర్ ధావన్ బ్యాట్‌క పని చెప్పడం భారత్‌కు ప్లస్ పాయింట్ అనే చెప్పుకోవాలి.


జట్టులో పలు మార్పులు

చివరి రెండు వన్డేలకు, టీ 20 సిరీస్‌కు కోహ్లీకి బీసీసీఐ విశ్రాంతి కల్పించింది. గత కొన్ని నెలలుగా విశ్రాంతి లేకుండా ఆడటం, ముందు ప్రపంచ కప్ ఉండటంతో జట్టుపై ప్రభావం పడే అవకాశం ఉందని బీసీసీఐ భావించింది. రోహిత్ శర్మ జట్టు పగ్గాలు తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో జట్టులో మార్పులు చేయాలని భావిస్తున్నారు. శుభమన్ గిల్‌తో ఆరంభించాలని అనుకుంటున్నారు. గతంలో న్యూజిలాండ్, టీమిండియాపై 4-0 తేడాతో విజయం సాధించింది.

భారత్ జట్టు : విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, మహేంద్ర సింగ్ ధోనీ (వికెట్ కీపర్), కెదార్ జాదవ్, దినేష్ కార్తీక్, విజయ్ శంకర్, శుభమన్ గిల్, యుజేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా.

న్యూజిలాండ్ జట్టు : విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, లాథమ్, మార్టిన్ గప్తిల్, కొలిన్ డీ గ్రాండ్హోమ్, ట్రెంట్ బౌల్ట్, హెంద్రీ నికోల్స్, బ్రాస్‌వెల్, ఫెర్గ్యుసన్, మ్యాట్ హెంద్రీ, కొలిన్ మున్రో, ఇష్ సోధీ, మిచెల్ శాంట్నర్, టిమ్ సౌథీ.

టాప్ ఆర్డరే లక్ష్యం : ట్రెంట్ బౌల్ట్



మొదటి వన్డేలో పేలవమైన ప్రదర్శన కనబర్చాం. రెండో వన్డేలో ప్రత్యేక వ్యూహంతో దిగబోతున్నాం. టీమిండియా టాప్ ఆర్డర్‌ను కుప్ప కూల్చడమే మా లక్ష్యం. దీంతో మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా వికెట్లు తీయడానికి మాకు మరింత సులువు అవుతుంది. శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డేల్లో విధ్వంసకరమైన ప్లేయర్లు. టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చేందుకు బౌలింగ్‌లో ఎంతో మెరుగుదల అవసరం. పది ఓవర్లలో మూడు వికెట్లు పడగొడితే టీమిండియా జట్టు తీవ్ర ఒత్తిడికి గురవుతుంది. తొలి వన్డేలో చిత్తుగా ఓడించారు. అలాంటి పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకుంటున్నాం. బ్యాట్స్‌మెన్‌లు స్కోరును పరుగెత్తించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఎంత ఎక్కువ సేపు క్రీజులో నిలిస్తే అన్ని ఎక్కువ పరుగులు సాధిస్తామనేది గుర్తు పెట్టుకోవాలి. వన్డే ఫార్మాట్‌లో వికెట్లు చేజార్చుకుంటే ఓటమి తప్పదనుకోవాలి.

చోటు కోసం పోటీ పెరిగింది : ధావన్



టీమిండియాలో చోటు కోసం పోటీ ఎంతో పెరిగింది. యువ ఆటగాళ్లు ఎంతో పరిణితి సాధిస్తున్నారు. వీరంతా జట్టులో స్థానం కోసం పోటీపెంచుతున్నారు. పృథ్వీ షా సహచరుడు శుభమన్ గిల్ కివీస్‌తో సిరీస్‌లో స్థానం సంపాధించుకోవడమే నిదర్శనం. ఇప్పటికే అండర్ - 19 సారథి పృథ్వీ షా గతేడాది టెస్టుల్లో ఎంట్రీ ఇచ్చాడు. మంచి ఆట ఉన్నవారికి జట్టులో స్థానం కల్పించాల్సిన పరిస్థితి వచ్చింది. నేను 5000 పరుగుల మైలురాయి దాటేశానంటే మెరుగైన ఆటను ప్రదర్శించానని అనుకుంటున్నాను. నా బ్యాటింగ్ టెక్నిక్ అన్ని వికెట్లపై ఆడేందుకు ఎంతో ఉపకరిస్తుంది. తుది జట్టు సంగతి అటుంచితే ముందు అయితే 15 మందికి విపరీతమైన పోటీ నెలకొంది. షా విండీస్ టెస్టులో శతకం, 70తో సత్తా చాటాడు. ఇతర దేశాల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తాను. విరాట్‌తో ఆడుతున్నప్పుడు స్ట్రైక్ రొటేట్ చేస్తుంటాను. ఒత్తిడిని పంచుకుంటాం. న్యూజిలాండ్‌లో హాకా నృత్యం ఎంతో ప్రసిద్ధి. కొంత మంది వచ్చి నృత్యం చేశారు. ఎంతో ఆనందం వేసింది. వారి ఆశీర్వాదాలు కూడా తీసుకున్నాం. రెండో వన్డేలో గెలుపు మనదే.. ఆసీస్, న్యూజిలాండ్ పిచ్‌లు, వాతావరణం ఒకేలా ఉంటాయి. ఫుట్‌వర్క్‌లో ఎలాంటి మార్పు చేయలేదు.

సెమీస్‌లో సైనా

- నిరాశపరిచిన పీవీ సింధు, కిదాంబి
- సీజన్‌లో రెండో సారి సెమీఫైనల్‌లో నెహ్వాల్
- చైనా క్రీడాకారిణితో పోరు

జకర్తా : ఇండో నేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్‌లోకి సైనా నెహ్వాల్ దూసుకెళ్లింది. సైనా, ఈ సీజన్‌లో రెండో సారి సెమీస్‌కు చేరింది. కానీ కిదాంబి శ్రీకాంత్, పీవీ సింధు మాత్రం నిరాశపరిచారు. శుక్రవారం జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కిదాంబి ఓడిపోవడంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఎనిమిదో సీడ్ క్రీడాకారిణి సైనా, థాయిలాండ్ క్రీడాకారిణి పార్న్‌పావే చోచువాంగ్‌ను 21-7, 21-18 రెండు వరుస సెట్‌లలో క్వార్టర్ ఫైనల్‌లో ఓడించి సెమీస్‌కు చేరింది. రెండు సార్లు కామన్‌వెల్త్ గేమ్స్ ఛాంపియన్‌గా నిలిచిన సైనా, 2012 లండన్ ఒలింపిక్‌లో కాంస్య పతకం సాధించిన చైనాకు చెందిన బింగ్జియాతో తలపడుతుంది. ఇప్పటి వరకు సైనా తన కెరీర్‌లో బింగ్జియాతో ఆడలేదు. ఆసియాన్ గేమ్స్ ఛాంపియన్ జోనాతన్ క్రిస్టిల్ చేతిలో 18-21, 19-21 పాయింట్ల తేడాతో రెండో క్వార్టర్ ఫైనల్‌లో కిదాంబి శ్రీకాంత్ ఓటమి చవి చూశాడు. మూడు సార్లు ఒలింపిక్ ఛాంపియన్‌గా నిలిచిన కారోలిన్ మారిన్ చేతిలో పీవీ సింధు 11-21, 12-21 వరుస సెట్లలో ఓటమి చవి చూసింది. రియో ఒలింపిక్స్, 2018 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో కూడా మారిన్‌పై పీవీ సింధు గెలుపు సాధించలేకపోయింది. ఆది నుంచి సింధుపై మారిన్ ఆధిపత్యం కొనసాగిస్తూనే వచ్చింది.



సైనా తన మ్యాచును 33 నిమిషాల్లోనే పూర్తి చేసింది. సైనా తన ఆటను బాగా ప్రారంభించింది. ఇంటర్వెల్‌కు 11-4లో లీడ్‌లో నిలిచింది. ఆ తరువాత థాయిలాండ్ క్రీడాకారిణిపై ఆధిపత్యం కొనసాగిస్తూనే వచ్చింది. రెండో గేమ్‌లో చోచ్యువంగ్ 8-4 లీడ్‌లో నిలిచింది. ఆ తరువాత సైనా ఫామ్‌లోకి వచ్చి 12-12 పాయింట్లతో స్కోరును సమం చేసింది. కిదాంబి ఒకానొక దశలో ప్రత్యర్థి క్రిస్టిల్‌పై 15-15 వద్ద నిలిచాడు. ఆ తరువాత 17-16తో లీడ్‌లో నిలిచినా క్రిస్టిల్ విజృంభించడంతో రెండు వరస సెట్లలో కిదాంబికి ఓటమి తప్పలేదు.



నేడు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ ఫైట్

నువ్వా.. నేనా...!




- మహిళల సింగిల్స్‌లో క్విటోవా, ఒసాకా
- పురుషుల్లో జకోవిచ్, రఫెల్ నాదల్
- టైటిల్‌పై కన్నేసిన దిగ్గజాలు

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్న చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి క్విటోవా, జపాన్‌కు చెందిన నవోమి ఒసాకా మధ్య నేడు ఫైనల్ పోరు జరగనుంది. ఎలాగైనా టైటిల్‌ను సొంతం చేసుకుని సత్తా చాటాలనే ఆలోచనలో ఇద్దరు క్రీడాకారిణులు ఉన్నారు. క్విటోవా రెండు సార్లు వింబుల్డన్ ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో భాగంగా ఈమె 11 మ్యాచులు ఏకధాటిగా గెలుస్తూ వచ్చింది. ఈ టైటిల్ తనకు ఎంతో ప్రత్యేకం అని, కచ్చితంగా విజయం సాధించి తీరుతా అని క్విటోవా చెబుతోంది. టైటిల్ దక్కించుకోవాలంటే 8వ సీడ్ క్రీడాకారిణి, యూఎస్ ఓపెన్ ఛాంపియన్ ఒసాకాపై తన పవర్‌ఫుల్ సర్వింగ్, గ్రౌండ్ స్ట్రోక్స్‌తో విరుచుకుపడాల్సి ఉంటుంది. నవోమి మంచి ప్లేయర్ అని, అత్యద్భుతమైన ఫాంలో ఉందని క్విటోవా చెబుతున్నది. ఏది ఏమైనా మొదటి పాయింట్ సాధించి నవోమిపై ఒత్తిడి పెంచుతానని అంటోంది. ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో తాను ఆడుతున్నా అని, ప్రతీ సారి మూడు సెట్లు ఆడానని క్విటోవా గుర్తు చేసింది. ఇద్దరు సమఉజ్జీలని, ఆట అద్భుతంగా ఉంటుందని, మ్యాచ్ మాత్రం నువ్వా.. నేనా అన్న రీతిలో సాగుతుందని క్విటోవా కోచ్ జిరి వనెక్ అన్నాడు.



నోవాక్ జకోవిచ్ విజయాల పరంపర

శుక్రవారం ఫ్రెంచ్ క్రీడాకారుడు లుకాస్ పౌలీ, నొవాక్ జకోవిచ్ మధ్య పోరు జరిగింది. 28వ సీడ్ ఆటగాడైన లుకాస్‌ను జకోవిచ్ 6-0, 6-2, 6-2 పాయింట్ల తేడాతో మట్టి కరిపించాడు. మరో గ్రాండ్ స్లామ్ టైటిల్‌పై కన్నే సిన స్పెయిన్ వీరుడు రఫెల్ నాదల్ అలవోకగా ఫైనల్లో అడుగు పెట్టాడు. ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో గ్రీసు ఆటగాడు స్టెఫానోస్ సిట్సిపాస్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. సెమీస్ మ్యాచ్ ఆడిన వాటిల్లో కెల్లా బెస్ట్ అని జకోవిచ్ తెలిపాడు. మోచేతి ఆపరేషన్ కారణంగా గతేడాది నాల్గో రౌండ్‌లోనే జకోవిచ్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక ఫైనల్‌లో సెర్బియా ఆటగాడు జకోవిచ్, స్పెయిన్ బుల్ నాదల్‌తో తలపడతాడు.

క్యాన్సర్‌ను జయిస్తా...

- బంగారు పతకం సాధిస్తా..!
- ఒలింపిక్స్ ఛాంపియన్ నాథన్ అడ్రియాన్



లాస్ ఏంజెల్స్ : ఐదు సార్లు స్విమ్మర్ విభాగంలో ఒలింపిక్ ఛాంపియన్‌గా నిలిచిన నాథన్ అడ్రియాన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. 2020లో జరిగే టోక్యో ఒలింపిక్స్ కల్లా ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకుని మళ్లీ ఛాంపియన్‌గా నిలిచేందుకు సిద్ధం అవుతానని ధీమా వ్యక్తం చేశాడు. 30 ఏళ్ల నాథన్, 2012లో ఫ్రీ స్టైల్ 100 మీటర్ల స్విమ్మింగ్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. వైద్యం ప్రారంభమైందని, మరికొన్ని వారాల్లో స్విమ్మింగ్ ప్రాక్టీస్ ప్రారంభిస్తానని తెలిపాడు. క్యాన్సర్‌ను జయించే విషయంలో మెరుగుదల కనబడుతోందని అన్నాడు. 2008, 2012, 2016 ఒలింపిక్స్‌లో నాథన్ పాల్గొన్నాడు. మొత్తం 8 పతకాలు సాధించాడు. మొత్తం కెరీర్‌లో 11 వరల్డ్‌ఛాంపియన్‌షిప్ పతకాలు తన ఖాతాలో వేసుకున్నాడు. వార్తల్లో వస్తున్న విమర్శలను పట్టించుకోవడం మానేశానని, ముఖ్యమైన అంశాలపైనే దృష్టిపెట్టేవాణ్ని అని, అప్పుడే మెరుగైన వైద్యం అందే అవకాశంతో పాటు త్వరగా కోలుకునే ఆస్కారం ఉంటుందని నాథన్ అడ్రియాన్ చెప్పుకొచ్చాడు.

పట్టు బిగించిన ఆసీస్



శ్రీలంకతో టెస్టులో ముందంజ

బ్రిస్బేన్ : ఆసీస్ ఆటగాళ్లు ట్రావిస్ హెడ్, మార్నస్‌లు అర్ధ సెంచరీలతో కదం తొక్కడంతో డే అండ్ నైట్ కొనసాగుతున్న మొదటి టెస్టు రెండో ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 179 పరుగుల ఆధిక్యంతో ఆసీస్ నిలిచింది. హెడ్ (84), మార్నస్ (81)తో కదం తొక్కడంతో ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 323/10 (106.2) వద్ద ముగిసింది. మొదటి ఇన్నింగ్‌లో బ్యాటింగ్ దిగిన శ్రీలంక.. 144/10 (56.4) వద్ద ఆలౌట్ అయ్యింది. నిరోషన్ 64 రన్స్ చేయడంతో శ్రీలంక గౌరవ ప్రదమైన పరుగుల వద్ద నిలిచింది. దిముత్ కరుణార్తనే (24), కౌసల్ మెండిస్ (14), తిర్మానే (12) పరుగులు చేశారు. కమిన్స్ 4 వికెట్లు తీయగా, రిచర్డ్‌సన్ 3 వికెట్లు, స్టార్క్ 2 వికెట్లు, నాథన్ 1 వికెట్ తీశాడు. శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో లక్మల్ 5 వికెట్లు, పెరెరా 2 వికెట్లు, కుమార, చమేరా, డి సిల్వాలు తలో వికెట్ తీసుకున్నారు. 179 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ట్రయల్‌తో బ్యాటింగ్ దిగిన శ్రీలంక జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి దిముత్ కరుణార్తనే (3 పరుగులు) కోల్పోయింది. తిర్మానే 6 పరుగుల వద్ద క్రీజులో ఉన్నాడు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ 17-1 (6) వద్ద ఉంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ


లైఫ్

lifepage2012@gmail.com

శనివారం

26 జనవరి 2019


నేడు గణతంత్ర దినోత్సవం!



కలిసి సాగుదాం..!

మనది మౌలికంగా సమాఖ్య రాజ్యం....కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్పష్టమైన విభజనరేఖతో ...అధికార వికేంద్రీకరణకు బాటలు వేసిన....ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన.. పెద్దదైన లిఖిత రాజ్యాంగం. స్వాతంత్ర్యానంతరం.... జాతీయ పార్టీల హవా కొనసాగినంత వరకు..ఈ సమాఖ్య స్ఫూర్తిని ఎవరూ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి....కానీ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల శకం ప్రారంభమయ్యాక .. సమాఖ్య అనే మాట రాజకీయాల్లో తరచూ వినిపిస్తుందనే చెప్పాలి. కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వాలు అధికారం కోసం రాష్ట్రాల అభీష్టాలను గౌరవించక తప్పని పరిస్థితి కూడా దీనికి మరో కారణం అని చెప్పక తప్పదు...అయితే 2019 లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో దేశంలో .. కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం రాష్ట్రాలను కీలుబొమ్మల్లా ఆడించేందుకు కుయుక్తులు పన్నుతుందన్న ఆరోపణలు విపక్షాల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. కారణాలు ఏవైనా బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా 22 విపక్ష పార్టీలు..ఏపీ సీఎం చంద్రబాబు చొరవతో .. ఇటీవలే కోలకతా కేంద్రంగా రాజకీయ గర్జన చేశాయి. మరో పక్క తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఫెడరల్ ఫ్రంట్ పురుడు పోసుకుంది . రాజ్యాంగం అమలులోనికి వచ్చిన డెబ్బై వసంతాలకు సమాఖ్య అనే నినాదం రాజకీయ యవనికపైకి రావడం వెనుక ఆంతర్యం ఏమిటి? 70వ గణతంత్ర దినోత్సవవేళ.... ఫెడరల్ స్ఫూర్తి..లాభనష్టాలు అనే అంశంపై ప్రత్యేక కథనం!

డెబ్బై వసంతాల గణతంత్ర భారతం...మనది మౌలికంగా సమాఖ్యరాజ్యం.. అందుకే కేంద్ర ప్రభుత్వం..రాష్ట్ర ప్రభుత్వం... అని రెండు రకాల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాల కోసం..రెంటి మధ్య అధికారాల పంపిణీ చేయడం జరిగింది. ఐక్యత...దేశ సమగ్రత,జాతీయ సమైక్యతను దృష్టిలో ఉంచుకుని.. కేంద్ర, రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలు..కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలు, కేంద్ర రాష్ట్ర పరిపాలనా సంబంధాలని మూడు భాగాలుగా విభజించింది. కేంద్ర, రాష్ట్ర శాసన సంబంధాలలో భాగంగా రెండింటి మధ్య అధికారాలను..100 అంశాలతో (కేంద్ర జాబితా,61 అంశాలతో రాష్ట్ర జాబితా,52 అంశాలతో) ఉమ్మడి జాబితా రూపొందించింది.



కేంద్ర జాబితా

కేంద్ర జాబితాలో ఉన్న అంశాలలో రక్షణ, సైనిక దళాలు, సాయుధ దళాలు, విదేశీవ్యవహారాలు, రైల్వేలు, నౌకా యానం, విమానయానం, నౌకా నిర్మాణం, విదేశీరుణాలు, బ్యాంకింగ్, విదేశీ వ్యాపారం,కరెన్సీ పరిశ్రమల నియంత్రణ, తపాలా, జాతీయ మ్యూజియంల నిర్వహణ, జనాభా లెక్కల సేకరణ, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎన్నికలు,సుప్రీంకోర్టు, హైకోర్టులు ప్రధానమైనవి. ఈ అంశాలన్నీ దేశం మొత్తం ప్రజల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించినవి. అందుకే దేశం మొత్తానికి వర్తించేలా శాసనాలు చేయాల్సిన అవసరం ఉంది.

రాష్ట్ర జాబితా

ప్రాంతీయ ప్రయోజనాలు ఆధారంగా రాష్ట్ర జాబితా రూపొందిందని చెప్పాలి. ఈ అంశాలకు సంబంధించి..ఆయా ప్రాంతాలకు అనుకూలంగా శాసనాలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర జాబితాలో శాంతి భద్రతలు, పోలీసు,న్యాయపాలన, జైళ్లు,స్థానిక ప్రభుత్వం, ప్రజారోగ్యం, మద్యపాన నిషేధం,అడవులు, మత్స్య సంపద, నీటి పారుదల, వ్యాపారం, వాణిజ్యం, మార్కెట్లు,వడ్డీ వ్యాపారం, సినిమాలు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వ సర్వీసులు, భూమి శిస్తు మొదలైనవి ప్రధానమైనవి. రాజ్యాంగంలోని 256 అధికరణం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంటు చేసిన చట్టాలకు అనుగుణంగా మాత్రమే తమ కార్యనిర్వహణ అధికారాలను వినియోగించుకోవాలి. దేశ అంతర్గత ప్రయోజనాల పరిరక్షణ కోసం రాష్ట్రాలకు అవసరమైన ఆదేశాలు జారీచేసే అధికారం, స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

ఉమ్మడి జాబితా

ఉమ్మడి జాబితాలోని అంశాలపై దేశం మొత్తం వర్తించే సారూప్యత కలిగిన చట్టాలు చేయడం అభిలషణీయమే..కాని తప్పని సరి కాదు. అందుకే వీటిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రెండింటి పరిధిలో చేర్చారు. ఇందులో ప్రధానమైనవి వివాహాలు, విద్య, వ్యవసాయ భూములు కాక మిగతా ఆస్తుల బదిలీ, సివిల్ ప్రొసీజర్, ట్రస్టులు,ట్రస్టీలు, సాంఘిక భద్రత, స్టాంప్ డ్యూటీలు, కార్మిక సంఘాలు, విద్యుత్ శక్తి,పుస్తకాలు, వార్తాపత్రికలు, వైద్య,న్యాయవాద వృత్తులు, ఫ్యాక్టరీలు తదితరాలు. ఈ అంశాలపై శాసనాలు చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. ఈ జాబితాలోని అంశంపై పార్లమెంట్ చట్టం చేస్తే.. అదే అంశంపై రాష్ట్ర శాసన సభ చేసిన రూపొందించిన చట్టాలు రద్దవుతాయి. కాకపోతే ఉమ్మడి అంశంపై రాష్ట్ర శాసన సభ ముందుగా చట్టం చేసి, దానికి రాష్ట్రపతి ఆమోదం పొందగలిగితే...దాని తర్వాత పార్లమెంటు చట్టం చేసినా.,..ముందుగా శాసన సభచేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది. ఇది ఉమ్మడి జాబితా వినూత్నమైన లక్షణం.

ఇంత స్పష్టత ఉన్నా..!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల పరిధిని రాజ్యాంగంలో ఇంత స్పష్టంగా పొందు పరిచారు. అదే సమయంలో ఉమ్మడి జాబితాను రూపొందించారు.ఇంత సమగ్రంగా మూడు జాబితాలు రూపొందించడం వెనుక రాజ్యాంగ నిర్మాతలు ..మూడూ ప్రయోజనాలు ఆశించారని చెప్పాలి. అందులో ఒకటి రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించి, వాటి చొరవను ప్రోత్సహించడం..నియంతృత్వ పోకడలు పొడసూపకుండా చేయడం. జాతీయ సమైక్యతను కాపాడాల్సిన పరిస్థితులు తలెత్తినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో జోక్యం కల్పించుకునే అధికారం పార్లమెంటుకు కల్పించడం అనేది రెండో ప్రయోజనం. ఇక మూడో ప్రయోజనం ఆవశ్యక రంగాల్లో కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉమ్మడి చర్యలను, సంప్రదింపులను ప్రోత్సహించడం. అందుకోసమే ఉమ్మడి జాబితా.అటు జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లకుండా.. రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి స్థానిక ప్రభుత్వాలు సజావుగా పరిపాలన సాగించే విధంగా రాజ్యాంగం మార్గనిర్దేశకత్వం చేసినప్పటికి..ఇటీవలి కాలంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలకు ఎందుకు విఘాతం కల్గుతున్నట్లు? కేంద్రం మెడలు వంచైనా మా హక్కులు మేం సాధించుకుంటాం అని రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు హూంకరిస్తున్నట్లు?

భిన్నాభిప్రాయాలు

70వ గణతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకునే వేళ.. దేశంలో గతంలో మునుపెన్నడు లేని విభిన్న రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బతినడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ..నియంతృత్వ పోకడలకు పోతోందని, బీజేపీయేతర పార్టీలు అధికారంలో రాష్ట్ర ప్రభుత్వాలు, విపక్షాలు విమర్శల గళం పెంచుతున్నాయి. అందుకే ఇటీవలే కోల్‌కతా వేదికగా 22 పార్టీలు బీజేపీని గద్దెదించడమే ధ్యేయమంటూ గర్జించాయి. ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతున్నదని ఆరోపణలు గుప్పించాయి. మరోవైపు తెలంగాణ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఫెడరల్ ఫ్రంట్ రూపుదిద్దుకుంటోంది. దీని డిమాండ్ అధికార వికేంద్రీకరణ.,. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం తగ్గాలని, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు సాధించాలనేది ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యంగా కనిపిస్తుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం..అదేమీ లేదు అన్ని రాష్ట్రాలను సమానదృష్టితోనే చూస్తున్నామని, నిధులు కేటాయిస్తున్నామని ఘంటా పథంగా చెప్పుకుంటోంది. అయితే ఎవరు చెప్పింది నిజం అనేది పక్కన పెడితే..రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలు వాడివేడిగా వినిపిస్తున్నాయి. ఇక 70 సంవత్సరాలుగా ఇంతగా సమాఖ్య వాదం వినిపించలేదు..కాని ఇప్పుడు వినిపించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఈ అంశంపై రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..!

బలమైన ఫెడరల్ వ్యవస్థ కావాలి

ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు పెరుగుతున్నాయి.. బలం పుంజుకుంటున్నాయి....అధికారాలు ఎక్కువ సంపాదిస్తే.. తమతమ రాష్ట్రాల్లో బలపడవచ్చు అన్న ఆశ వాటిలో పెరిగి పోతోంది. తాము అధికారంలోకి వస్తే..కేంద్రంతో సంబంధం లేకుండా పాలన సాగించవచ్చు, రాజకీయంగా లబ్ధి పొందవచ్చన్న ఆలోచన.. ..ఫెడరలిజం తెరమీదికి రావడానికి కారణం. రాజ్యాంగం ప్రకారం కొన్ని అధికారాలు కేంద్రం పరిధిలో..కొన్ని పూర్తిగా రాష్ట్రాల పరిధిలో,కొన్ని ఇద్దరి మధ్య ఉంటాయి. ఏ సమాఖ్య రాజ్యంలోనైనా ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉండాలి.ఎందుకంటే కేంద్రం, రాష్ట్రం మధ్య ఒక విభజన రేఖంటూ లేదు. ఉండకూడదు కూడా. ఎందుకంటే 135 కోట్ల ప్రజలున్న ప్రజాస్వామ్య దేశం మనది. ఎన్నో అవసరాలు ఉన్నాయి. ఎన్నో కష్టాలు ఉంటాయి. అందుకే గిరిగీసినట్లు ఈ అధికారాలు మావి, ఈ అధికారులు మీవి అని విభజించుకోవడం సరైంది కాదు. రాజ్యాంగం ప్రకారం కేంద్రం కూడా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన అధికారాలను ఇవ్వాలి. కేంద్రం రాష్ట్రాల పట్ల వివక్ష చూపకపోతే ఈ డిమాండ్ బయటకు రాదు.అదే సమయంలో రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నా....వేరే పార్టీ అధికారంలో ఉంది కదా అని..కేంద్రాన్ని బలహీనపరిచే విధంగా ప్రవర్తించడం పొరపాటు. మన దేశానికి బర్మా మినహా ఇతర సరిహద్దు దేశాలతో గొడవలున్నాయి. దేశ సమగ్రత,సమైక్యతను దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలి. కానీ మాకు అధికారాలు ఇచ్చేయండి..మేం పరిపాలించుకుంటాం అనడం మంచిది కాదు. 65 సంవత్సరాల క్రితం అప్పటి పరిస్థితులను బట్టి...కాశ్మీర్‌కు స్పెషల్ స్టేటస్ ఇచ్చారు. కాశ్మీర్‌ను ఉదాహరణగా తీసుకోవడం సరైన పద్ధతి కాదు. దేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలకు ఆదాయం తక్కువగా ఉంటుంది. అలాంటి వాటికి కేంద్రం నిధులు ఎక్కువగా కేటాయించాల్సిన అవసరం ఉంటుంది. ఆ రాష్ట్రాలకు ఇచ్చినంత మాకు ఇవ్వమని ఇతర రాష్ట్రాలు కోరకూడదు. గతంలో తమిళనాడు వాళ్లు మాకు ప్రత్యేక దేశం కావాలని డిమాండ్ చేశారు. ఇలాంటి డిమాండ్లు సమంజసం కాదు. ఎవరికి వారు మాది,మేము.. అనే ధోరణిలో వ్యవహరించడం వల్ల దేశానికి ముప్పు వాటిల్లుతుందని గ్రహించాలి. అందుకే దేశానికి బలమైన ఫెడరల్ వ్యవస్థ చాలా అవసరం.



పెంటపాటి పుల్లారావు, రాజకీయ విశ్లేషకులు

ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటేనే...

మన దేశం.. మన గతం.. ఆ గతంలోని తాత్వికత పట్ల రాజ్యాంగ నిర్మాతలకు స్పష్టత ఉంది. అందుకే ఈ అంశాలు రాజ్యాంగంలో ఉండాలని భావించారు. ఫెడరలిజం అనేది అందులో భాగమే. ఇది 29 పూవులతో అందంగా అలంకరించిన పూలగుత్తి. అందులో ఏ పూవు వాడిపోయినా, కొన్ని మాత్రమే వికసించినా ..రాజ్యాంగ స్ఫూర్తికి భంగం వాటిల్లుతుంది. రాజ్యాంగం ప్రకారం అధికారాల విషయంలో స్పష్టమైన విభజన ఉన్నప్పటికి 70వ గణతంత్ర దినోత్సవాలు జరుపుకునే తరుణంలో రాష్ట్రాలు కేంద్రంపై ఆరోపణలు చేయడానికి ప్రధాన కారణం దేశంలో ఉత్తరాది,దక్షిణాది అనే భావన ప్రబలడం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి దక్షిణాది రాష్ట్రాలలో పట్టులేదు. ప్రాంతీయ పార్టీలు బలం పుంజుకున్నాయి. ఇవి కేంద్రం తమపై పెత్తనం చేస్తోందని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని, ఫాసిస్టు ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నాయి. దీనికి తోడు కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొన్ని రాష్ట్రాలపై శీతకన్ను.. మరికొన్ని రాష్ట్రాలపై వెన్నెల కన్ను చూపడం సహజంగా మారింది. ఇదే తరుణంలో రాష్ట్రాలు కూడా తక్కువేమీ తినలేదు. కేంద్ర వ్యవస్థలనే నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ధోరణి సరైంది కాదు. అలాగే కేంద్రం కూడా రాష్ట్రాల అధికారాలను హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కొన్ని విధానాలు కేంద్ర,రాష్ట్ర సంబంధాలు దెబ్బతినడానికి కారణం అవుతోంది. 1947 ఆగస్టు 29న అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ ముసాయిదా సంఘం ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. 1950 జనవరి 24న 284 మంది ముసాయిదాపై సంతకాలను చేశారు. అందులో మన దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఒకరు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ..అనే పదాన్ని రాజ్యాంగం ముందు మాటలో చేర్చారు.. అయితే ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో 1977,జనవరి 3న...సెక్యులర్,సోషలిస్ట్ అనే పదాలను.. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగం ముందు మాటలో చేర్చడం జరిగింది. ఈ సవరణ ద్వారా చట్టసభలు చేసిన చట్టాలకు ఉన్న రాజ్యాంగ బద్ధతను గూర్చి సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉన్న నిలదీసే.. అధికారాలను కుదించడం జరిగింది. ఈ సవరణ ద్వారా సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలకు చెందిన ఎన్నో అధికారాలు కేంద్రానికి బదిలీ అయ్యాయి. అది అప్పట్లో వివాదాస్పదమైంది. కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా కాదు కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇందిరా అంటూ విమర్శలు వెల్లువెత్తాయి. 1978లో లోక్‌సభలో అప్పటి సీపీఎం సభ్యులు, మాజీ స్పీకర్ సోమనాథ్ చటర్జీ.. మాట్లాడుతూ ప్రజాగ్రహానికి గురైన 42వ సవరణను.. ప్రజలతో పాటు మేమూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. (1977 ఎన్నికల్లో ఇందిరాగాంధి పరాజయం పాలయ్యారు) ఈ సవరణ ఫాసిజానికి, నియంతృత్వానికి ప్రతిరూపమని ఛటర్జీ ధ్వజమెత్తారు. కానీ సెక్యులర్ సోషలిస్టు పదాలను ముందుమాటలో చేర్చడాన్ని మాత్రం ఓటు బ్యాంకు రాజకీయాల దృష్ట్యా వ్యతిరేకించకపోవడం గమనార్హం. మరోవైపు ..1980, జులై 31న 42వ సవరణలోని రెండు అంశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అందులో చట్టసభల నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేయరాదనే నిబంధన ఒకటి. ఉమ్మడి జాబితాలోని అంశాలు నీరుగార్చడం కూడా ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. కేంద్రం పెద్దన్న ధోరణిలో రాష్ట్రాల పట్ల వ్యవహరిస్తోంది. ఉపాధి పథకాల పేరుతో నిధులను నేరుగా గ్రామ పంచాయితీ, జిల్లా స్థాయికి పంపిస్తోంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ ఇష్టానుసారం సొంత పేర్లతో ప్రచారం చేసుకుంటున్నాయి. కేంద్రం అమలు చేసే ఆరోగ్యపథకాలను కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరిం చడం జరుగుతోంది. మీ పెత్తనం ఏంటని ఎదురు తిరుగుతున్నాయి. ఇలా ఫెడరల్ స్ఫూర్తికి భంగం కలిగేలా రాజకీయస్వార్థంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలోనే దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలు సమైక్య గీతం ఆలపిస్తున్నాయి. 2004 నుంచి 2014 మధ్య కాలంలో యుపీఏ, అంతకు ముందు, ప్రస్తుతం ఎన్డీఏ అధికారంలోకి వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో ఏపార్టీ, లేదా కూటమి అధికారంలోకి వచ్చినా రాజ్యాంగ బద్ధమైన ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగకుండా చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



డా.ఆర్.అనంత పద్మనాభరావు
రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్,
దూరదర్శన్, ఢిల్లీ

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

చింతన

ధర్మాచరణ ఎందుకు?

శ్రవణంతోనూ తరణం



అధ్యాయం 13, శ్లోకం- 26

అన్యే త్వేవమజానంతః
శ్రుత్వాన్యేభ్య ఉపాసతే।
తేపి చాతితరంత్యేవ
మృత్యుం శ్రుతిపరాయణాః॥

తాత్పర్యం

ఇంకొందరు ఆధ్యాత్మిక జ్ఞానముతో పరిచయము లేకున్నను ఇతరుల నుండి పరమ పురుషుని గూర్చి శ్రవణము చేసి అతనిని పూజించుట నారంభిం తురు. ప్రామాణికుల నుండి శ్రవణము చేయు ప్రవృత్తి గలవారగుటచే వారునూ జనన, మరణ, మార్గమును తరింపగలరు.

భాష్యం

నేటి ఆధునిక ప్రపంచమునకు ఈ శ్లోకము తరుణోపాయమును చూపించు చున్నది. చాలా మంది విద్వాంసులు, పండితులు, జ్ఞానులుగా చలామణి అగుచున్నా వాస్తవమైన ఆధ్యాత్మిక జ్ఞానము లోపించుచున్నది. ఈ శ్లోకములో తెలుపబడినట్లు ఆధ్యాత్మిక జ్ఞానమును పొందగోరినవారు ఆత్మసాక్షాత్కారము పొందిన వారి వద్దకు వెళ్ళి శ్రద్ధతో శ్రవణము చేయవలెను. ఆధునిక యుగములో ప్రచారము చేసిన శ్రీ చైతన్య మహాప్రభువు, కుతర్కమును వదిలి ఆత్మదర్శులను సమీపించి **'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే, హరే రామ హరే రామ రామ రామ హరే హరే'** అను మహా మంత్రమును వినవలెనని సూచించినారు. సామాన్య మానవులు సైతం ఆ విధముగా శుద్ధ భక్తులను సమీపించి శ్రవణము చేసి, సేవలను అందించి భగవద్భక్తులుగా మారి తిరిగి భగవద్ధామమునకు వెళ్ళ అవకాశమును పొందగలరని దీనిని బట్టి అర్థమగుచున్నది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ధర్మాచరణ స్వభావం వల్ల ఏదో వస్తుందని, ఏదో రావాలని నేను ధర్మాచరణను అనుసరించలేదన్నాడు ధర్మరాజు. ధర్మం వల్ల ఏదో వస్తుందనే లాభాపేక్ష ఉన్నవాడిని పురుషాధముడిగా పేర్కొన్నాడు ఆయన. అయితే అంతిమంగా ధర్మానిదే విజయం. అది వేరుగా కోరుకోనక్కర్లేదు అదే వస్తుంది.



శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానంవిశిష్యతే
ధ్యానాత్కర్మ ఫలత్యాగస్త్యాగాచ్ఛాంతిరనంతరమ్

అనగా అభ్యాసం కన్న శ్రవణాదుల వలన కలుగు తత్త్వనిశ్చయ జ్ఞానం శ్రేష్ఠతరం. ఇట్టి పరోక్ష జ్ఞానం కంటె అపరోక్ష జ్ఞానం కలిగించు ధ్యానం ప్రశస్త తరము. జ్ఞానవంతునకు ధ్యానం కంటె సర్వ కర్మ ఫల త్యాగం సుసాధ్యము. 'కర్మ ఫల త్యాగం శాంతిని కలిగించును' అని శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి ఉపదేశించాడు. కర్మ ఫల త్యాగం శాంతిని కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మనం చేసే సర్వ కర్మలను పరమేశ్వరార్పణం చేసి ఆ కర్మఫలాన్ని కోరుకోని తన భక్తులకు శాంతి కూడా లభిస్తుందంటాడు. అది సాధ్యమేనా? అన్న ప్రశ్న వస్తుంది. ప్రతి వ్యక్తి తను చేసే ప్రతి కర్మకు ఫలితం కోరుకుంటాడు. అది సహజం కూడా. కాని ఫలితం కోరుకుంటే కొన్ని కొన్ని సమయాల్లో అశాంతి కలుగుతుందని గ్రహించాలి.

ప్రతి మనిషి నిత్యం కర్మలు చేస్తాడు. కర్మలు చేయకుండా ఎవరూ ఉండలేరు. కర్మలు రెండు రకాలు. ఒకటి సత్కర్మలు. రెండు దుష్కర్మలు. దుష్కర్మల వలన పాపం వస్తుంది. అవి ఇతరులకు హాని చేస్తాయి. అవి దుఃఖ శోకాలకు కారణమవుతాయి. సత్కర్మల వలన మనకు సద్గతులు ప్రాప్తిస్తాయి. ఇతరులకు మేలు చేస్తాయి. సత్కర్మలు మన ఉన్నతికి తోడ్పడతాయి.

సత్కర్మలు చేసే వారిలో దైవీ సంపదలుంటాయి. ఏ ప్రాణిని ద్వేషించక మిత్రత్వంతో ఉండాలి. ప్రాణుల యెడ స్నేహభావం ఉండాలి. సుఖం కలిగితే పొంగిపోకూడదు. దుఃఖం కలిగితే కుంగిపోకూడదు. క్షమ కలిగి ఉండాలి. సంయమ స్వభావం కలిగి ఉండాలి. ఆత్మతత్త్వవిషయంలో దృఢ నిశ్చయం కలిగి ఉండాలి. అయితే వీటిని ఎలా సాధించగలం?

కేవలం ధర్మబద్ధమైన జీవితం గడిపితేనే మనం ఈ స్థితిని పొందగలం. అందువల్ల ధర్మాన్ని ఆచరించవలసిన అవసరం ఉంది. ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనలను రక్షిస్తుంది. అందువల్ల ధర్మం మనకేమిస్తుంది అని ఆలోచించగా ధర్మాచరణే ఫలంగా భావించడం శ్రేయస్కరం. కీర్తి అపకీర్తులు, సుఖ దుఃఖాలు, మానావమానాలు నీవు చేసిన కర్మననుసరించే లభిస్తాయని పెద్దలు చెబుతారు. అందువలన ఏ కార్యం కర్మ ఫలాన్ని ఆశించి చేయక, ధర్మ మార్గమే ముఖ్యం అనుకోవాలి. ధర్మ మార్గం ఎప్పుడూ సుగమం కాదు. ఆ దారిలో కంటకాలు కూడా ఉంటాయి. స్థిర బుద్ధి కలవాడు కంటకాలు ఏమున్నా బాట మార్చడు.

అర్థ కామాలను ఆర్జించవద్దని శాస్త్రం చెప్పదు. అయితే అంతకన్న ముఖ్యమైన ధర్మాన్ని ఆచరించమని చెబుతుంది. శ్రీరామచంద్రుడు తన తండ్రికి అపకీర్తి రారాదని అతని మాట ఔదల దాల్చి కష్ట భరితమైన అరణ్యవాసానికి వెళ్ళడానికి వెనుకంజ వేయలేదు. 'నాకు సంపదలు, భోగ భాగ్యాల మీద కన్న ధర్మం మీదనే నిష్ఠ ఉంది' అని అన్నాడు. అలాగే ధర్మరాజు కష్టాలను భరించటానికి సిద్ధపడ్డాడు. కాని ధర్మ మార్గాన్ని వీడలేదు. మహాభారతంలో ఒక ప్రసంగం ఉంది. కష్టాలను భరించడం ఎవరికీ ఇష్టం ఉండదు. మాయాజూదంతో ఓడి తన భర్త కష్టాలను కోరి తెచ్చుకున్నాడని ద్రౌపది అనుకుంది. 'రాజన్! మీరు ధర్మం ధర్మం అంటారు. ఆ ధర్మం మీకేమి ఇచ్చింది? ధర్మాన్ని వదలలేని మీరు అన్నదమ్ములు, భార్యతో అరణ్యాలలో తిరుగుతున్నారు. అధర్మ పరాయణుడైన మీ జ్ఞాతి దుర్యోధనుడు సకల భోగాలను అనుభవిస్తున్నాడు. ధర్మాన్ని ఆచరించి మీరు సాధించింది ఏమిటి? అని ధర్మరాజును అడిగింది ద్రౌపది. అందుకు ధర్మరాజు సమాధానం ఇలాగుంది.

నాహం ధర్మ ఫలా కాంక్షీ రాజ పుత్రీ
చరామ్యుతః ధర్మ ఏవ మనః కృష్ణే
స్వభావాచ్చైవ మేధృతమ్
ధర్మ వాణిజ్య కోహీనో జఘన్యో ధర్మవాదినామ్

'ధర్మాచరణ స్వభావం వల్ల ఏదో వస్తుందని, ఏదో రావాలని నేను ధర్మాచరణను అనుసరించలేదు. ధర్మంతో వ్యాపారం చేసే వాడు నీచుడు' అన్నాడు. అంటే ధర్మం వల్ల ఏదో వస్తుందనే లాభాపేక్ష ఉన్నవాడిని పురుషాధముడిగా ధర్మరాజు పేర్కొన్నాడు.

అయితే ధర్మాచరణ వల్ల దుఃఖాలే గాని సంతోషం ఉండదని భావించరాదు. ధర్మాచరణ వల్ల మనకు వెంటనే ఫలితాలు లభించక పోవచ్చు. కష్టాలు కలగనూ వచ్చు. అయితే ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనలను కాపాడుతుంది. అలాంటి వారికి శుభాలు తప్పక కలుగుతాయి. పుణ్యగతులు ఉంటాయి. పన్నెండేళ్ల వనవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం చేసి పాండవులు ధర్మాచరణ కారణంగా కురుక్షేత్ర యుద్ధంలో విజయాన్ని సాధించి రాజ్యాన్ని తిరిగి పొందగలిగేరు. అధర్మపరులైన దుర్యోధనాదులు, మిత్ర బంధు సహితంగా ప్రాణాలు కోల్పోయారు. అందువలన తాత్కాలిక లాభాలను ఆశించి ధర్మాన్ని త్యజించరాదు. ధర్మబద్ధంగా సత్కర్మలు ఆచరించటమే మన విధి. మన ప్రాప్తంలో ఏది ఉన్నదో ఆ సర్వేశ్వరునికి తెలుసు. అతడు ఎప్పుడు ఏది ఇవ్వాలో ఎంత ఇవ్వాలో తప్పక ఇస్తాడు. అతను మనకు అండగా ఉండడానికి ఎప్పుడూ సిద్ధమే. అందువల్ల మనం ఆ పరమాత్మను శరణు కోరాలి. **'యతో ధర్మస్తతో జయః'** అన్నది వేద మంత్రం. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ విజయం తథ్యం. ఈ విషయాన్ని మనస్ఫూర్తిగా నమ్మి ఆచరించాలి. అదే సుపథానికి దారి.

- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్)
09755110398

విధ్యుక్త జీవనాన్ని అలవరచుకోవాలి



భారతీయ శాస్త్రాలు, పురాణాలు మానవుల జీవితాలు సాఫీగా సాగడానికి కొన్ని విధి నిషేధాలు విధించాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వాటి ప్రకారం చేయకూడని పనులను ఇంతకు ముందు తెలుసుకున్నాం. అయితే మానవుని నడక, నడత సాఫీగా సాగాలంటే, ఫలవంతం కావాలంటే చేయకూడని పనులు మానేయడమే కాదు చేయవలసిన విధులు కూడా నిర్వహించాలి. నిత్య జీవితంలో ఆచరించాల్సిన విధులేవో తెలుసుకుందాం. వీటిలో మొదటిది అందరికీ తెలిసినదీ అతి ముఖ్యమైనది తల్లి తండ్రులను, గురువులను గౌరవించడం.

* తల్లి తండ్రులకు నిత్యం పాదనమస్కారం చేయాలి. ఇంతకు మించిన ధర్మం మరొకటిలేదు. ఇలా నిత్యం పాద నమస్కారం, నిత్యాన్నదానం చేయడం కంటె పుణ్యకార్యం

* నిద్ర నుంచి లేవగానే మొదట అరచేతులను చూసుకోవాలి. వామన నామస్మరణ చేయాలి.

* తూర్పు, దక్షిణ దిక్కులకు తలపెట్టి నిద్రపోవాలి. బాంధవ్యాన్ని బట్టి జనన మరణ వార్తలు విన్నప్పుడు స్నానం చేయాలి

* పురాణ గ్రంథాలను దానం చేయడం మంచి పుణ్య కార్యం. అలా ఈ పురాణ గ్రంథాలను దానం చేసినవారు విద్యావేత్తలవుతారు. జీవితంలో అనవసర విషయాలకు బాధపడకుండా సంతోషంగా ఉంటే ఐశ్వర్యం కలుగుతుంది.

* పిల్లనిచ్చిన మామ, గురువు, సహోదరుడు అయిన పెద్దన్న కన్న తండ్రితో సమానం కనుక వారిని తండ్రి వలె గౌరవించాలి.

* గురువు ద్వారా మంత్రోపదేశం పొందినవారు తరిస్తారు.

* వేప చెట్టును నాటడం, రావి చెట్టును పూజించడం, మేడిచెట్టుకు ప్రదక్షిణం చేయడం, మామిడి పండ్లను దానం ఇవ్వడం అశ్వమేధ ఫలాన్ని ఇస్తాయి.

* పాడైపోయిన, శిథిలమైన దేవతా విగ్రహాలను, పటాలను, బొమ్మలను ప్రవహించే నదిలోకాని, సముద్రంలో కాని కలపాలి. అది సాధ్యం కాని పక్షంలో గొయ్యి తీసి పాతిపెట్టాలి.

* కాలినడకన తరచుగా పుణ్య క్షేత్ర దర్శనం మంచిది. దీనిని కాయక తపస్సు అంటారు. ఈ దర్శనాల వల్ల ఉత్తమ జన్మలు కలుగుతాయి.

* మంత్ర ఉపదేశ సమయంలో, పురాణాదులు వినే సమయంలో గురువు పాదాలను వత్తాలి. ఇలా చేస్తే ఏడు జన్మల పాపాలు తొలగుతాయి.

* పుష్కరాల సమయంలో స్నానం, శ్రాద్ధ కర్మ ఎవరైనా చేయవచ్చు, చేసి తీరాలి.

* దీపారాధనకు అగ్గిపెట్టె వాడకూడదు అనే నియమం లేదు.

* భోజనం తూర్పు, ఉత్తర దిక్కులుగా కూర్చుని చేయాలి.

* అన్నదానం విశేష పుణ్యప్రదం

* అన్నం తిన్నాక ఎంగిలి ఆకులు ఎత్తడం ఎంతో ఫలదాయకం. ఈ ఆకులు ఎత్తిన వారికి అన్నదాతకు వచ్చే దాని కన్న ఎక్కువ పుణ్యం దక్కుతుంది.

* నిత్యాన్నదానం విశేష ఫలదాయకం.

* నవగ్రహ ప్రదక్షిణ, పూజానంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించవచ్చును.

* మృతదేహాన్ని ఇంటి వద్ద ఉంచడానికి అనుమతించడం పుణ్య ప్రదం. మృతదేహాన్ని మోయడం కూడా పుణ్యకార్యమే. ఈ రెండింటిలో ఏది

'రమ'ణీయం

చేసినా స్వర్గానికి వెళ్లేందుకు అర్హత పొందుతారు.

* ఏ కారణం చేతనైనా చెట్టును నరక వలసి వస్తే మూడు మొక్కలను నాటాలి.

* కొడుకు పుట్టిన వెంటనే తండ్రి కట్టు బట్టలతో స్నానం చేయాలి.

* దీపారాధనకు ఒక కుందె మాత్రమే వాడినపుడు దానిలో మూడు వత్తులు వేయాలి.

* గడపదాటి మాత్రమే భిక్ష వేయాలి.

* ఇల్లాలికి చెప్పి మాత్రమే ఎవరినైనా భోజనానికి పిలవాలి.

* దాన కార్యాలు ఉదయం సమయంలో చేయడమే మంచిది. ఉదయం పూట చేసిన దానాలే విశేష శుభాన్ని ఇస్తాయి.

* శుభ కార్యాలకు వెళ్ళే సమయంలో స్త్రీలు ముందుండాలి. అశుభం అయితే స్త్రీలు వెనుక ఉండాలి.

* గురువు ఇంటికి వస్తే లేచి వెళ్ళి ఆదరంగా ఆహ్వానించి ఉచితాసనం చూపి కూచోబెట్టాలి. ఇంటికి వచ్చిన గురువును సాగనంపే సమయంలో కొంచెం దూరం అనుసరించాలి.

* శ్రాద్ధంలో భోక్తగా మిత్రుని పెట్టరాదు. అతిథిగా భోజనం పెట్టవచ్చు.

* గృహప్రవేశ సమయంలోగాని, ఇల్లు నిర్మాణం అయిన సంవత్సరం లోపు గాని అక్కడ మణి ద్వీప పారాయణ చేయడం మంచిది. దీని వల్ల వాస్తు దోషాలు తొలగుతాయి.

* అష్టమి, చతుర్దశి, పౌర్ణమి తిథులలో స్వయం పాకం దానం ఇవ్వడం మంచిది. అర్చకులకు, గురువులకు, పౌరాణికులకు తగిన విధంగా పారితోషికం ఇవ్వాలి. వారి రుణం ఉంచుకోకూడదు.

* ఉపనయనం చేసిన వారు, పిల్లనిచ్చిన మామ, ప్రతి వ్యక్తికి తండ్రితో సమానం.

* ఆప్తుల విషయంలో తన కన్న తక్కువ వయసున్న వారి నుంచి ధనాన్ని అందుకుని తీసుకోకూడదు. వారు తాము ఇవ్వదలచిన ధనాన్ని ఏదైనా వస్తువు మీద పెడితే అక్కడి నుంచి తీసుకోవచ్చు.

* వార నియమం ఉన్న వారు ఆయా రోజుల్లో హోటల్లో తినకూడదు, ఇంటిలో చేసుకున్నవే తినాలి. అంతేకాక తయారుచేసిన వాటిలో ఉల్లి నిషిద్ధం.

* భార్యను తప్ప మిగిలిన స్త్రీలందరినీ మాతాస్వరూపులుగా చూడాలి.


* బ్రాహ్మీ ముహూర్తంలో (ఉదయం 4-5 గంటల మధ్య) స్నానం చేయాలి.

* పూజ చేసేటపుడు నేరుగా నేల మీద కూచోరాదు. చాప లేదా ఏదైనా వస్త్రం వేసుకుని కూచోవాలి.

* ఎల్లప్పుడూ సరళంగా, సునిశితంగా పరహితంగా, శుభయుతంగా మాట్లాడాలి.

* సర్వుల హితాన్ని ఎల్లప్పుడూ కోరుకోవాలి.

ఇవి ప్రతి వ్యక్తి చేయాల్సిన పనులలో కొన్ని. చేయకూడనివి ఇంతకు ముందే తెలుసుకున్నాం. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ, విచక్షణ ఉపయోగించుకుంటూ నిత్య జీవితంలో మన విధులను ఆచరించాలి. నిషిద్ధములైన వాటిని విడనాడాలి. వీటన్నిటి వెనుక ప్రయోజనకరమైన ఒక రహస్యముందని గ్రహించాలి. వాదాలు, వివాదాలు, వాదోపవాదాల జోలికి పోకుండా జీవితాన్ని సుఖమయం చేసుకుందాం.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

దిన ఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభ పరిణామాలు చోటు చేసుకొంటాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొంద గలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేక పోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవి చూస్తారు.

కుంభ రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. అలసత్వం పెరుగుతుంది. అవకాశాలను సద్వినియోగ పరచు కోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



పుత్ర కామేష్టి

బాలల రామాయణం

సరయూ నది తీరంలో
శత్రువుల కభేద్యమైన
అయోధ్యానగరమదే!
అందాల పురమ్మదే!
దశదిశలా ఖ్యాతిగన్న
దశరథుడది గదిగో!
ఇక్ష్వాకుల వంశంలో
ఆ కౌసల దేశంలో
ఎదురులేని రాజు అతడు
ఎంతో ధర్మమూర్తియతడు!
కౌసల్య, సుమిత్ర,కైక
ముప్వురు రాణులు వున్నా
సంతానం కలుగలేదు
చాలాకాలం వరకు!
అప్పుడు రుష్యశృంగునిచే
తపోదీక్ష మాదిరిగా
పుత్రకామేష్టియనెడు
పుణ్యయజ్ఞమే చేయగ
నలుగురు పుత్రులు కలిగిరి

నాయకుడౌ దశరథునకు!
కౌసల్యకు శ్రీరాముడు
కైకకు భరతుడు కలుగగ
లక్ష్మణ శత్రుఘ్నులేమొ
సుమిత్ర సుతులై పెరిగిరి!
రాముడనగ లక్ష్మణునికి
భరతుడనగ శత్రుఘ్నునకు
ఒండొరులకు అనురాగం
మెండుగ అభివృద్ధిగాంచె!
వినయములోనే గాకను
విలువిద్యలో అజేయులై
కనువిందుగ అయోధ్యలో
కదలాడిరి ఆ నలుగురు!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్ :9246541699



భళి రా భళి సాహో...!

గణతంత్ర వేడుకనాడు ఘన సత్కారం

మీకు తెలుసా? ప్రతీ సంవత్సరం రిపబ్లిక్ డే సందర్భంగా మన దేశంలో కొందరు సాహసబాలలకు ఇచ్చే అవార్డుల ప్రదానోత్సవం ఇవ్వాళే జరుగనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ సాహసబాలలు అవార్డులను అందుకోబోతున్నారు. వారి ధైర్యం, త్యాగాలకు గుర్తింపుగా జాతీయస్థాయిలో సాహస బాలలను ఎంపిక చేసే భారత బాలల సంక్షేమ మండలి ఈ ఏడాది 21 మందిని ఎంపిక చేసింది. వారు ప్రదర్శించిన ధైర్య సాహసాల గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.



సన్మానం అందుకోబోయేది వీరే

ప్రతి సంవత్సరం జాతీయ సాహస పురస్కారాలను 16 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న బాలలకు ఈ పురస్కారాలను ఇస్తున్నారు. ఐదు శ్రేణుల్లో వీటిని పంచుతారు.

భారత్ పురస్కార్ కొరకు ఈ సంవత్సరం జమ్మూకు చెందిన తొమ్మిదేళ్ల హిమ ప్రియ, 14 ఏళ్ల సౌమ్యదీప్ జాన్‌కు ఇస్తున్నారు. ఢిల్లీకి చెందిన 15 ఏళ్ల నితీషా, గుజరాత్‌కు చెందిన ఏడేళ్ల గోహిలా జయ్‌రాజ్ సింగ్, రాజస్థాన్‌కు చెందిన తొమ్మిదేళ్ల అనికా జైమీన్, మేఘాలయకు చెందిన 13 ఏళ్ల కైతీ కరబింగర్, ఒడిశాకు చెందిన 15 ఏళ్ల సీతూ మాలిక్, వీరితో పాటు సాహస బాలల పురస్కారాలను ఒడిశాకు చెందిన తొమ్మిదేళ్ల రీఘులీబాగ్, కర్నాటకు చెందిన 15 ఏళ్ల సీడీకృష్ణనాయక్, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 16 ఏళ్ల సీమా, చత్తీస్‌ఘడ్‌కు చెందిన 13 ఏళ్ల రితికా సాహు, 12 ఏళ్ల జుగేంద్రా సాహు, 13 ఏళ్ల కువార్ దివ్యాంశ్ సింగ్, మణిపూర్‌కు చెందిన 14 ఏళ్ల వాహేంగ్‌బమ్ లమ్‌గావ్ సింగ్, ఒడిశాకు చెందిన రంజిత్ ముర్ఘు, ఢిల్లీకి చెందిన మందీప్ కుమార్ పాఠక్, ఒడిశ్శాకు చెందిన 11ఏళ్ల విశ్వజీత్ , చత్తీస్‌ఘడ్‌కు చెందిన 10 ఏళ్ల శ్రీకాంత్,, కేరళకు చెందిన 14 ఏళ్ల షిగిల్, 10 ఏళ్ల అశ్విన్ సజీవ్‌లకు ఇస్తున్నారు.

హిమప్రియ

గత సంవత్సరం తీవ్రవాదులు జమ్మూలోని ఆర్మీ శిబిరం మీద దాడి చేశారు. వాళ్లు వరుసగా ఫైరింగ్ చేస్తున్నారు. లోపలికి



చొరబడటానికి ప్రయత్నిస్తున్నారు. ఒక ఆర్మీ హవాల్దార్ కూతురు అయిన హిమా ఆమె తల్లి అక్కడే చిక్కుకుపోయింది. తీవ్రవాదుల చేతుల్లో తుపాకులున్నాయి. కానీ హిమ మాత్రం భయం లేకుండా ముందుకెళ్లింది. తీవ్రవాదుల ముందుకెళ్లింది. అప్పుడే తీవ్రవాదులు ఇంట్లోకి ఒక హ్యాండ్ గ్రనైడ్ విసిరేశారు. హిమ తల్లి తీవ్రంగా గాయాలపాలయ్యింది. స్పృహ కోల్పోయింది. హిమ కుడిచేయి గాయానికి గురైంది. హిమ నెత్తిమీద తుపాకీ మాత్రం ఉంది. అయినప్పటికీ తీవ్రవాదుల కళ్లు గప్పి తన తల్లితో పారిపోయింది.

కైమేలియా కైథీ ఖర్‌బింగర్



ఆమె ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆందోళనలో ఉన్న వాళ్లు ఇల్లు వదిలి బయటకి పారిపోయారు. ఇంట్లో ఎవరెవరు ఉన్నారన్న విషయం అంతా మర్చిపోయారు. అయితే మానసిక వికలాంగుడైన పెద్దన్నయ్య ఇంట్లోనే ఉండిపోయిన విషయాన్ని కైమేలియా గమనించింది. వెంటనే పెద్దగా అరిచింది. ఆమె అరుపులు వినిపించలేదు. దీంతో ఆమె అగ్నికీలల్లో దూకి పెద్దన్నయ్యను బయటకు తీసుకొచ్చింది.

సేతు మాలిక్



మొసలిపేరు వింటేనే మంచి మంచివాళ్లకే భయంతో వణికిపోతారు. కానీ ఒడిశాకు చెందిన సేతుమాలిక్ మొసలి నుంచి తన బాబాయ్ ప్రాణాలను రక్షించాడు. మొసలి నెత్తిమీద తీవ్రంగా దాడి చేయడంతో అతని బాబాయ్‌ని వదిలిపెట్టి అది పారిపోయింది.

నితీషా నేగీ



నితీషా నేగీ మంచి ఫుట్‌బాల్ క్రీడాకారిణి. ఆమె పసిఫిక్ స్కూల్ గేమ్స్ కొరకు ఆస్ట్రేలియా వెళ్లింది. సముద్ర బీచ్ దగ్గరకి వెళ్లింది. అనుకోకుండా అక్కడ పెద్ద అల వచ్చింది. బ్యాలెన్స్ తప్పింది. అదే సమయంలో నితీషా నేగీ స్నేహితుడి నీళ్లలో కొట్టుకుపోతున్నాడు. నితీషా అక్కడికి వెళ్లగలిగింది. అతడిని సురక్షితంగా తీసుకురాగలిగింది.

సౌమ్యదీప్ జాన్

ఈ బాలుడు కూడా తీవ్రవాదులతో పోరాడాడు. తీవ్రవాదులు ఆర్మీ క్యాంపు మీద దాడి జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్నాడు. తీవ్రవాదులనుంచి తల్లిని సోదరిని రక్షించడానికి సాహసమే చేశాడు. రక్షించగలిగాడు. ఒక గదిలో వారిరువురిని బంధించాడు.

ముస్కాన్, సీమా





హిమాచాల్ ప్రదేశ్‌కు చెందిన ఈ బాలికలు పోకిరిలకు గుణపాఠం చెప్పారు. పోకిరిలను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. వీరిద్దరు పెద్దయిన తర్వాత ఆర్మీలో చేరాలని ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు.

మోక్షం

సన్నీ స్కూలుకి గాడిదను తీసుకొచ్చాడు.
టీచర్: దీన్నెందుకు తీసుకొచ్చావ్?
సన్నీ: టీచర్, మీరు ఎప్పుడు అంటుంటారు నేను పెద్ద పెద్ద గాడిదలను కూడా మనుషులుగా మార్చేస్తాను అని.. కాబట్టి నేను ఆలోచించా వీటికి కూడా మోక్షం దొరుకుతుందేమోనని...



పక పక

పంచుకుంటాను

అమ్మాయి: నేను పెళ్లయిన తర్వాత మీ కష్టనష్టాలను పంచుకుంటాను.
అబ్బాయి: కానీ నాకు ఇప్పటివరకు ఎలాంటి కష్టనష్టాలు లేవు మరి.
అమ్మాయి: నేను మాట్లాడుతుంది ఇప్పటివిషయం కాదు పెళ్లి అయిన తర్వాత ...






మంచి బట్టలు

భార్య: వినండి, మీ బర్త్‌డే సందర్భంగా మంచి మంచి బట్టలు తీసుకున్నాను.
భర్త(సంతోషంతో): తీసుకురా చూద్దాం.
భార్య: అయితే ఆగండి. ఇప్పుడే వేసుకుని వస్తాను మరి..



బృంద క్రీడ

కథ



తొండమనాడు రాజు లోకేశ్వరవర్మ తమ రాజ్య సైన్యాన్ని విస్తరించాలని నిర్ణయించినాడు. సైన్యాధికారి అప్పాపిళ్లైతో విస్తృత చర్చలు జరిపాడు. రాజ్యసైన్యం చిన్నదని, పెద్దరాజ్యాలు దండెత్తితే ఓటమి సంభవిస్తుందనీ హెచ్చరించాడు. రాజ్యంలోని యువతకి రాజ్యభక్తి నూరిపోసి దళాలను పెంచాలని ప్రణాళిక రచించాడు.

సైన్యంలోని చురుకైన నలభైమంది ప్రతినిధులను ఎంపిక చేయాలి. వారు నలభైరోజులపాటు పల్లెలన్నీ తిరిగి ప్రచారం చేయాలి. సైనిక అర్హత కలిగి శారీరక, మానసిక సామర్థ్యం వున్న యువకులను వారు ప్రోగు చేసి సైన్యం అభివృద్ధి చేయాలి.

సైన్య ప్రతినిధులను పెంచలకోన అడవులకు తీసుకెళ్లి శిక్షణ ప్రారంభించారు. జలపాత స్నానం, యోగ, ధ్యానం, శారీరక వ్యాయామం చేయించారు. స్వదేశీ అభిమాన పాఠ్యప్రణాళికను అంశంగా చేసి తత్వ, మనస్తత్వ శాస్త్రములు కూడా నేర్పించారు. చక్కగా మాట్లాడటం, ఆశావాద దృక్పథం కలిగి వుండటం కూడా చెప్పించారు. వీటితో పాటు సాంస్కృతిక బృందాలు కూడా పల్లెలు తిరగాలి. బుర్రకథ, హరికథ, నాటికలు, పాటలు, పద్యాలు, గారడీ, ఇంద్రజాలం లాంటివి నిర్వహించి యువతను జాగృతం చేసి సైన్యం వైపు ఆకర్షింపబడేలా చేయాలి.

నలభైరోజుల శిక్షణ పూర్తి అయ్యింది. పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామికి విశేష పూజలు జరిపి వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకొని గుర్రాలలో పల్లె ప్రాంతానికి బయలుదేరారు. పల్లెలన్నీ తిరిగినారు. రాజ్య సైన్య విస్తరణ ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయం నుండి రాత్రిళ్లలో ఇండ్లకు చేరే రైతుల కోసం రాత్రి సమావేశాలు ఏర్పరిచారు. ఆసక్తిగావున్న యువకులను సైన్యంలో చేరవలసిందిగా పిలుపు ఇచ్చారు. వారి విస్తృత ప్రయాణం మూడు వారాలపాటు సాగింది. అయితే వారి ప్రచారానికి సరైన స్పందన రాలేదు. వందమంది కూడా సైన్యంలో చేరలేదు. రాజుగారు ఆలోచనల్లో పడ్డారు. సైనికాధికారితో మాట్లాడి సైనిక ప్రతినిధులకు రెండురోజులపాటు పునఃశ్చరణ తరగతులు నిర్వహించి సమీక్షలు చేయనారంభించారు.

సైనిక ప్రతినిధులు డీలాపడి వున్నారు. నిరాశ నిస్పృహలతో శక్తిహీనులై అగుపించారు. వారి ముఖాలు కత్తివేటుకు చుక్క రక్తం రాని చందాన, దిగులుగా వున్నారు. సైన్యంలో చేరడానికి పెద్దలు సిద్ధంగా లేరన్నారు. తమని తమ పిల్లల నుంచి దూరం చేసే దయ్యాలుగా వర్ణించి తిట్టారని చెప్పారు. వితంతువులైన స్త్రీలు తమ మీద ఎగిరిపడ్డారని ఊరినంతా వితంతువులతో నింపుతారా? అని నిలదీశారని పేర్కొన్నారు. కొన్ని ఊళ్లు పూర్తిగా సహకరించలేదని, మరికొన్ని ఊర్లు దాడి చేసేంత పని చేశాయని బాధపడ్డారు. రాజుగారు దీర్ఘంగా ఆలోచించి వారికి బృందక్రీడ ఏర్పాటు చేస్తూ ప్రతీ పదిమంది ఒక బృందంగా తయారవ్వాలి. వారిలో ఒకరిని మధ్యలో కూర్చోబెట్టాలి. మిగిలిన తొమ్మిదిమంది గుండ్రంగా కూర్చొని తిట్లదండకం ప్రారంభించాలి. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాలి. రకవారి తిట్లు 20 నిమిషాలపాటు తిట్టాలి. మూకుమ్మడిగా వారు చేస్తున్న విమర్శలను, తిట్లను మధ్య వ్యక్తి మౌనంగా భరించాలి. నవ్వుతూ వుండాలి. ఎదురు తిరగరాదు. ఎవరు ఏ విధంగా తిట్టినా ఓపికతో వుండాలి.

ఈ విధంగా బృందంలోని ప్రతి ఒక్కరూ మధ్యలో కూర్చొని తిట్లను స్వీకరించాలి. అందరూ భాగస్వాములు కావాలి. ఎవ్వరికీ మినహాయింపు లేదు. నాలుగు బృందాలలోని నలభైమంది ఈ అనుభవం జరగాలి. బృందక్రీడ తర్వాత అందరూ శవాసనం వేయాలి. దీనితో మీకు మానసికంగా విమర్శలను ఎదుర్కొనే శక్తి లభించి రాటుదేలుతారు. బుద్ధిపరిపక్వమవుతుంది. తిట్లకు పెద్ద ప్రాముఖ్యం ఇవ్వరు. ఎవరు ఏమి అనినా కార్యసిద్ధిపైనే కన్నుం టుంది. పెద్దకార్యం తలపెట్టినప్పుడు తిట్లు సహజమని, గమ్యం చేరేవరకు వాటిని పట్టించుకోరాదనీ తెలుస్తుంది.

వీరులారా! నిరుత్సాహపడకండి. ఇష్టంగా సైన్యంలో చేరేవారి సంఖ్య ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది. అభ్యంతరాలు వస్తాయి. వాయిదాలు వేస్తారు. కుంటిసాకులు చెబుతారు. దినదిన గండమైన వృత్తిలో చేరాలంటే బెదురుతారు. మనంవారికి భరోసా ఇవ్వాలి. సైన్యంలో చేరిన వారంతా చనిపోరని నచ్చజెప్పాలి. ప్రాణభయంవున్నవారికి ప్రాణమంటే చులకనభావం వచ్చేట్లు రాజ్యభక్తిని నూరిపోయాలి. జన్మించిన ప్రతి ఒక్కరూ చనిపోతారని, అయితే పుడమితల్లి రుణం తీ ర్చుకునే అవకాశం సైన్యానికి మాత్రమే వుందని గుర్తు చేయాలి. ప్రాణం ఒక్కసారే పోతుందని, అదికూడా తన రాజ్యం కోసం, భావితరాల సంక్షేమం కోసం ప్రాణాలను అర్పించడం అదృష్టమనీ వారికి తెలియజేయాలి. గుంపులు గుంపులుగా కాకుండా వ్యక్తిగతంగా హితబోధ జరగాలి. వాదనలు పనికిరావు. ఒప్పించాలి. వారిని రాజ్యభక్తి కోణంలో గురిచూసి మెప్పించాలి. వ్యక్తి శ్రేయస్సుకన్నా జాతి శ్రేయస్సు ముఖ్యమని వారిని ధృఢంగా నమ్మించాలి అని ప్రేరణోపన్యాసం చేశాడు. రాజుగారి లోతైన విశ్లేషణకు సైనిక ప్రతినిధులు అబ్బురపడ్డారు. వృత్తిలోకానీ, ప్రవృత్తిలో కానీ గెలవాలంటే సమస్యలను, విమర్శలను ఎదుర్కొంటేగానీ ఎదగలేమని తెలుసుకున్నారు. బృందక్రీడలలో పాల్గొని మత్తు వదిలినట్లుగా లేచి రెండింతల ఉత్సాహంతో పల్లెలలో నిర్విరామంగా తిరిగి వేలాదిమంది సైన్యంలో చేర్చారు.

- ఆర్‌సి కృష్ణస్వామి రాజు

మళ్లీ క్రేజీ కాంబినేషన్


బాలకృష్ణ


నయనతార

బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌కు ఎంత క్రేజ్ ఉందో తెలియంది కాదు. సింహా, లెజెండ్ వంటి సూపర్‌డూపర్ హిట్ చిత్రాలు వారి కలయికలో రూపొందడమే అందుకు కారణం. కొద్దిరోజులుగా వినిపిస్తున్నట్లుగానే వారి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడవ చిత్రానికి తెరవెనుక సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. ఎన్.టి.ఆర్. బయోపిక్ రెండు చిత్రాల్లో భాగంగా ఇటీవలే ఎన్.టి.ఆర్.కథానాయకుడు విడుదల కాగా ఎన్.టి.ఆర్. మహానాయకుడు ఫిబ్రవరి ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తన నూతన చిత్రాన్ని కూడా బాలకృష్ణ లైన్‌లో పెట్టేశారు. వి.వి.వినాయక్ దర్శకత్వంలో ఓ చిత్రం, బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం బాలకృష్ణచేయబోతున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్.టి.ఆర్.బయోపిక్ చిత్రాల తర్వాత ఏ దర్శకుడితో ఆయన ప్రయాణం చేయబోతున్నారన్న అంశంపై స్పష్టత రాలేదు. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం ముందుగా బోయపాటి దర్శకత్వంలో రూపొందబోయే చిత్రం కోసమే బాలకృష్ణ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రేక్షకాభిమానుల అంచనాలకు తగ్గట్టుగానే మాస్ అంశాలతో వారిద్దరి కలయికలో రూపొందబోయే చిత్రం ఉంటుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి నెలలోనే ప్రారంభిస్తారని అంటున్నారు. ఇదిలావుండగా...బోయపాటి దర్శకత్వం వహించిన వినయ విధేయ రామ చిత్రం ఇటీవల విడుదలై...డివైడ్ టాక్ తెచ్చుకున్నా కలెక్షన్ల విషయంలో బోయపాటి స్టామినాను మరోసారి రుజువు చేసింది.

బోయపాటి శ్రీను

దేశాన్ని మనసులో పెట్టుకున్నారు


సల్మాన్‌ఖాన్

దేశం మనకు ఏమి ఇచ్చింది అనడం కంటే...దేశానికి మనం ఏం ఇస్తున్నామని ప్రతీఒక్కరూ ఆలోచించాలని అంటారు. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న భారత్ చిత్రంలో కూడా దేశభక్తికి సంబంధించిన అంశాలుంటాయని చెబుతున్నారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం టీజర్ చూస్తేనే ఆ విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్, టబు, జాకీష్రాఫ్, సోనాలి కులకర్ణి, దిశాపటాని తదితరులు ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ చిత్రానికి అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో సల్మాన్‌ఖాన్ ఫిల్మ్స్, రీల్ లైఫ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల నేపథ్యంలో తెరకెక్కుతోంది. కాగా శుక్రవారం విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు విశేషమైన స్పందన లభిస్తోంది. నీ ఇంటి పేరేంటి? జాతి పేరేంటి? అని ప్రజలు సల్మాన్‌ను ప్రశ్నిస్తుంటారు. దానికి ఆయన స్పందిస్తూ...మా నాన్న దేశాన్ని దృష్టిలో పెట్టుకుని నాకు భారత్ అనే పేరు పెట్టారని బదులిస్తారు. ఇలా ఆసక్తికరంగా ఈ టీజర్ సాగుతుంది. దీంతో చిత్రంపైన అంచనాలు మరింతగా పెరిగాయి. రంజాన్‌కు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని రానున్నారు.

నయా విధానం

తమిళంలో లేడీ సూపర్‌స్టార్‌గా పేరుపొందిన నయనతార దక్షిణాది భాషల చిత్రాలతో మొదట్నుంచి బిజీగానే ఉంటోంది. గత కొన్నేళ్లుగా ఎప్పుడూ ఆమె చేతిలో అరడజను చిత్రాలకు తక్కువ కాకుండా ఉంటున్నాయి. ప్రస్తుతం తమిళంలో నాలుగు, తెలుగు, మలయాళ భాషల్లో ఒక్కో చిత్రం చొప్పున ఈ ఏడాది కూడా అరడజను చిత్రాలతో ఆమె సందడి చేయబోతోంది. తెలుగులో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మెగాస్టార్ చిరంజీవి టైటిల్ పాత్రలో తెరకెక్కుతున్న సైరా..నరసింహారెడ్డి చిత్రంలో ఆమె ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో సిద్ధమ్మ పాత్రలో ఆమె కనిపిస్తుందని అంటున్నారు. ఇదిలావుండగా...ఎప్పుడూ ఏదోవిధంగా వార్తలలో ఉండే నయన్ తాను విధించుకున్న షరతులకు తాత్కాలికంగా సడలింపు ఇవ్వనున్నట్లు సమాచారం. సాధారణంగా తాము నటించిన సినిమాల ప్రమోషన్స్‌లో నటీనటులు పాల్గొనడం చూస్తున్నదే. అయితే కొందరు ఆర్టిస్టులు తీరికలేకపోవడం వల్లనో లేక ఇంకేదైనా కారణం చేతనో ప్రమోషన్స్‌లో పాల్గొనలేకపోతుంటారు. నయన్ కూడా సినిమా ప్రమోషన్స్‌కు రాకపోవడం ఎన్నో విమర్శలకు తావిస్తోంది. తనపై వచ్చిన విమర్శల గురించి పట్టించుకోకుండా నయన్ తన పని తాను చేసుకుంటూ పోతుంటుందని కూడా అంటారు. తాజాగా సైరా...నరసింహారెడ్డి చిత్రం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో చిత్రం ప్రమోషన్స్‌కు హాజరు కావాలని నయన్‌ను నిర్మాత రామ్‌చరణ్ అడిగారట. మెగాస్టార్ నటిస్తున్న చిత్రం కావడంతో పాటు చారిత్రక ప్రతిష్ఠాత్మక చిత్రం కావడంతో ప్రమోషన్‌కు నయన్ అంగీకరించినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.

అంతా అడుగుతున్నారని


అర్షద్ వార్సీ

నవ్వుల సినిమాకున్న సత్తాను చూపించిన బాలీవుడ్ చిత్రం గోల్‌మాల్. హాస్య చిత్రాలు ప్రేక్షకులకు నచ్చితే దక్కే ఆదరణ ఏ స్థాయిలో ఉంటుందో నిరూపించిందీ చిత్రం. హిందీ తెరపై ఘన విజయం సాధించిన సినిమా శ్రేణి కూడా గోల్‌మాల్‌నే. ఈ శ్రేణిలో ఇప్పటికే నాలుగు సినిమాలు తెరకెక్కాయి. ప్రతి సినిమా ప్రేక్షకులను నవ్విస్తూనే సాగింది. ఇప్పుడు గోల్‌మాల్‌లో ఐదో చిత్రం రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దర్శకుడు రోహిత్ శెట్టి ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. రోహిత్ శెట్టి ఇటీవలే రన్వీర్ సింగ్‌తో సింబా అనే సూపర్‌హిట్ సినిమా రూపొందించారు. ఇది మన టెంపర్ సినిమాకు రీమేక్ చిత్రం. గోల్ మాల్ సిరీస్‌లో ఐదో సినిమా ఉంటుందని తెలిపారు నటుడు అర్షద్ వార్సీ. అర్షద్ ఈ శ్రేణిలోని అన్ని చిత్రాల్లో నటించారు. ఆయన మాట్లాడుతూ...గోల్‌మాల్ సిరీస్‌లో కొత్త సినిమా ఉంటుంది. ఈ ఐదో చిత్రం కూడా గత చిత్రాల్లాగే ఆద్యంతం నవ్విస్తుంది. పిచ్చి పిచ్చగా సాగే కథా కథనాలు ఉన్నా....కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా ఉంటాయి. ఇందులో సింబా చిత్రంలోని ఓ పాటకు నటీనటులంతా నృత్యాలు చేయబోతున్నాం. గోల్‌మాల్ 5వ సినిమా చేయవద్దనేందుకు కారణాలేం లేవు. కొత్త సినిమా చేయమని అంతా అడుగుతున్నారు. దర్శకుడు రోహిత్ శెట్టి కూడా ఆసక్తితోనే ఉన్నారు. అని చెప్పారు. ఈ చిత్రంలో తుషార్ కపూర్, కునాల్ ఖేము, శ్రేయాస్ తల్పడే ఇతర పాత్రల్లో

రొమాంటిక్ కామెడీతో సూర్యకాంతం


నిహారిక ,రాహుల్ విజయ్

నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'సూర్యకాంతం'. రొమాంటిక్ కామెడీతో ప్రణీత్ బ్రమండపల్లి తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేస్తారు. శుక్రవారం టీజర్ విడుదల చేశారు. శివాజీరాజా, సుహాసిని ఇతర పాత్రధారులు. మార్క్ కె. రాబిన్ సంగీతం అందిస్తున్నారు. అమెరికాకు చెందిన నిర్వాణ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వరుణ్ తేజ్ సమర్పిస్తున్నారు. నిర్మాతలు సందీప్ ఎర్రంరెడ్డి, సృజన్ యారబోలు, రామ్ నరేష్.

మరింత నవ్వించేందుకు



వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన సినిమా ఎఫ్2 ఫన్ అండ్ ఫ్రస్టేషన్. సంక్రాంతి చిత్రంగా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణతో మూడో వారంలోకి అడుగుపెట్టింది. వంద కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు సాధించింది. మరింత నవ్వించేందుకు శనివారం నుంచి కొత్త సన్నివేశాలు కలుపుతున్నట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు. సినిమా విజయోత్సవం పురస్కరించుకుని చిత్ర యూనిట్ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ...మా నిర్మాణ సంస్థకు, పరిశ్రమకు ఎఫ్2 మంచి విజయాన్ని అందించింది. వంద కోట్ల రూపాయల గ్రాసర్‌గా నిలిచింది. మేము సినిమా విడుదల ముందు కొన్ని సన్నివేశాలు నిడివి దృష్ట్యా పక్కన పెట్టాం. ఇప్పుడు సన్నివేశాలను కలపబోతున్నాం. మొత్తం ఐదు కొత్త సన్నివేశాలతో ఎఫ్2 శనివారం నుంచి థియేటర్‌లలో ప్రదర్శితం అవుతుంది. గతంలో సినిమా విజయాన్ని యాభై వంద రోజుల్లో చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు ఎంత వసూళు చేసిందనేది ముఖ్యంగా మారింది. త్వరలో అన్ని కేంద్రాలకు వంద కోట్ల రూపాయల గ్రాస్ జ్ఞాపికలు పంపిస్తాం. అన్నారు. తమన్నా మాట్లాడుతూ...దిల్ రాజు గారు నాకు అదృష్టాన్ని తెచ్చారు. హ్యాపీ డేస్ నుంచి ఆయనతో కలిసి చేసిన చిత్రాలు ఘన విజయం సాధించాయి. ఎఫ్ 2 కూడా అలాంటి విజయాన్నే అందించింది. కథ విన్నప్పుడే బాగుంటుంది అనిపించింది, చిత్రీకరణలో బాగా నవ్వుకున్నాం. మేము ఆశించిన ఫలితాన్నే ప్రేక్షకులూ ఇచ్చారు. ఈ విజయం దర్శకుడు అనిల్‌కు దక్కుతుంది. నేను ఏడాదిలో మూడు చిత్రాలు చేస్తుంటాను. ఏదో ఒక దాంట్లో పేరొస్తుంది. అది దర్శకుడి ప్రతిభ వల్లే. అని చెప్పింది. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ...ఈ సినిమా విజయం ఏ ఒక్కరిదీ కాదు అందరిదీ. చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ప్రతి ఒక్కరూ కష్టపడ్డారు. వంద కోట్ల రూపాయల గ్రాసర్ అంటే నాకొక కలగా ఉంది. నా సినిమాలు ఓవర్‌సీస్‌లో ఇప్పటిదాకా ఆడలేదు. ఈ సినిమా ఆ కొరతను తీర్చింది. అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి ప్రగతి, పాటల రచయిత కాసర్ల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సూర్యస్తమయం తొలి కాపీ సిద్ధం


సరోజ్ కుమార్

సినిమా అంటేనే 24 శాఖల సమ్మేళనం. ఇందులో 11 శాఖలను నిర్వహిస్తూ బండి సరోజ్ కుమార్ 'సూర్యాస్తమయం' పేరుతో సినిమా తీశారు. కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రధాన పాత్రలో కూడా నటించారు. ఈ చిత్రం తొలికాపీ సిద్ధమైంది. ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా బండి సరోజ్‌కుమార్ మాట్లాడుతూ ''సూర్యస్తమయం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. సహజసిద్ధమైన లొకేషన్లలో, నటీనటులకు మేకప్ లేకుండా తీశాం. ఇదే నేచురల్ యాక్షన్ మూవీ. ఒక పోలీస్‌కి, గ్యాంగ్‌స్టర్‌కి మధ్య జరిగే అంతర్యుద్ధం ఈ సినిమాలో ప్రధానాంశం. పోలీస్ పాత్రలో నేను, గ్యాంగ్ స్టర్‌గా త్రిశూల్ రుద్ర నటించాం. తమిళ నటుడు డేనియర్ బాలాజీ మరో ముఖ్యపాత్రని చేశారు. హైదరాబాద్, వికారాబాద్, నల్లగొండ, కడప, కర్ణాటకలో చిత్రీకరణ జరిపాం'' అని తెలిపారు.

ఈ చిత్రంలో ఇంకా హిమాన్సీ కాట్రగడ్డ, కావ్యా సురేష్, డేనియల్ బాలాజీ, మోహన్ సేనాపతి, వివేక్ ఠాగూర్ తదితరులు నటిస్తున్నారు.

హిందీ అర్జున్‌రెడ్డి సెట్లో ప్రమాదం



తెలుగు సూపర్‌హిట్ చిత్రం 'అర్జున్‌రెడ్డి' హిందీలో 'కబీర్‌సింగ్' పేరుతో హిందీలో రీమేక్ చేస్తున్నారు. షాహిద్ కపూర్, కియారా అద్వాని హీరో హీరోయిన్లు. తెలుగు సినిమాకు దర్శకత్వం వహించిన సందీప్ రెడ్డి హిందీ చిత్రానికి కూడా దర్శకత్వ బాధ్యతలు నెరవేరుస్తున్నారు. 'కబీర్‌సింగ్' చిత్రం షూటింగ్ సెట్‌లో ప్రమాదం జరిగింది. డెహ్రాడూన్‌లోని ముస్సోరీలో షూటింగ్ చేస్తున్నారు. ఇక్కడే జరిగిన ప్రమాదంలో జనరేటర్ ఆపరేటర్ రామ్ కుమార్ మృతి చెందారు. జనరేటర్‌లో నీటిమట్టం పరిశీలిస్తుండగా, ఆయన మెడకు ఉన్న మఫ్లర్ పొరపాటున జనరేటర్ ఫ్యాన్‌లో చిక్కుకుంది. రామ్‌కుమార్‌ను కూడా లాక్కెల్లింది. ప్రమాదం గమనించిన ఇతర యూనిట్ సభ్యులు అప్రమత్తమయ్యారు. ఆయనను కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన రామ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ''ఈ సంఘటన తమను ఎంతగానో కలచివేసిందని'' చిత్ర నిర్మాతలు ఆవేదన వ్యక్తం చేశారు. రామ్ కుమార్ కుటుంబానికి సానుభూతి తెలుపుతూ, '' మృతుడి కుటుంబానికి సాయం చేశామని'' వారు పేర్కొన్నారు.

వయసుకు మించిన పాత్రలో...!


అమృతారావ్

మనకో సమయమంటూ వస్తుంది అంటోంది బాలీవుడ్ భామ అమృతారావ్. అతిథి సినిమాతో తెలుగు ప్రేక్షకులకూ పరిచయమీ సుందరి. వివాహ్ సినిమాతో హిందీలో అరంగేట్రం చేసిన అమృతా...ఆ తర్వాత సత్యాగ్రహ్, జాలీ ఎల్ఎల్‌బీ, సింగ్ సాహెబ్ ద గ్రేట్ లాంటి చిత్రాలతో పేరు తెచ్చుకుంది. ఇటీవలే థాక్రే చిత్రంలో నటించింది. తన నట ప్రయాణం గురించి అమృతా మాట్లాడుతూ...థాక్రే చిత్రంలో నా వయసుకు మించిన పాత్ర చేశాను. ఈ క్యారెక్టర్‌లో నటించేప్పుడు సందేహాలు కలిగాయి. నేను నటిగా ఉండాలనుకున్నా కాబట్టి అంగీకరించాను. నాయికగా మిగిలిపోవాలనుకోలేదు. నట జీవితంలో ఎత్తుపల్లాలు ఎవరికైనా సహజం. నేను అరంగేట్రం చేసిన తొలినాళ్లలో మూడు చిత్రాలు వరుసగా అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత ఆర్థిక కారణాలతో మూడూ ఆగిపోయాయి. అనంతరం మూడు వరుస విజయాలు దక్కాయి. ఇలాంటివి జీవితంలో చూశాను. టైప్ కాస్టింగ్ మాకు ఎదురయ్యే అతి పెద్ద ప్రమాదం. ఒక తరహా పాత్రలు చేస్తే ఇక అలాంటి వాటికే అడుగుతుంటారు. నేనా ప్రమాదాన్ని ఎదుర్కొన్నాను. ఏమైనా మనకంటూ ఓ సమయం వస్తుందని ఆశిస్తున్నాను. నేను నారింజ అనుకుంటే..ఇప్పుడు మామిడికాయల కాలం నడుస్తోంది. నాకో సమయం వస్తుంది. అని చెప్పింది.